ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
31-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 120 పేజీలు: 16 వెల: 8.00

లోయలో పడిన బస్సు: 22 మంది దుర్మరణం

గ్రీన్‌కార్డుపై యుటర్న్: నిబంధనలు సడలించిన యుఎస్

5లో

శనివారం అచ్యుతాపురం సెజ్ లోని అంతర్జాతీయ వస్త్రతయారీ సంస్థను సందర్శించిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

మహిళా సాధికారతలో 'బ్రాండిక్స్' భేష్

అచ్యుతాపురం సెజ్‌లోని వస్త్ర తయారీ సంస్థలను పరిశీలించిన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్

జౌళి రంగంలోనే ఉపాధికి భారీ అవకాశాలు: మంత్రి

అనకాపల్లి (అచ్యుతాపురం), మే 30, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్త్ర పరిశ్రమ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర జౌళి శాఖమంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ప్రముఖ అంతర్జాతీయ వస్త్ర తయారీ సంస్థ 'బ్రాండిక్స్' ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సంస్థలో జరుగుతున్న వస్త్ర ఉత్పత్తుల తయారీ, అంతర్జా >>2

7 నుంచి రాష్ట్రమంతా యోగాంధ్ర

14 రోజులు నిర్వహణ.. 21న యోగాడే

అమరావతిలో 25 వేల మందితో రాష్ట్రస్థాయి కార్యక్రమం

గ్రామ స్థాయినుంచి కోటిమంది పాల్గొనేలా కార్యాచరణ

యోగాంధ్ర-26పై సమీక్షలో సిఎం చంద్రబాబు

శనివారం అమరావతిలో యోగాంధ్ర 2026 పై మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

విజయవాడ, మే 30, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా యోగాంధ్ర2026 నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే నిర్వహణకు సంబంధించి మంత్రులు, అధికారులతో సిఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా యోగాంధ్ర 2026పై తలపెట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాజధాని అమరావతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ వంతెనపై యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్ నిర్మాణంలో భాగంగా నదిపై నిర్మించిన బ్రిడ్జిపై కార్యక్రమం ఇంటర్నేషనల్ యోగా డే జూన్ 21న నిర్వహిస్తారు. అలాగే అదే రోజు జిల్లా కేంద్రాల్లో 1000 మందితో నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సీఎం సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ సిద్దంచేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1.50 లక్షలమంది ట్రైనర్లకు అందనంగా మరో లక్ష మందిని ట్రైనర్లుగా చేసేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఒక జిల్లా ఒక థీమ్ తో 14 రోజుల యోగాంధ్ర నిర్వహిస్తారు. జిల్లాల్లో యోగాంధ్ర నిర్వహణకు జిల్లాకు రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

అన్ని శాఖల సమన్వయం... కోటి మంది భాగస్వామ్యం..

ఆరోగ్య, మానవవనరులు, మునిసిపల్, పంచాయతీ రాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ టూరిస్టు ప్రాంతాల్లో అంటే 56 టూరిస్టు కేంద్రాల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తారు. ఒక రోజు రెండు జిల్లాలచొప్పున 500మందితో టూరిస్టు ప్రాంతాల్లో యోగా నిర్వహిస్తారు. అలాగే 14 రోజుల పాటు పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణవార్డు, స్వర్ణ గ్రామం కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలునిర్వహిస్తారు. యోగాంధ్ర ఈవెంట్స్‌కు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డులు చేస్తారు.

యోగాపై మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు..

రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు యోగాంధ్ర నిర్వహణకు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను సిఎం చంద్రబాబు ఆవిష్కరించారు. యోగాపై అవగాహనకు, శిక్షణకు తాను చేపట్టిన కార్యక్రమాలను సత్యనారాయణ రాజు సీఎంకు వివరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాలు వీడియోలు, రోజు వారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై >>2

కర్ణాటక సిఎల్‌పి నేతగా డికె

సిద్ధరామయ్య ప్రతిపాదనకు ఏకగ్రీవ ఆమోదం

3న సిఎంగా పదవీ ప్రమాణం

నలుగురు డిప్యూటీ సిఎంలకు డికె 'నో'

బెంగళూరు, మే 30: కర్ణాటక ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సిఎల్పీ నేతగా డికె శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సిఎం సిద్ధరామయ్య డికె పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సిఎల్పీ నేతగా డికె శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎఐసిసి పరిశీలకులు ప్రకటించారు. కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగిసింది. కొత్త ముఖ్యమంత్రి డికె శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం జూన్ 3వ తేదీ జరుగుతుంది. రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జిసి చంద్రశేఖర్ ప్రకటించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం లోక్‌భవన్‌లో జరుగుతుందని నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సిఎం ప్రమాణ స్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్లు చంద్రశేఖర్‌చెప్పారు. డికె శివకుమార్ శనివారం ఉదయం లోక్ భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌తో భేటీఅయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధిం >>2

క్వాంటం వ్యాలీపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

కమిటీ చైర్మన్‌గా శైలజ నియామకం

విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి క్వాంటం వ్యాలీ, క్వాంటంటెక్నాలజీస్, బయోసైన్సెస్ రంగాల్లో వ్యూహాత్మక మార్గదర్శకత్వం, ప్రణాళికలు అమలు ప్రక్రియలను పర్యవేక్షించడం కోసం ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి ఐటిశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. క్వాంటం వ్యాలీ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా యాక్షన్‌ప్లాను రూపొందించేందుకు వేర్వేరు రంగాలతో కూడిన నిపుణులతో ఈ కమిటీ వేసినట్లు పేర్కొన్నారు. 20 సభ్యులుఉండే ఈ కమిటీకి సిఎస్ఐఆర్ బిజినెస్ డెవలప్‌మెంట్‌హెడ్ శైలజ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

కోచైర్మన్‌గా సెంటర్ ఫర్ సింథటిక్ బయాలజీ అండ్ బయోమాన్యుఫాక్చరింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవన్ కె. ధార్‌ను నియమించారు. ఐటిశాఖ డైరెక్టర్ గీతాంజలి సభ్య కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. కమిటీలో సివి శ్రీధర్, శేష రఘునాథన్, రాజ్‌గోపాల్ శ్రీనివాసన్, అమిత్ రాయ్, అమోఘ్ అప్పింగేకర్, వెంకట్ సుబ్రమణ్యం, సౌరి గుడ్లవల్లేటి, రియాజ్ సయ్యద్ సభ్యులుగా ఉంటారు. ఫార్మాస్యూటికల్ రంగం నుండి సురేష్ పోడ, ప్రవీణ్ రావు అక్కినేపల్లి, రాధా రంగరాజన్, విజయ్ పాండే, శశికాంత్, రామ్ విశ్వకర్మను సభ్యులుగా నియమించారు. విద్యారంగం నుండి దేవా ప్రియాకుమార్, ప్రొఫెసర్ ఆరత్ కల్రా, ప్రొఫెసర్ కస్తూరి సాహా టాస్క్‌ఫోర్స్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

చెత్తనుంచి ఇంధనం ఉత్పత్తి

శనివారం కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును పరిశీలిస్తున్న డి.సిఎం పవన్

కొండవీడులోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను పరిశీలించిన డి.సిఎం పవన్

త్వరలో మరో 6 ప్లాంట్ల ఏర్పాటు

డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఎపి: డి.సిఎం

గుంటూరు మే 30 ప్రభాత వార్త ప్రతినిధి : చెత్త నుంచి సంపద సృష్టించే మార్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును శనివారం పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి విద్యుత్తు తయారీ ప్రక్రియను ఆసాంతం పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. చెత్తను ఎలా వేరు చేస్తారు, ఎలా శుద్ధి చేస్తారు, దేనికి ఉపయోగిస్తారనే విషయాలను ప్లాంటు అధికారులు డిప్యూటీ సిఎంకు వివరించారు. ముఖ్యంగా చెత్తను బాయిలర్లలో మండించడం ద్వారా విద్యుత్తు తయారీ ఎలా జరుగుతుందో, చివరికి బూడిదను ఇటుకల తయారీకి ఎలా వినియోగించుకోవచ్చో అధికారులు క్షుణ్ణంగా పవన్ కల్యాణ్‌కు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడూతూ రాష్ట్రంలో రోజువారీగా 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని కొండవీడు జిందాల్ ప్లాంటు సామర్థం రోజువారీ 1,400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి, సగటున 20 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలదని తెలిపారు. దాన్ని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడంతో రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చగలదని పేర్కొన్నారు. విశాఖపట్నంలోనూ జిందాల్ ప్లాంటు ఉత్తరాంధ్ర రీజియన్ చెత్తను సేకరించి 15 మెగావాట్లు విద్యుత్తు ఉత్పాదన చేస్తోందని తెలిపారు. ఈ తరహా ప్లాంట్లు రాష్ట్రంలో త్వరలో మరో ఆరు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీనిలో కాకినాడలో ఇప్పటికే పనులు మొదలు కాగా, నెల్లూరు, కడప కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో కూడా త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. బయో మిథలైజేషన్ ప్లాంట్ల నుంచి బయోగ్యాస్ కూడా ఉత్తత్తి చేయవచ్చని.. పూలు, పండ్లు, కూరగాయాలు, ఆహార వ్యర్థాలను ఉపయోగించి, క్రమ పద్ధతిలో వేరు చేసి దాని ద్వారా గ్యాస్ ఉత్తత్పి చేయవచ్చని అన్నారు.

కాలుష్యరహిత పుష్కరాలు

గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించాలనే పట్టుదలతో కూటమి ప్రభుత్వం ఉందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గోదావరి నదిలో కలుస్తున్న వ్యర్థాలను పూర్తిస్థాయిలో అరికట్టేలా చిత్తశుద్ధితో ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నామని అన్నారు. చెత్త నిర్వహణను పక్కాగా చేసేందుకు జిందాల్ అనుసరిస్తున్న విధానాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి 268 పంచాయతీలు ప్రత్యక్షంగా భాగస్వామ్యం అవుతాయని, ఈ పంచాయతీల్లో చెత్త నిర్వహణ అనేది చాలా కీలకమని తెలిపారు. నదిలోకి వ్యర్థాలను విడుదల చేయకుండా, నదిని అందంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దడం మీద పంచాయతీల అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని >>2

ఢిల్లీలో పేలుళ్ల కుట్ర భగ్నం

పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 9 మందిని అరెస్టు చేసిన పోలీసులు

భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త: దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి వరుస పేలుళ్లకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పన్నిన కుట్రను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు శనివారం నాడు భగ్నం చేశారు. రక్షణ, పోలీసు బలగాలు మోహరించే కీలక స్థావరాలు, ప్రార్థన స్థలాలను ఉగ్రవాదులు టార్గెట్ చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది ఉగ్రవాదులు అరెస్టవగా వారి వద్ద నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో కొందరు నేపాల్‌కు చెందిన వారుండగా వీరికి పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అండదండలున్నట్లు వెల్లడయ్యింది. ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు రహస్య >>2

ఇంకా విభిన్న వాతావరణం



అనంతపురం జిల్లా హుస్సేన్ పురంలో 51 మి.మీ వర్షపాతం

నంద్యాల జిల్లా సంజామలలో 41.4^{0} ఉష్ణోగ్రత

విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావంతో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి అనంతపురం జిల్లా హుస్సేన్ పురంలో 51మిమీ, కడప జిల్లా పెద్ద పసుపల్లెలో 45మిమీ, చిత్తూరు జిల్లా గంగవరంలో 41.7మిమీ, అనంతపురం జిల్లా వెన్నపూసపల్లెలో 31.5మిమీ, కడప జిల్లా ఉప్పలూరులో 29మిమీ, తొర్రివేముల 26మిమీ, పొత్తిపాడులో 26మిమీ, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 20. 5మిమీ వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. మరోవైపు శనివారం రాష్ట్రంలో నంద్యాలజిల్లా సంజామలలో 41.4డిగ్రీలు, అనంతపురంజిల్లా హుస్సేన్ పురంలో 40.2, కర్నూలుజిల్లా బస్తిపాడు, మార్కాపురంజిల్లా కంభం, వైఎస్సార్ కడపజిల్లా మంగపట్నం 40 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో క్రమంగా ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి కొన్నిప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక ఆదివారం 17 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మన్యం జిల్లా సీతంపేట మండలం పోలవరం జిల్లా చింతూరు, దేవిపట్నం, కూనవరం, మారేడుమిల్లి, రంపచోడవరం, వరరామచంద్రాపురం, ఏలూరు జిల్లా.. బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు. కృష్ణా >>2

డిస్టిలరీల నుంచి వందల కోట్లు వసూలు

ప్రణయ్ ప్రకాశ్ అక్రమాలపై ఎసిబి కోర్టులో సిట్ ఛార్జిషీటు

ఎపి లిక్కర్ కేసు

విజయవాడ, మే 30, ప్రభాతవార్తప్రతినిషధి: ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో అత్యంత కీలకమైన అంశాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి,. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్). ఎసిబి కోర్టులో తాజాగా మరో అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌లో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ ఆర్థిక లావాదేవీలను సిట్ ఆధారాలతో కోర్టు ముందుఉంచింది. సిట్ సమర్పించిన నివేదిక ప్రకారం.. వివిధ డిస్టిలరీల నుంచి వందల కోట్ల రూపాయల మేర వసూళ్లకు పాల్పడిన వ్యవహారంలో ప్రణయ్ ప్రకాశ్ అత్యంత కీలక సూత్రధారిగా వ్యవహరించారు. ఈ వసూళ్ల పర్వంలో ఆయన ఒంటరిగాకాకుండా, లూప్‌లో ఉన్న పలువురు ప్రభావవంతమైన వ్యక్తులతో కలిసి ఒక సిండికేట్‌గా పనిచేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ప్రణయ్ ప్రకాశ్ మద్యం అక్రమ సంపాదనతో ఎలాంటి విలాసవంతమైన జీవితాన్ని గడిపారనేది సిట్ ఛార్జిషీట్‌లో వివరంగా >>2

ఇంటర్ విద్యార్థులకు వేసవి సెలవులు పెంపు

విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి: ఎపిలో విద్యార్థులకు ఇచ్చిన వేసవి సెలవులు త్వరలో ముగియనున్నాయి.. కళాశాలలు, పాఠశాలలు పున:ప్రారంభం అయ్యేందుకు మరికొద్దిరోజులే సమయం ఉంది. విద్యాశాఖ ఇప్పటికే కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్లను విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవులు అనంతరం జూన్ 1వ తేదీన జూనియర్ కళాశాలలు పున: ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, జూన్ 1వ తేదీనకాకుండా 6వ తేదీన పాఠశాలలు పున:ప్రారంభం చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ నిర్ణయించింది. ఎందుకంటే.. జూన్ ఐదో తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉండటంతో ఈ మార్పులు చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. జూన్ 6వ తేదీ నుంచి జూనియర్ కాలేజీలు పున: ప్రారంభించాలని సూచించారు. అయితే, అకడమిక్ క్యాలెండర్ ప్రకటించిన మిగతా కార్యక్రమాల్లో ఎలాంటి మార్పూ ఉండదని తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి.

31-05pg2exHMNWJQE.qxd:31-05pg2exHMNWJQE.qxd 1/1/02 6:55 AM Page 1

శనివారం బోధగయలోని విమానాశ్రయంలో మయన్మార్ అధ్యక్షుడు యు మిన్ ఆంగ్ హ్లైంగ్‌కు స్వాగతం పలుకుతున్న బీహార్ గవర్నర్ సయ్యద్ అలా హాస్‌నైన్

దేశంలోనే తొలిసారి ఎపిలో 'పిఎంసేతు' పథకం అమలు

విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి: దేశంలోనే తొలిసారి ఎపిలో పిఎం సేతుపథకం అమలు కానుంది. దేశంలోనే తొలిసారి ఎపిలో పిఎంసేతు పథకం అమలుకు అవకాశం కల్పిస్తూ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ నిర్ణయం తీసుకుంది. ఆర్సెల్లార్ మిత్తల్ భాగస్వామ్యంతో విశాఖ ఐటిఐ రూపురేఖలు మారనున్నాయి. కోర్సు పూర్తికాగానే ఉద్యోగాలు పిఎంసేతు అమలు అవకాశాన్ని కేంద్రం ఎపికి కల్పించడం విశేషం. అందుకు అనుగుణంగా విశాఖ ఐటిఐ క్లస్టర్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు కేంద్రం ఆమోదించింది. విశాఖలో ఐటీఐల ఆధునీకరణకు అకడమిక్ భాగస్వామిగా 'నామ్‌టెక్' ఉండనుంది. ఐటీఐల ఆధునీకరణకు రూ.60 వేల కోట్ల బడ్జెట్‌తో 'పిఎంసేతు' రూపకల్పన కానుంది. హబ్ అండ్ స్పోక్‌విధానంలో ఐటిఐ విద్యార్థులకు సరికొత్త సాంకేతిక శిక్షణను ఇవ్వనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐటిఐ విద్యార్థులకు సరికొత్త సాంకేతిక శిక్షణ అందుతుంది. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా ఐటిఐలను కేంద్రం బలోపేత చేస్తుండటం గమనార్హం.

జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

ఇంజిన్‌లో మంటలు గమనించిన వెంటనే ఆపేసిన డ్రైవర్

ప్రయాణికులు వెంటనే దిగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం

డ్రైవర్ అప్రమత్తతతో 36మంది ప్రయాణికులు సురక్షితం

ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బస్సు

చిట్యాల రూరల్, మే 30, ప్రభాతవార్త : ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 65పై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇంజిన్‌లో మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సును వెంటనే రహదారి పక్కకు నిలిపివేసి ప్రయాణికులను సురక్షితంగా బయటకు పంపించడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్‌బో ట్రావెల్స్‌కు చెందిన ఎన్ఎల్ 07 బి0886 నెంబరు గల ప్రైవేటు ట్రావెల్స్ బస్సు శుక్రవారం రాత్రి 8:45 గంటలకు హైదరాబాద్‌లోని లింగంపల్లి నుంచి కాకినాడకి 36 మంది ప్రయాణికులతో బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారుకు రాగానే అంతర్గతంగా చోటుచేసుకున్న విద్యుదాఘాతంతో ఇంజిన్‌లో ఒక్కసారిగా పొగలు రావడం ప్రారంభమైంది. దీన్ని గమనించిన డ్రైవర్ నాగరాజు వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. డ్రైవర్, క్లీనర్ ప్రయాణికులను గట్టిగా అరుస్తూ కిందికి దిగిపోవాలని సూచించారు. దీంతో నిద్రలో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురై హుటాహుటిన బయటకు పరుగులు తీశారు. అందరూ సురక్షితంగా దిగిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులంతా ప్రాణాలతో బయటపడినప్పటికీ... లగేజ్ క్యాబిన్‌లోని బ్యాగులు, ఇతర విలువైన సామాగ్రి బస్సులోనే పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. బస్సులో మంటలు చెలరేగడానికి ప్రాథమికంగా బ్యాటరీ లేదా ఇంజిన్ విభాగంలో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం కారణంగా 65 నెంబర్ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇంకా విభిన్న వాతావరణం

>> జిల్లా.. ఘంటసాల, మొవ్వ..గుంటూరు జిల్లా.. కాకుమాను, పొన్నూరు బాపట్ల జిల్లా.. బాపట్ల, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో(17) వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు సముద్ర మట్టానికి సగటున 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు.

దీని ప్రభావంతో ఆదివారం అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లోనూ చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఆకస్మికంగా ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

హాథీరామ్‌జీ మఠం అధిపతిగా అర్జున్‌దాస్ కొనసాగింపు

సుప్రీం కోర్టు కీలక తీర్పు

తిరుపతి, మే 30 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రియ భక్తుడైన హాథీరాంజీబావాజీ మఠం నిర్వహణకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక తీర్పువెలువడించింది, ఈ ఉదంతంలో ఇప్పటికే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టుకొట్టివేసింది. అర్జున్‌దాస్‌కు మఠాధిపతి హోదా కొనసాగించాలని పేర్కొంది. అర్జున్‌దాస్‌పై గతంలో వచ్చిన ఆరోపణలపై విశ్రాంత న్యాయమూర్తి వడ్డేపల్లి రామారావుతో విచారణ కమిటీ ఏర్పాటుచేసి, యేడాదిలోగా నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా ముఖ్యంగా తిరుపతి జిల్లాలో తిరుపతి పరిసరాల్లో ఉన్న కోట్లాదిరూపాయలు విలువైన మఠం ఆస్తులపర్యవేక్షణకు జస్టిస్ దుప్పల వెంకటరమణ నేతృత్వంలో కమిటీ వచ్చి విచారణ చేయనుంది. మఠం ఆస్తుల జాబితా తయారుచేసి రక్షణ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో కీలకంగామారింది. ఇప్పటికే తిరుపతి పరిసరాల్లో మఠంభూములు అన్యాక్రాంతమవ్వడం, కొందరు ఆక్రమించుకుని ఇళ్లు, అపార్టుమెంట్లు,పెద్దపెద్ద భవనాలు నిర్మించుకోవడం జరిగింది. ఈ వ్యవహారంపై పెద్ద దుమారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యంతో కమిటీ ఏర్పాటుతో అక్రమార్కులకు రైళ్ల పరుగెడుతున్నాయి.

రాష్ట్రమంతా యోగాంధ్ర

>> 7 వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలుసమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైనులో పెట్టనున్నట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 8142404888 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఈ వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణ రాజు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్‌తో పాటు సిఎస్ సాయి ప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం..

రాజధాని అమరావతిలో నిర్మాణాలు, వేగవంతంగా జరాగలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం జరిగింది,.హాజరైన పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సిఎస్ సాయి ప్రసాద్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఎడిసి, సిఆర్‌డిఎ, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరై రాజధాని నిర్మాణం ఇతర సమావేశాలపై చర్చించారు. ఇతర ప్రతిపాదనలపై సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో చర్చించారు, అమరావతిలో ఇప్పటివరకూ 114 సంస్థలకు 1269 ఎకరాలు కేటాయించాం. వీటిలో 70 ప్రభుత్వ సంస్థలు,44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. భూములు కేటాయించిన వాటిలో బ్యాంకులు 16,ఉద్యోగుల ఇళ్ల కోసం 8 బ్యాంకులకు,విద్యాసంస్థలు 22,రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 13,కేంద్రప్రభుత్వ సంస్థలు 17,వైద్య సంస్థలు 7,హోటల్స్ 14,క్రీడా సంస్థలు 2,ఇతర సంస్థలు 5 ఉన్నాయి. ఇక నిర్మాణాల దశను చూస్తే 20 సంస్థలు నిర్మాణం కొనసాగుతుండగా,9 సంస్థలు నిర్మాణం పూర్తయ్యాయి.18 సంస్థలు నగదు చెల్లించే దశలో,25 సంస్థలు అగ్రిమెంట్ దశలో,మరో 38 సంస్థలు డిజైన్ల దశలో ఉన్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.

కర్ణాటక సిఎల్‌పి నేతగా డికె

>> చిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌కు డికె లేఖ అందించారు. ఆయన వెంట సిద్ధరామయ్యతోపాటు పలువురు సీనియర్ కేబినెట్ సహచరులు కూడా ఉన్నారు. గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఈ రోజే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డికె ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సిఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నాయి. సీఎం పదవికి రాజీనామా చేసి ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. అయితే సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం.

నలుగురు ఉపముఖ్యమంత్రులకు డికెశివకుమార్ నో

కర్ణాటక సిఎంగా పగ్గాలు చేపట్టబోతున్న డికె శివకుమార్ తన క్యాబినెట్‌లో నలుగురు ఉప ముఖ్యమంత్రుల ప్రతిపాదనకు నో చెప్పారు. ఈ విషయంలో తన నిర్ణయాన్ని ఆయన అధిష్ఠానానికి తెలియజేశారు. కర్ణాటక కాంగ్రెస్‌లో చాలామంది సీనియర్లు ఉన్నందున కొందరిని మాత్రమే ఉపముఖ్యమంత్రులుగా ఎంపిక చేయడంవల్ల పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి రేగుతుందని పార్టీకి వివరించారు.

జూన్ 3న డికె శివకుమార్‌తోపాటు కొద్దిమంది మాత్రమే మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలుస్తోంది. రాష్ట్ర నాయకత్వం, కాంగ్రెస్ అధిష్ఠానం మధ్య సంప్రదింపుల అనంతరమే తదుపరి మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. కర్ణాటక అసెంబ్లీలో మొత్తం 32 మందిని మంత్రివర్గంలోకి తీసుకునే వీలుంది. మంత్రివర్గం కూర్పుపై చర్చలను కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ముమ్మరం చేసింది.పలువురు సీనియర్ మంత్రులను క్యాబినెట్‌లోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆ సీనియర్‌లలో ఎంబీ పటేల్, జి పరమేశ్వర, కేజీ జార్జి, ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సిద్ధరామయ్య, కేబీ గౌడ, లక్ష్మీ హెబ్బాల్కర్, బి సురేష్, సంతోష్ లాడ్ పేర్లు ఉన్నాయి. అసెంబ్లీ స్పీకర్ పదవికి రేసులో సీనియర్ మంత్రులు హెచ్ఎం మునియప్ప, హెచ్‌కే పటేల్ ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం, శివకుమార్, సిద్ధరామయ్య మధ్య సంప్రదింపుల ఆధారంగానే మంత్రివర్గం తుది కూర్పు ఉంటుందని చెబుతున్నారు.

రిటైర్డ్ ఎస్‌డిసికి 6 శాతం పెన్షన్ కోత

విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అమరావతి పరిధిలో మిగులు భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో రిటైర్డ్ ఎస్‌డిసి మిరియాల దాసుపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆయన పెన్షన్లో 6 శాతం కోత విధించింది. విజిలెన్స్ డిజి ఇచ్చిన విచారణ నివేదిక ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజధాని పరిధిలో మిగులు భూములను అప్పటి రెవెన్యూ అధికారుల అండదండలతో మువ్వా కోటేశ్వరరావు అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని నిర్ధారించారు. దీనిపై విచారించగా.. అప్పటి ఎస్‌డిసి దాసు సహకరించారని విచారణలో తేలింది. దీనిపై విజిలెన్స్ విచారణ అనంతరం దాసుపై చర్యలు తీసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం దాసు రిటైరైన నేపథ్యంలో ఆయనకు అందే పెన్షన్లో 6 శాతం కోత విధించాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఢిల్లీలో పేలుళ్ల కుట్ర భగ్నం

>> ప్రాంతంలో విచారిస్తున్నారు. ఈ యేడాది గణతంత్ర దినోత్సవం నాడు ఢిల్లీలో పేలుళ్లకు ఉగ్రవాదులు పన్నిన కుట్ర భగ్నం కాగా అంతకు మించిన ఉగ్రదాడికి పాక్ టెర్రరిస్టులు రెడీ అవగా చివరి నిమిషంలో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు దానిని అడ్డుకున్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశ రాజధానిలో మరోసారి భారీ ఉగ్ర కుట్రకు వ్యూహాలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అన్ని నగరాల పోలీసులు అప్రమత్తంగా వుండడం తెలిసిందే. ఉగ్రవాదులు ఢిల్లీని టార్గెట్ చేశారని పక్కా సమాచారం వుండడంతో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు లోతుగా విచారించగా కొందరు ఉగ్రవాదులు నక్కిన రహస్య ప్రాంతం గురించి సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయం ఆ ప్రాంతంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా తొమ్మిది మంది ఉగ్రవాదులు పట్టుబడ్డారు. వీరిలో భారత్‌కు చెందిన వారితో పాటు నేపాల్ వాసులు కూడా వున్నారని తెలిసింది. ఉగ్రవాదుల వద్ద అధునాతన తుపాకులు, హ్యాండ్ గ్రేనేడ్లు, పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. తుపాకులను వెంటనే స్వాధీనం చేసుకున్న పోలీసులు హ్యాండ్ గ్రేనేడ్లు, పేలుడు పదార్థాలను నిపుణుల సమక్షంలో జాగ్రత్తగా స్వాధీనం చేసుకుని అవి పేలకుండా తగిన భద్రత మధ్య ఫోరెన్సిక్ లాబ్‌కు తరలించారు. కాగా ఉగ్ర నెట్ వర్క్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించడం వెనుక దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీం డోలా అరెస్టు, అతను ఇచ్చిన సమాచారం వుందని తెలిసింది. భారత్‌లో జరిగిన అనేక నేరాలు, ఘోరాలకు కారకుడైన సలీం డోలా నెల రోజుల క్రితం టర్కీలో పట్టుబడగా అతన్ని భద్రతా బలగాలు దౌత్య మార్గంలో భారత్‌కు రప్పించారు. 2020 నుంచి ఇతను పరారీలో వుండగా ఇస్తాంబుల్‌లోని బేలిక్‌దుజులో రహస్యంగా వుండగా టర్కీ పోలీసుల ఆపరేషన్‌లో పట్టుబడ్డాడు. టర్కీలో ఇతనిపై మాదక ద్రవ్యాలకు సంబంధించిన అనేక కేసులుండగా ఆ కేసుల్లోనే ఇతన్ని అరెస్టు చేశారు. అనంతరం డోలాను దేశ బహిష్కరణ చేయగా ఇదే సమ యంలో భారత్ అతన్ని ఇక్కడకు రప్పించి ఉగ్ర కుట్రలపై విచారించి కీలక సమాచారం రాబట్టింది. డోలా అందించిన సమాచారం ఆధారంగా దావూద్ ఇబ్రహీం భారత్‌లో మరోమారు ఉగ్రదాడికి పథకం రచించినట్లు వెలుగు చూసింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో స్లీపర్ సెల్‌కు చెందిన ఉగ్రవాదులు వున్నట్లు డోలా పోలీసుల విచారణలో తెలపగా వారిని పోలీసులు పట్టుకున్నారు.

ఇంధనం ఉత్పత్తి

>> నిర్ణయించామని స్పష్టం చేశారు.

దేశంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరపాలక సంస్థ చెత్త సేకరణ విధానం ఆదర్శమని డిప్యూటీ సిఎం అన్నారు. చెత్తను ప్రజల దగ్గర నుంచి సేకరించి, వినియోగం వరకు స్ఫూర్తిగా నిలుస్తోందనితెలిపారు. ఇండోర్ వేస్ట్ మేనేజ్మెంట్ మోడల్ రాష్ట్రంలోని అర్బన్, గ్రామీణప్రాంతాలకు ఆదర్శం కావాలని అన్నారు. రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దాలంటే వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు మరిన్ని అవసరం వుందని అన్నారు. చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి తయారీ ప్లాంట్లలో ఒక మెగావాట్ విద్యుత్తు తయారీకి అవసరం అయ్యే ప్లాంటు నిర్మాణానికి రూ.25 కోట్లు మేర ఖర్చు అవుతుందని. అలాగే ఒక మెగావాట్ విద్యుత్తు తయారీకి సగటున 2.5 టన్నులచెత్త అవసరం అవుతుందని ఈ ప్లాంట్ల ఏర్పాటుతో స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. పంచాయతీల్లో చెత్తనిర్వహణకు సంబంధించి క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని అన్నారు. డంపింగ్ యార్డ్‌లు లేని పంచాయతీలను సాకారం చేసేందుకు వర్క్ షాపులను నిర్వహించేలా చూడాలని స్పష్టం చేశారు.

వారం - వర్జ్యం

31-05-2026, అధికజ్యేష్ఠ ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
పౌర్ణమి మ.2.15
అనూరాధ సా.4.12
వర్జ్యం : రా.10.29-రా.12.17
దు.సా.4.47-సా.5.39
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

వార్తాఫలం

మేషం: మిత్రుల నుండి మీరు ఆశించిన సహాయమును పొందగలుగుతారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

వృషభం: మీ అభిప్రాయములను కొన్ని సలహాలను అమలు పరచుట వలన భాగస్వాములు లాభములు పొందుతారు.

మిథునం: మీరు నిర్లక్ష్యముతో పోగొట్టుకున్న వస్తువులు కనబడకపోవచ్చును. కుటుంబ సభ్యుల సాయం పొందుతారు.

కర్కాటకం: వృత్తి రీత్యా మీరు చేసే ప్రయాణములు అనుకూలిస్తారు. ఖర్చులు అధికంగా ఉంటాయి.

సింహం: నంస్థ వ్యవహారములు నెరవేరుటకు పలుకుబడి గల వ్యక్తుల సహాయమును తీసికొనుట మంచిది.

కన్య : కొత్తగా చేపట్టే ఉద్యోగమునకు సంబంధించి మీరు ధైర్యముతో తీసికొనే నిర్ణయము వలన లాభం పొందుతారు.

తుల: వాహనములకు, టెలిఫోన్స్‌కు, ధనవ్యయం గోచరిస్తుంది. నూతన వస్త్రాలు ఖర్చు మీ అంచనాలు దాటుతాయి.

వృశ్చికం: అధికారము నుండి మాట పడకుండా ముందు జాగ్రత్త చర్యలను పాటించండి. ఉద్యోగులకు బదిలీలు.

ధనుస్సు: మీరు దర్శించుకోవాలి అనుకున్న ప్రదేశమునకు ప్రయాణము అనుకూలిస్తుంది. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

మకరం: ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. పురోభివృద్ధి మాత్రం నామమాత్రంగా సాధిస్తారు.

కుంభం: ఉమ్మడి ఏ కార్యకలాపములను చేపట్టకండి. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి, శుభవార్తలు అందుకుంటారు.

మీనం: వివాదాస్పద వ్యవహారములు పరిష్కార మౌతాయి. టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలంగా వస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

శనివారం లక్నోలో 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవం దృశ్యం

మహిళా సాధికారతలో 'బ్రాండిక్స్' భేష్

>> తీయ ఎగుమతులు, దిగుమతుల ప్రక్రియను బ్రాండిక్స్ ఇండియా డైరెక్టర్, భారతీయ భాగస్వామి దొరస్వామి మంత్రికి క్షుణ్ణంగా వివరించారు. ఫ్యాక్టరీ అంతటా పర్యటించి కార్మికుల పనితీరును, వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించిన కేంద్రమంత్రి, యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించారు.కోటి పెట్టుబడికి 50 మందికి ఉపాధిఅనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక రంగం టెక్స్‌టైల్స్ (జౌళి) మాత్రమేనని మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. గార్మెంట్ రంగానికి ఉన్న ఉపాధి సామర్థ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టే ప్రతి రూ. 1 కోటి పెట్టుబడికి సుమారు 50 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన వెల్లడించారు. బ్రాండిక్స్ వంటి భారీ పరిశ్రమల ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు వేల సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బ్రాండిక్స్ రాకతో ఈ ప్రాంతంలో మహిళా సాధికారత గణనీయంగా పెరిగిందని స్థానికులు తనకు స్వయంగా తెలిపారన్నారు. ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా బలోపేతమైతే ఆ కుటుంబమంతా వృద్ధి చెందుతుందన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో సరికొత్త విప్లవంభవిష్యత్తు అంతా సాంకేతిక వస్త్రాల దేనని కేంద్ర మంత్రి చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో ఈ రంగం అభివృద్ధిపై తాము సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం సాధారణ దుస్తులతో పాటు ఏరోస్పేస్, డ్రోన్లు, రక్షణ, వైద్య, వ్యవసాయ రంగాలలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని వివరించారు. ఈ సరికొత్త విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జౌళిశాఖ ఉన్నతాధికారులు, బ్రాండిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతకం చేయని ట్రంప్

ముందుకు కదలని శాంతి ఒప్పందం

పశ్చిమాసియాలో మరింత పెరిగిన ఉద్రిక్తతలు

వాషింగ్టన్, మే 30: మధ్యప్రాచ్యంలో నెలల తరబడి సాగుతున్న భీకర యుద్ధానికి ముగింపు పలికే దిశగా దౌత్య వ్యూహాలు వేగవంతమయ్యాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు, దానిపై ఒక తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని అత్యంత సురక్షితమైన సిచ్యువేషన్ రూమ్‌లో సలహాదారులతో సమావేశం అయ్యారు. ఈ చర్చల తర్వాత అతి త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా ఒక సంచలన ప్రకటన రాబోతోందని ఆయన సంకేతాలిచ్చారు.అయితే కాల్పుల విరమణ పొడిగింపు ఒప్పందంపై సంతకం చేయకుండానే వెనుదిరిగినట్లు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరాలంటే ఇరాన్ ప్రభుత్వం తమ కఠినమైన షరతులకు లొంగాల్సిందేనని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో అల్టిమేటం జారీచేశారు.

ఇరాన్ తన అణ్వాయుధ ఆశయాలను పూర్తిగా వదిలి పెట్టాలి. భవిష్యత్తులో ఇరాన్ దగ్గర ఎలాంటి అణు బాంబులు ఉండకూడదని హామీ ఇవ్వాలి. అంతర్జాతీయ చమురు, వాణిజ్య రవాణాకు గుండెకాయ లాంటి హార్ముజ్ జలసంధిని తక్షణమే రెండు వైపులా తెరవాలి. ఎలాంటి టోల్ టాక్స్ లేకుండా, ఎవరి జోక్యం లేకుండా అంతర్జాతీయ నౌకల రాకపోకలను అనుమతించాలి. హార్ముజ్ జలమార్గంలో ఇరాన్ అమర్చిన భయంకరమైన సముద్రపు మైన్లను తక్షణమే తొలగించాలి. ఇరాన్ వద్ద ఉన్న అత్యంత ప్రమాదకరమైన సుసంపన్న యురేనియం నిల్వలను నాశనం చేయడంపై అమెరికా ప్రత్యేక ప్లాన్ సిద్ధం చేసింది. దాదాపు 11 నెలల క్రితం అమెరికాకు చెందిన శక్తివంతమైన బి2 బాంబర్ యుద్ధ విమానాలు ఇరాన్ అణు కర్మాగారాలపై దాడి చేశాయి. భూగర్భంలో పాతిపెట్టుకుపోయిన ఆ సుసంపన్న యురేనియం పదార్థాన్ని ఇప్పుడు అమెరికా, ఇరాన్ మరియు అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీలు ఉమ్మడిగా తవ్వితీసి పూర్తిగా నాశనం చేస్తాయని ట్రంప్ స్పష్టంచేశారు. ఈ ఒప్పందంలో తదుపరి నోటీసు ఇచ్చేంతవరకు ఎలాంటి డబ్బు మార్పిడి (ఆర్థిక సహాయం) ఉండదని తేల్చిచెప్పారు.

వందల కోట్లు వసూలు

>> పేర్కొంది. వైసీపీ నేత చెవిరెడ్డితో కలిసి పలుమార్లు విదేశీ పర్యటనలు చేసినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డితో కలిసి చార్టర్డ్ విమానాల్లో ప్రయాణిస్తూ, దేశ విదేశాల్లోని అత్యంత ఖరీదైన హోటళ్లలో బస చేస్తూ కోట్లాది రూపాయలు విలాసాలకు తగలేసినట్లు సిట్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మద్యం అక్రమ లావాదేవీల ద్వారా వసూలైన లెక్కల్లో లేని భారీ నగదును దాచడానికి నిందితులు ఒక ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పలు నగరాల్లోని విలాసవంతమైన అపార్ట్‌మెంట్లను కేవలం నగదు దాచడానికే అద్దెకు తీసుకున్నారు. ఆ ఫ్లాట్లలోని రహస్య ప్రదేశాల్లో పెద్ద ఎత్తున నగదు కట్టలను భద్రపరిచినట్లు సిట్ ఆరోపించింది.ఈ గుట్టు మొత్తాన్ని సిట్ అధికారులు పక్కా టెక్నికల్ ఆధారాలతో బట్టబయలు చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌ల నుంచి సేకరించిన డేటాను డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ చేయడం ద్వారా ఈ వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, లొకేషన్ డేటా, వాట్సాప్ చాట్‌లను సమగ్రంగా క్రోడీకరించి ఎసిబి కోర్టుకు సమర్పించారు.సిట్ దాఖలు చేసిన ఈ తాజా ఛార్జిషీట్ ఆధారంగా రాబోయే రోజుల్లో మరికొందరు కీలక నేతలకు, అధికారులకు నోటీసులు వచ్చే అవకాశం ఉందనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది. కేసులో నిందితుడు కట్టా ప్రణయ్ ప్రకాశ్ ఫోన్‌లను సిట్ అధికారులు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించి విశ్లేషించగా చిత్రాలతో వైఎస్సార్సీ ముఠా బండారం బయటపడింది. మార్చి 2న ప్రణయ్ ప్రకాశ్‌ను అరెస్ట్ చేసిన సిట్ అధికారులు అతని నుంచి 3 ఫోన్లు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించారు. ఆ నివేదికలను తాజాగా న్యాయస్థానానికి సమర్పించారు. మద్యం లంచాల సొమ్ము భద్రపరిచేందుకు తాడేపల్లి సమీపంలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసుకున్న డెన్‌కు ప్రణయ్ ప్రకాశ్ నిర్వాహకుడిగా ఉన్నారు. ఆ సొత్తును గత సార్వత్రిక ఎన్నికల్లో పంపిణీ కోసం ఎప్పటికప్పుడు వైఎస్సార్సీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి మనుషులకు చేర్చడంలో కీలక పాత్రధారిగా వ్యవహరించారు.కట్టా ప్రణయ్ ప్రకాశ్‌తో వైఎస్సార్సీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి టాంజానియాలో చెట్టాపట్టాలు వేసుకుంటూ తిరిగారు. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ముతో టాంజానియాలో ఇనుప ఖనిజ కర్మాగారం ఏర్పాటుచేయాలని, జింబాబ్వే సహా పలు ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులు పెట్టాలని వైఎస్సార్సీ ముఠా ముమ్మర యత్నాలు చేసింది. అక్కడ సాధ్యాసాధ్యాల అధ్యయన బాధ్యతల్ని ప్రణయ్ ప్రకాశ్‌కు అప్పగించింది. ఈ కేసు నిందితులైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి, వారి సన్నిహితుడు వెంకటేశ్ నాయుడు 2025 జనవరిలో టాంజానియాకు వెళ్లారు. ఆ దేశంలోని దార్ ఎస్ సలామ్ ప్రాంతంలో 2025 ఫిబ్రవరిలో ప్రణయ్ ప్రకాశ్ జూలియస్ నైరేరే అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద చెవిరెడ్డి బాస్కరరెడ్డిని కలిసి చెట్టపట్టాలు వేసుకుని తిరిగారు. టాంజానియాలో కట్టా ప్రణయ్ ప్రకాశ్ చెవిరెడ్డి భాస్కర రెడ్డితో కలిసి 6 రోజులు ఉన్నారు. ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులపై చర్చించారు. మద్యం లంచాల సొమ్ము ఎన్నికల్లో పంపిణీ చేసిన విషయం ఎవరికీ చెప్పొద్దని ప్రణయ్ ప్రకాశ్‌ను చెవిరెడ్డి బాస్కరరెడ్డి ఆదేశించినట్లు సిట్ చార్జిషీట్‌లో పేర్కొన్నారు.మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీలు, బ్రూవరీస్ నుంచి నగదు రూపంలో వసూలు చేసిన లంచాల సొమ్ము దాచేందుకు అక్కడి నుంచి మరో చోటుకు తరలించేందుకు వైఎస్సార్సీపీ ముఠా హైదరాబాద్, అమరావతిల్లో పలుచోట్ల డెన్‌లు ఏర్పాటు చేసుకుంది. వాటిలో హైదరాబాద్ ఖాజాగూడ సర్కిల్‌లోని ఉమాహిల్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్ ఒకటి. అక్కడ 2021 జులై 12న ఫొటో తీసుకున్నారు.

చిత్రంలో కనిపిస్తున్న నోట్ల కట్టలన్నీ వివిధ డిస్టిలరీలు, వారి ప్రతినిధుల నుంచి వైఎస్సార్సీ ముఠా వసూలు చేసిన లంచాల సొమ్మే. 2021 జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు బాలాజీ ఎంటర్‌ప్రైజెస్, ఎలైట్ వింటేజ్ విస్కీ బ్రాండ్ ప్రతినిధుల నుంచి వసూలు చేసిన లంచాల సొమ్ము. నెక్టార్ బాట్లింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, సత్యనారాయణ అనే వ్యక్తి నుంచి వసూలు చేసిన లంచాల సొమ్ము ఉంది. ఓ అట్టపెట్టెలో 20.07 లక్షల రూపాయలు, మరోదానిలో రూ.4 లక్షలు, ఇంకో దానిలో రూ.4.36 లక్షలు ఉన్నట్లు పైన రాసి డెన్‌లో భద్రపరిచారు. మద్యం కుంభకోణం కేసు ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, మరో నిందితుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి ఓ ఖరీదైన పబ్‌లో అమ్మాయిలతో ఎంజాయ్ చేస్తున్నట్లు చిత్రంలో ఉంది. మద్యం లంచాల సొమ్ముతో వీరు ఎంత విలాసవంతమైన జీవితం గడిపారో చెప్పేందుకు ఇదో నిదర్శనంగా సిట్ చార్జిషీట్‌లో వివరించింది.

31-05Pg3exHMNWJQE.qxd:31-05Pg3exHMNWJQE.qxd 1/1/02 6:31 AM Page 1

తిరుమల సమాచారం

జూన్ 2న వేణుగోపాలస్వామి ఆలయంలో
కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరుజిల్లా కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జూన్ 2వతేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఆ రోజు దయం 7.30 గంటల నుండి 11 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుండి 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఈ మహోన్నత కార్యక్రమం అనంతరం ఉదయం 11.30 గంటల నుండి భక్తులను స్వామివారి సర్వ దర్శనానికి అనుమతించనున్నారు.

సింహవాహనంపై సుదర్శన నరసింహుడు

తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లాలో నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం సింహ వాహనంపై సుదర్శన నరసింహుడి అలంకారంలో శ్రీనివాసుడు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అనంత తేజోమూర్తిగా వెలసిన స్వామిసింహవాహనాన్ని అధిరోహించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధర్మాన్ని చాటిచెప్పారు. పరాక్రమం, ధైర్యం, తేజస్సు, ఆధిపత్యానికి ప్రతీకైన సింహరూప దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయారు. వాహనం ముందు భక్త బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో గోవింద నామస్మరణ చేస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి కటాక్షాన్ని పొందారు. సింహవాహనోత్సవం ద్వారా అజ్ఞానాన్ని తొలగించి ధర్మమార్గంలో నడవాలని, విజయ స్ఫూర్తితో జీవించాలని శ్రీవారు సందేశమి చ్చారు. రాత్రి 7గంటలకు ముత్యపుపందిరి వాహనంపై స్వామిభక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గోవిందరాజస్వామి రథోత్సవం

తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామ స్మరణలతో తిరువీధులు మార్మోగగా, వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం 5.40 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్ణాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా తిరిగి ఆలయ రథమండపానికి చేరుకుంది. మార్గమంతా భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారికి మంగళారతులు అర్పించారు. రథోత్సవం కేవలం ఉత్సవం మాత్రమే కాదు, ఆత్మజ్ఞానాన్ని బోధించే మహత్తర తాత్విక సందేశం. ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనసును పగ్గంగా, ఇంద్రియాలను గుర్రాలుగా, విషయాలను వీధులుగా భావించడం ద్వారా ఆత్మ-అనాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు బోధిస్తుంది.

వేడుకగా స్నపన తిరుమంజనం: రథోత్సవం అనంతరం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామికి, నమ్మాళ్వార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రథోత్సవంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టిటిడిబోర్డు సభ్యుడు జి. భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసు అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ జరగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు కపిలతీర్థంలో చక్రస్నానం: గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరగా ఆదివారం ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు కపిలతీర్థం (ఆళ్వార్ తీర్థం)లో చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు స్వామివారు, అమ్మవార్లు తిరుచ్చిపై, చక్రతాళ్వార్ పల్లకీలో కపిలతీర్థానికి ఊరేగింపుగా బయలు దేరనున్నారు. చక్రస్నానం అనంతరం పీఆర్ తోటకు వేంచేపు చేసి, సాయంత్రం 6 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

గరుడునిపై విహరించిన వేదనారాయణుడు

తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని చిత్తూరుజిల్లా నాగలాపురంలోని వేదనారాయణస్వామి ఆలయంలో శనివారం కంచి గరుడసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. కాంచీపురంలోని వరదరాజస్వామి ఆలయంలో జరిగే ప్రసిద్ధ గరుడసేవను పురస్కరించుకుని, వేదనారాయణస్వామి ఆలయంలో ఈ గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత సర్వాలంకార భూషితుడైన వేదనారాయణస్వామి ఉదయం గరుడవాహనంపై గ్రామ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. గరుడునిపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. వేదఘోషలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ దివ్యోత్సవం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రూ.1.13కోట్ల విద్యుత్ బస్సు విరాళం
రూ.20లక్షలు విలువైన 15 ట్యాబ్‌ల అందజేత

తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడికి దాత భారీ విరాళాలిచ్చారు. యాత్రికుల సౌకర్యార్థం తిరుమలలో నడిచేందుకు విద్యుత్ బస్సును, మరో 15ట్యాబ్‌లను విరాళం ఇవ్వడం ప్రత్యేకత. ఢిల్లీలోని నయాతి హెల్త్ కేర్ రీసెర్చ్ ఆగ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నీరారాడియా 1.13 కోట్ల విలువైన విద్యుత్ బస్సు విరాళమిచ్చారు. బస్సుతో బాటు మరో 20లక్షలు విలువైన 15 ట్యాబ్‌లు అందజేశారు. తిరుమలలో భక్తుల కోసం నడుపుతున్న ఉచిత ధర్మరథం సేవలోఈ కొత్త బస్సు రావడంతో మరింత సౌకర్యవంతంగా ఉంటుందని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలను కాలుష్య రహిత పుణ్య క్షేత్రంగా మార్చేందుకు టిటిడి చేస్తున్న కృషికి దాత నీరా రాడియా సహకారం అమూల్యమన్నారు. ఈ విరాళం పర్యావరణ హిత కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు దోహదపడనుందన్నారు. శనివారం ఉదయం తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదుట ఈ కొత్త బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాత నీరా రాడియా బస్సు తాళాలను, రికార్డులను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు. దాతృత్వానికి నిదర్శనంగా నిలిచిన నీరా రాడియాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే కొండపై ఉచిత ధర్మరథాలు 20 బస్సులు ఉండగా, వాటిలో 14 ఇప్పటికే విద్యుత్ బస్సులే ఉన్నాయి. ఈ బస్సులు 21 బస్ స్టాప్‌ల మీదుగా రోజూ 380 ట్రిప్పులు తిరుగుతూ భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. త్వరలోనే మిగిలిన డీజిల్ బస్సుల స్థానంలో కూడా పూర్తిగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడమే తమ లక్ష్యమని టిటిడి ఛైర్మన్ నాయుడు వివరించారు. అనంతరం ఛైర్మన్, అదనపు ఇఒ దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు చాలా సౌకర్యవంతంగా ఉందని దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం, మాజీ బోర్డు సభ్యుడు డి.పి. అనంత, రవాణాశాఖ డీఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు అరుదైన అవకాశం
మొన్న అభిషేకం..నిన్న తోమాలసేవ వీక్షణ

తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకొండపై సామాన్య భక్తులకు ఏడుకొండలస్వామి దర్శనం మరింతగా సంతృప్తికరంగా అందించే దిశగా టిటిడి అధికారులు తీసుకుంటున్న ప్రణాళికల్లో మొన్న అభిషేకసేవను కన్నులారా వీక్షించారు. సామాన్యభక్తులకే ప్రాధాన్యతనిస్తున్నామని చెబుతున్న టిటిడి అధికారులు అందుకు తగ్గట్టు శుక్రవారం వేకువజామున తిరుమలేశునికి నిర్వహించే తోమాలసేవ సమయంలోనూ సామాన్యభక్తులను ఆలయంలోపలకు అనుమతించి దర్శనం చేయించడం మరో ప్రత్యేకత. సామాన్య భక్తులకు ఇదో అరుదైన అవకాశంగా భావించి తన్మయత్వం పరవశులయ్యారు. సాధారణంగానే తిరుమలకు వారాంతం శుక్ర,శని, ఆదివారాల్లో విపరీతంగా భక్తులు తరలిరావడం జరుగుతుంది. అలాంటిది వేసవిసెలవులు కొనసాగుతుండటం, మరోవైపు వారాంతం కూడా కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. గత ఇరవై రోజుల నుండి భక్తులతో ఏడుకొండలు కిటకిట లాడుతున్నాయి. కొండపై ఆలయ మాడవీధులన్నీ గోవింద నామస్మరణలతో మార్మోగిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వేసవిలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శిలా తోరణం వరకూ భక్తుల క్యూ లైన్ విస్తరించింది. ఇదే సమయం లో టిటిడి అధికారులు సర్వదర్శన భక్తులకు తోమాల సేవలో శ్రీవారి దర్శన అవకాశం కల్పించడంతో మాటల్లో చెప్పలేనిదిగా వర్ణిస్తున్నారు. గత శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేకసేవలో తరించిన సామాన్య సర్వదర్శనం భక్తులు ఈ శుక్రవారం తోమాలసేవను వీక్షిస్తూ ఇష్టదైవాన్ని దర్శించుకోవడం అనుభూతికి లోనయ్యారు. ఇదిలా ఉండగా మరో పదిరోజుల్లో వేసవి సెలవులు పూర్తి కావస్తుండటం మరోవైపు దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభం కానుండటంతో తిరుమలకు భక్తులు తరలివస్తున్నారు. ప్రస్తుతం రోజూ 1,500 శ్రీవాణి టికెట్ల పై శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. ఇప్పటికే శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు అందజేసి దర్శనం కోసం ఎదురు చూస్తున్న దాతలు సుమారుగా 40వేల మందికిపైగా ఉన్నారనేది టిటిడి వర్గాల సమాచారం. వీరికి ప్రత్యేకంగా దర్శన టికెట్లు ఇవ్వాలని టిటిడి నూతన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. నూతన విధానంతో అమలుకానున్న శ్రీవాణి బ్రేక్‌లో జూన్ 10వ తేదీ నుండి ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. 2027 మార్చి31 వరకు ఈ విధానం అమలుకానుంది. వేకువజామున శ్రీవారికి నిర్వహించే తోమాల, అర్చనసేవ సమయాల్లో సర్వదర్శన భక్తులను దర్శనానికి అనుమతించాలని నిర్ణయించారు.

గతంలోనూ ఈ విధానం అమలయ్యేది. అయితేశుక్రవారం అభిషేకసేవ అనంతరం జరిగే తోమాల సేవ సమయం తక్కువ ఉందనే భావనతో సామాన్య భక్తులను దర్శనానికి అనుమతించే విధానాన్ని పదేళ్ళ ముందు రద్దు చేశారు. ప్రస్తుతం వేసవిసెలవుల్లోనూ భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో శుక్రవారం తోమాల సేవలో ఇరవై నిమిషాల వ్యవధిలో దాదాపు 1,500 మందికి దర్శనం చేయించారు.

చరిత్ర జాడల అన్వేషణకు ఎఎస్ఐకి అనుమతి
వన్యప్రాణులు, అటవీ పరిరక్షణ లక్ష్యాలకు భంగం కలగకుండా అటవీ శాఖ సహకారం: డి.సిఎం పవన్

విజయవాడ, మే 30, ప్రభాతవార్తప్రతినిధి: జీవ వైవిధ్యంతో పాటు చారిత్రక పురావస్తు, సాంస్కృతిక సంపదకు నిలయాలు. అలాంటి అమూల్యమైన వారసత్వ సంపదను గుర్తించి, సం రక్షి ంచడంతోపాటు మన చరిత్ర, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన అవసరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లోని చారిత్రక కట్ట డాలు, పురావస్తు అవశేషాలు ఎకో టూరిజం అభివృద్ధికి సరి కొత్త అవకాశాలు సృష్టిస్తాయని తెలిపారు. ప్రకృతి, వారసత్వ సంపదల పట్ల ప్రజల్లో చైతన్యం కలిగిస్తాయని అభిప్రా యపడ్డారు. నల్లమల అటవీ ప్రాంతంలో దాగి ఉన్న అమూ ల్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను గుర్తించి, సంరక్షించేందుకు, శాసనాల సర్వే నిర్వహించేందుకు భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ)కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గతంలో వైఎస్ఆర్ కడప జిల్లాలోని లంకమల అటవీ ప్రాంతంలో నిర్వహించిన సర్వేలో క్రీస్తు పూర్వ 1వ శతాబ్దం నుంచి క్రీస్తుశకం 16వ శతాబ్దం వరకు సుమారు 30శాసనాలు వెలుగు చూశాయి. 10 వేల సంవత్సరాల నాటి గుహ చిత్రాలను గుర్తించారు. ఈ శాసనాలు శాతవాహనుల కాలం, బౌద్ధ, శైవ సంప్రదాయాలతో పాటు ప్రాచీన యాత్రా మార్గాలను, ఆది మానవ జీవన విధానాలకు సంబంధించి విలువైన సమాచారాన్ని వెలుగులోకి తెచ్చాయి.

భారత పురావస్తు సంస్థ చేపట్టనున్న తాజా సర్వే తెలుగు, దేవనాగరి లిపుల్లో లిఖించిన శాసనాలపై దృష్టి సారించి మన ప్రాచీన రాజ్యాలు, సంస్కృతి, సంప్రదాయాలు, దక్షిణ భారత చరిత్ర ను మరింత లోతుగా అధ్యయనం చేసే వీలు కల్పిస్తుంది. ఈ సర్వేపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏఎస్ఐ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పరిరక్షణ లక్ష్యాలకు భంగం కలగకుండా రాష్ట్ర అటవీ శాఖ అధికారులు పూర్తి సహ కారం అందించాలన్నారు. ప్రకృతి సం పదతోపాటు సాంస్కృతిక వారస త్వాన్ని పరిరక్షిస్తూ భావితరాలకు అందించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తుందన్నారు.

డిఎస్సీ నిర్వహణపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం
విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి: డీఎస్సీ నిర్వహణపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ నియామక ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని శశిధర్ తెలిపారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై 226 కేసులు దాఖలైనప్పటికీ, కేవలం 148 రోజుల్లోనే నియామకాలను పూర్తి చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. 154 టీసీఎస్ అయాన్ కేంద్రాల్లో విజయవంతంగా పరీక్షలను నిర్వహించినట్లు కోన శశిధర్ తెలిపారు. డీఎస్సీ ప్రశ్నాపత్రాన్ని ఎవరూ మానిప్యులేట్ చేయలేరని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రం తయారీ నుంచి పరీక్ష నిర్వహణ వరకు పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలను పాటించినట్లు వివరించారు. ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలను యాక్సెస్ చేసే అవకాశం కేవలం ఇద్దరు సీనియర్ అధికారులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. క్వశ్చన్ బ్యాంక్ పాస్‌వర్డ్‌లు ప్రతిరోజూ మారుతూ ఉండటంతో భద్రత మరింత కఠినంగా ఉంటుందని చెప్పారు. ఆ ఇద్దరు అధికారులు మాత్రమే టీసీఎస్ సిస్టంలో ప్రశ్నలను అప్‌లోడ్ చేస్తారని, పరీక్ష రోజు ప్రశ్నాపత్రం జంబుల్డ్ రూపంలో అభ్యర్థులకు అందుతుందని పేర్కొన్నారు. ప్రశ్నలు ఎన్‌క్రిప్ట్ చేయబడిన విధంగా ఉంటాయని, వాటిని డీకోడ్ చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అనేక ప్రతిష్టాత్మక పరీక్షలు ఇదే విధానంలో నిర్వహిస్తున్నట్లు కోన శశిధర్ తెలిపారు. ఏపీ హైకోర్టు సహా అనేక సంస్థల పరీక్షలు కూడా ఇదే విధానంలో నిర్వహిస్తారని వివరించారు.

టీసీఎస్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, కఠినమైన భద్రతా ప్రోటోకాల్ అమల్లో ఉన్నాయని, ఎక్కడా విధాన ఉల్లంఘనలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఫలితాల ప్రకటన ప్రక్రియలోనూ పారదర్శకత పాటించినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ కీ విడుదల చేసిన తర్వాత అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, ఫైనల్ కీని విడు దల చేసినట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల స్కోర్లను 11వ తేదీన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు హరినాథరెడ్డి

తిరుపతి, మే30ప్రభాతవార్తప్రతినిధి: అమెరికా సామ్రాజ్యవాదానికి, ట్రంప్ విధానాలకు లొంగిపోయి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో ఆర్థిక సంక్షోభం, విపరీతమైన ధరల పెరుగుదల దాపురించాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పెంచిన ధరలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో శనివారం నదియా అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. ప్రజలను ఖర్చులు తగ్గించుకోవాలని, ప్రయాణాలు మానుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్న పాలకులు, తాము మాత్రం విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని విమర్శించారు. ఒకరోజు సైకిల్ తొక్కి పొదుపు చర్యలంటూ షో చేసిన నాయకులు, మరుసటి రోజు నుంచే యధాప్ర కారంగా కాన్వాయ్‌లతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

జూన్ 1 నుంచి ప్రచారం: కేంద్రంలోని బిజెపి వైఫల్యాలను, ఈ దుస్థితిని ప్రజలకు వివరించడానికి రాష్ట్రంలోని వామపక్షాలన్నీ కలిసి కార్యాచరణ రూపొందించినట్లు హరినాథరెడ్డి ప్రకటించారు. జూన్ 1 నుండి 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాలు, సభలు, సమావేశాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిద్దామని, 9వ తేదీ కేంద్ర వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిద్దామన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తొమ్మిదో తేదీన జరిగే రాస్తారోకోను విజయవంతం చేయాలని హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం
విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు
డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు

తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి: ఎస్పీడీసీఎల్ పరిధిలో కొన్ని జిల్లాల్లో బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి శనివారం తెలిపారు. బలమైన గాలి, వర్షం కురుస్తున్న నేపథ్యంలో ఎపిఎస్పిడిసిఎల్ అధికారులు, సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు ఒక్కో జిల్లాకు చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసరుగా నియమించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, కండక్టర్, విద్యుత్ స్తంభాలు తదితర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాలి, వర్షం ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పున రుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు/సిబ్బందితో కూడిన ప్రత్యేక బృం దాలు అందుబాటులో వుండాలన్నారు. ఎక్క డైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపం లోని విద్యుత్ శాఖ అధికారులు/సిబ్బందికిగానీ, విద్యుత్ బిల్లుపై ముద్రించబడిన తమ ప్రాంత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నంబరుకుగానీ లేదా టోల్ ఫ్రీనంబర్లు: 1912 , 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందిం చా లని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమ స్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సిఎండి శివశంకర్ సూచించారు.

కుప్పంలో పోలీసుల విచారణకు హాజరైన పూడి శ్రీహరి

కుప్పం, మే 30 ప్రభాతవార్త మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ సిపిఆర్ఒ, వైకాపా ప్రధాన కార్యదర్శి (మీడియా) పూడి శ్రీహరి శనివారం కుప్పంలో పోలీసుల విచారణ నిమిత్తం హాజరయ్యారు. ఉదయం 11.30గంటల ప్రాంతంలో ఆయన కుప్పం అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడుపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని తెదేపా నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో పూడి శ్రీహరిపై కుప్పం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆపై కోర్టు గత నెల 30న బెయిల్ మంజూరు చేసింది. అయితే పూడి శ్రీహరికి 35సి(3)బిఎన్ఎస్ కింద నోటీసులు జారీ చేయాలని సైతం కోర్టు ఆదేశించింది. దీంతో పూడి శ్రీహరి శనివారం కుప్పం పోలీస్‌స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. కుప్పం డిఎస్పీ పార్థసారథి, సిఐ మల్లేష్ యాదవ్‌లు కేసు విషయంగా పూడి శ్రీహరిని విచారించినట్లు సమాచారం.

15 మంది వైద్య విద్యార్థుల డిబార్

విజయవాడ,మే30, ప్రభాతవార్తప్రతినిధి: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్, బీడీఎస్, బీపీటీ, వైద్య పీజీ, ఆయుష్ కోర్సుల వార్షిక పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 21 మంది విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంది. పరీక్షలు పూర్తయిన 15 మందిని ఏడాది పాటు డిబార్ చేసినట్లు వీసీ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. వీరిలో ఆరుగురు ఎంబీబీఎస్, 8 మంది బీడీఎస్, ఒకరు బీపీటీ విద్యార్థులు ఉన్నారు. మిగిలిన ఆరుగురిపై పరీక్షలు ముగి సిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు. మాస్ కాపీయింగ్ జరిగిన పరీక్ష కేంద్రాల కళాశాలలకు రూ. 50 వేల జరిమానా విధించారు.

ఆర్టీసీని ప్రైవేటీకరించే యోచన లేదు: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి: ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీసీ ఆర్థికంగా నిలకడగా ఉందని, సంస్థకు రూ. 30వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీలను పెంచే ఉద్దేశం కూడా లేదని ప్రయాణికులకు తీపి కబురు చెప్పారు. సంస్థను మరింత ఆధునికీకరించేందుకు త్వరలోనే కొత్తగా 2,500 ఎలక్ట్రిక్, 500 సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, కార్మికుల సమస్యలన్నింటినీ రెండేళ్లుగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అవసరమైన ఉద్యోగాలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ కాబోతోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతుంది. ప్రైవేటీకరణ వార్తల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నిరసనలు చేపట్టింది. ఈ ప్రచారంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టతను ఇచ్చారు.

వడదెబ్బ మృతులకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

విజయవాడ, మే30ప్రభాతవార్తప్రతినిధి: వడదెబ్బ మృతులకు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి శనివారం సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎండలు తీవ్రత వలన వడదెబ్బ తగిలి అనేకమంది మృత్యువాతపడుతున్నారని తెలిపారు. ప్రకృతి విపత్తుల నిధి కింద చనిపోయినవారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఉపాధి పథకం సహా అసంఘటిత కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో తగు విశ్రాంతి, ఉపశమనం కలిగించాలని కోరారు. గతంలో ఎన్నడూ లేనంత 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. మే నెల ప్రారంభం నుండి ఈ వడగాడ్పులు మొదలయ్యాయని తెలిపారు మే 22 న ఒక్కరోజే 21 మంది మరణించారని చెప్పారు. అందునా విజయవాడలో 10 మంది మరణించారని తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుండి ఉపశమన చర్యలు చేపట్టాలని సిపిఐ(యం) కోరుతున్నదని వి.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు.

12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి
లిక్కర్ కుంభకోణం ఆరోపణలపై వైఎస్ జగన్ సమాధానం ఇవ్వాలి: మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

చిత్తూరు, మే 30 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం సత్వరం 12వ పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. పెరిగిన నిత్యవసర వస్తువులతో ఉద్యోగుల తమ కుటుంబాలను పోషించుకోలేక సతమతమవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ గత నెల రోజులుగా 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండు వారాల్లోపు కేబినెట్ సమావేశాల్లో పెట్టి 12వ పిఆర్‌సిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4 డిఎలు రావాల్సివుందని, వీటిని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించకుండా అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన 4 డిఎలను సైతం సత్వరం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 30 వేల కోట్ల రూపాయలు బకాయి పడిందని, ఈ బకాయిలను ఒక నెల రోజుల్లో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లిక్కర్ కుంభకోణం నిధులు విదేశాలకు వెళ్ళాయని వార్తలు చక్కర్లు కొడుతున్నాయని, ఈ లిక్కర్ కుంభకోణం ఆరోప ణలపై మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పందించి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి 19 సంవత్సరాల పాటు ముఖ్య మంత్రిగా పని చేశానని చెప్పుకుంటున్న సిఎం నారా చంద్రబాబునాయుడు సొంత జిల్లా కేంద్రం చిత్తూరుకు ఏం చేశారని ఆయన నిలదీశారు. కుప్పం, పులివెందులకు మంచినీటిని తీసుకువచ్చానని చెప్పుకుంటున్న సిఎం చిత్తూరుకు ఒక్క గ్లాసు నీటినైనా తెచ్చావా! అని నిలదీశారు. అలాగే దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు సైతం జిల్లా కేంద్రం చిత్తూరుకు ఏం తీసుకురాలేదని ఆరోపించారు. తాను ఎంపిగా వున్న సమయంలో చిత్తూరుకు వేలూరు సిఎంసి ఆసుపత్రిని తీసుకువచ్చానని, చిత్తూరులో మంచి మెడికల్ కళాశాల ఏర్పాటు కానుందని ఆయన పేర్కొన్నారు.

శనివారం మీడియతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత చింతామోహన్

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No. 02 MAU61-USI0HB(OTH)/93/2026-HB/2nd call, Dt. 30-05-2026
E-PROCUREMENT SHORT TENDER NOTICE (SECOND CALL)
Name of Work: "Engaging of Technical persons for Carpenters, Plumbers, Operators for Operation & Maintenance of Secretariat Buildings:1 to 6 and WTP & STP at AP Secretariat, IGC, Velagapudi for 24 Months". - Estimated Amount: Rs.1,44,00,000/-.
The bid can be downloaded on AP e-procurement portal from 01.06.2026 to 09.06.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.06.2026 up to 15.00 Hrs, Technical bid opening 09.06.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi

31-5pg4.qxd:31-5pg4.qxd 1/1/02 6:33 AM Page 1

పెట్రో ధరల పెంపుతో అన్ని రంగాలు కుదేలు

బోగిని మల్లికార్జున్

ఇంధన ధరల పెంపుతో పలు రంగాలు కుదేలవుతున్నాయి. పెట్రో ధరల పెంపు ప్రతికూల ప్రభావం రవాణా రంగంపైనే కాకుండా వ్యవసాయం, నిర్మాణ రంగం, ఫుడ్ ఇండస్ట్రీ ఇలా పలు రంగాలను కుదుపు కుదేపేస్తోంది. పెట్రో ధరల పెంపు ఇలానే కొనసాగితే మార్కెట్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, బ్యాంక్ వడ్డీ రేట్లు కూడా పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పెట్రో ధరల పెంపు ఇంతటి ఆగిపోదని, రానున్న రోజుల్లో మరింత పెరుగుతాయన్న నిపుణుల హెచ్చరికలు అన్నివర్గాల ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. లీటరు పెట్రోల్, డీజిల్ ధర రూ.150ని తాకే అవకాశముందన్న ప్రచారం దేశ ఆర్థిక మార్కెట్‌ను కుదిపేస్తోంది. వాస్తవానికి దేశంలో పెరుగుతున్న ఇంధన ధరలు ముందుగా సామాన్య ప్రజలు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరగడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను రోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు పెంచాయి. ఈ పెంపుతో పెట్రోల్, డీజిల్ రేట్లు రెండేళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోగత 11 రోజుల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు సగటున రూ.8మేర పెరిగాయని చెప్పొచ్చు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పరభావం అత్యంత వేగంగా, నేరుగా పడేది రవాణారంగం పైనే. ప్రతి రోజూ ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, సొంత వాహనాలు వాడేవారిపై తక్షణ భారం పడుతోంది. లారీలు, ట్రక్కుల నిర్వహణ ఖర్చుల్లో కేవలం డీజిల్ వాటానే దాదాపు 55శాతంగా ఉంటుంది. దీనికితోడు టైర్లు, ఇన్సూరెన్స్, టోల్ ఛార్జీలు, మెయింటెనెన్స్ ఖర్చులు ఇప్పటికే పెరిగాయి. ఇప్పుడు లీటరుకు రూ. 8 మేర ధర పెరగడంతో రవాణా వ్యాపారం నిర్వహించడం యజమానులకు అదనపు భారంగా మారింది. అలాగే క్యాబ్ సర్వీసులు, ఆటోలు, స్కూల్ బస్సులు, అంతరాష్ట్ర బస్సు ఛార్జీలు రాబోయే రోజుల్లో మరింత పెరగనున్నాయి. వాస్తవానికి దేశ ఆర్థిక వ్యవస్థకు డీజిల్ ఒక వెన్నెముక లాంటింది. దేశంలోని సప్లై చైన్, లాజిస్టిక్స్ రంగాలతోపాటు వ్యవసాయ రంగం పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో తీవ్రంగా ప్రభావితమవుతోంది. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు సరకు రవాణా ఛార్జీలను పెంచడం ప్రారంభించాయి. దీనివల్ల ఒక నగరం నుంచి మరో నగరానికి సరుకులను తరలించే ఖర్చు పెరుగుతోంది. నిర్వహణ ఖర్చులు భరించలేక కొన్ని ప్రాంతాలలో రవాణా వాహనాలను షెడ్లకే పరిమితం చేస్తు



న్నట్లు తెలుస్తోంది. లారీలు, ఇతర వాణిజ్య వాహనాలకు డీజిల్ ప్రధాన ఇంధనం. పెట్రో ధరలు వరుసగా పెరుగుతుండడంతో సరుకు రవాణా వ్యయం విపరీతంగా పెరుగుతోంది. ఆర్టీసీ బస్సుల నిర్వహణ ఖర్చులు పెరిగి, సంస్థలపై అదనపు భారం పడుతుంది. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో ఆటోలు, క్యాబ్‌లు నడుపుకునే డ్రైవర్ల రోజువారీ ఆదాయం తగ్గి, జీవనం కష్టతరంగా మారుతుంది. పెట్రో ధరల పెంపుతో దేశవ్యాప్తంగా సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌ను ప్రభావితం చేస్తుంది. వరుసగా పెట్రో ధరల పెంపు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌పై తీవ్రమైన అదనపు భారాన్ని మోపుతోంది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా, లాజిస్టిక్స్ రంగానికి అయ్యే ఖర్చులు గణనీయంగా పెరగబోతున్నాయి. పెరిగి పెట్రోధరలకు అనుగుణంగా సరుకు రవాణా ఖర్చులు పెరిగి ఆ ప్రభావం నిత్యావసర వస్తువులైన పాలు, కూరగాయలు, గుడ్లు, బ్రెడ్ వంటి రోజువారీ వస్తువుల ధరలపై పడుతోంది. రవాణా వ్యయం పెరిగిన ప్రతిసారీ మార్కెట్లో వస్తువుల ధరలు ఆటోమేటిక్‌గా పెరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి లారీలద్వారా వచ్చే టమాటాలు, ఉల్లిపాయలు, ఆకు కూరలు, పండ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. అలాగే పాడి పరిశ్రమలకు రవాణా ఖర్చులు పెరగడం వల్ల పాల ప్యాకెట్ల ధరలను సైతం పెంచుతున్నాయి. నిత్యావసర సరుకులు, ప్యాక్ చేసిన ఆహార పదార్థాల పంపిణీ వ్యయం పెరిగిపోతోంది. పెట్రో ధరలపెంపుతో వంట నూనెల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు కిలో రూ.140 ఉన్న వంట నూనె ధర ఇప్పుడు రూ.190కి చేరింది. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా వాడే 15 కేజీల ఆయిల్ టిన్ ధర రూ. 2,200 నుండి రూ. 2,800 కి పెరగడం గమనార్హం. ఇవే కాకుండా హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ రేట్లు భారీగా పెరిగిపోయాయి. తలకిందులవుతున్న మధ్యతరగతి బడ్జెట్‌ఈ ధరల పెరుగుదల వల్ల సగటు కుటుంబాల నెలవారీ బడ్జెట్ 20 శాతం వరకు పెరిగిపోయింది. ఆఫీసులకు, పనులకు వెళ్లే టూవీలర్ వాహనదారులకు నెలకు వెయ్యి రూపాయలకుపైగా అదనంగా పెట్రోల్ ఖర్చవుతోంది. "జీతాలు పెరగడం లేదు కానీ, ఖర్చులు మాత్రం రోజురోజుకూపెరిగిపోతున్నాయి. గతంలో నెల సామాన్లకు రూ.20 వేలు ఖర్చయితే, ఇప్పుడు రూ. 24వేలవుతోంది. పిల్లల చదువులు, ఇతర ఖర్చులు చూసుకోవడమే కష్టంగా మారింది, ఇక పొదుపు అనే ముచ్చటే లేదు అని స్థానిక పౌరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ఆకాశాన్నంటుతున్న పెట్టుబడులు, ఇంకోవైపు కంటిమీదకునుకు లేకుండా చేస్తున్న ప్రకృతి వైపరీత్యాలు, వీటన్నింటికీ తోడు పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇప్పటికే కొట్టుమిట్టాడుతున్న అన్నదాతలకు పెట్రోభారం ఊపిరాడకుండాచేస్తోంది. ఇటీవల వరుసగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు వ్యవసాయ రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. లీటరుపై ఏకంగా రూ.8 వరకు ధరలు పెరగడంతో సాగుఖర్చులు భారమై రైతులు విలవిలలాడుతున్నారు. సాగులో కీలకమైన ట్రాక్టర్ ఎక్కాలన్నా, పంటకు నీటిని సరఫరా చేసే ఇంజన్ నడవాలన్నా డీజిలే ముఖ్యం. ఆధునిక వ్యవసాయంలో ప్రతి పనికీ యంత్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొలం దున్నడానికి, నాట్లువేయడానికి, పంట కోతలకు, చివరకు పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించాలన్నా ట్రాక్టర్లు, లారీల అవసరం తప్పనిసరి. వీటన్నింటికీ డీజిలే ఇంధనం. ఇప్పుడు లీటరు ధర అమాంతం పెరిగిపోవడంతో ఎకరాకు అయ్యే సాగుఖర్చు వేలల్లో పెరిగిపోయింది. 'పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదు, ఇక వ్యవసాయం దండగ అనే పరిస్థితి వస్తోంది' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకోకుండా, రైతాంగాన్ని ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించి వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వరుసగా డీజిల్ ధరలు పెరుగుతూ పోతే వ్యవసాయ పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయి రైతులకు లాభాలు గాల్లో కలిసిపోతాయి. ఇది అంతిమంగా దేశంలో తీవ్రమైన ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని మార్కెట్‌వర్గాలు భయపడుతున్నాయి. మరోవైపు పెట్రో ధరలపెంపు దెబ్బకు బస్సు ఛార్జీలు, క్యాబ్, ఆటోల రేట్లు అమాంతం పెరగడంతోనే ఆగిపోదని, మనకు రోజూ అలవాటైన స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్స్, అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈకామర్స్ సంస్థల డెలివరీ చార్జీలు కూడా భారీగా పెరగబోతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంపెనీలు తమపైపడే ఈ డీజిల్ భారాన్ని తగ్గించుకోవడానికి కస్టమర్లకు ఇచ్చే డిస్కౌంట్లలోకోత విధించడం లేదా డెలివరీ ఛార్జిలను పెంచడం ఖాయంగా కనిపిస్తోంది. హిందుస్థాన్ యూనిలివర్, నెస్లే, డాబర్, మారికో వంటి ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు ఇప్పటకే ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడు పెరిగిన రవాణా ఖర్చులు వారి లాభాల మార్జిన్లను మరింత దెబ్బతీస్తాయి. ఇంధన ధరలు ఇలాగే కొన్ని నెలల పాటు కొనసాగితే, కంపెనీలకు రెండు మార్గాలు మాత్రమే మిగులుతాయి. ఒకటి సబ్బులు, బిస్కెట్లు, సర్ఫ్ వంటి ఉత్పత్తుల ధరలను 2 నుండి 5 శాతం పెంచడం లేదా ధర అంతే ఉంచి ప్యాకెట్ బరువును తగ్గించడం. అదే సమయంలో పెట్రోధరల పెంపు పర్యాటక రంగాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ఇల్లు కట్టుకోవాలంటే సామాన్యుడు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంధన ధరలపెరుగుదలవల్ల రవాణా ఛార్జీలు, ముడి సరుకుల ధరలు, కార్మికుల వేతనాలు అమాంతంపెరిగాయి. దీంతో మొత్తం నిర్మాణవ్యయం 5శాతం వరకు పెరిగేఅవకాశం ఉంది. సిమెంట్, ఇసుక, ఉక్కు (స్టీల్), ఇటుకలు వంటి నిర్మాణ సామగ్రిని దూర ప్రాంతాల నుండి హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు తీసుకురావడానికి రవాణా ఛార్జీలు భారీగా పెరిగాయి. జేసీబీలు, మిక్సర్లు, క్రేన్లు ఇతర హెవీ మెషినరీ నడపడానికి డీజిల్ అత్యవసరం. ఇంధన ఖర్చులు పెరగడంతో కాంట్రాక్టర్లకు రోజువారీ నిర్వహణ ఖర్చులు తడిసిమోపడవుతున్నాయి. రవాణా వ్యయం పెరగడంతో ఆటోమేటిక్‌గా సిమెంట్, స్టీల్ వంటికీలకమైన నిర్మాణ సామగ్రి ధరలు మార్కెట్‌లో పెరుగుతున్నాయి. నిర్మాణ వ్యయం పెరగడంతో డెవలపర్లు/రియల్టర్లు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల ధరలను పెంచవలసివస్తుంది. ఫలితంగా సొంత ఇల్లు, స్థలాలుకొనాలనుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోంది. ఇంధన ధరలపెరుగుదలతో ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రోజువారీ జీవనం సాఫీగా సాగాలంటే కార్మికులుసైతం తమవేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ముడిచమురు సంక్షోభంఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో ధరల మంట మరింత భయంకరంగా ఉండబోతోందనిఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో పెట్రోధరలు మరింతగా పెరుగుతాయన్న ఆందోళనల నేపథ్యంలో పరిమితి ఆదాయం లేని నల్లధనస్వాములకు ఏధరఎంత పెరిగినా ఇబ్బంది ఉండకపోవచ్చేమో కాని రెక్కాడితే డొక్కాడని రోజువారీ కూలీలు, నిరుపేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను మాత్రం కోలుకోలేని దెబ్బతీయడం ఖాయంగా కనిపిస్తోంది.

కర్ణాటక

తుపాను వెలిసిందా!

ఎ.వి.వి ప్రసాద్

ఒక తుపాను వెలిసింది. లేదు లేదంటూనే గత ఏడెనిమిది నెలలుగా సాగుతున్న సంక్షోభానికి తెరపడింది. ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామాచేయడం, డిప్యూటీగా ఉన్న డికె శివకుమార్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం తలుపులు తెరవడం 'సజావు'గానే సాగిపోయాయి. అధికార మార్పిడి కార్యక్రమం అనేక అపోహలు సృష్టించినా, చివరికి అంతా ప్రశాంతంగానే సాగిందని చెప్పాలి. తేలవలసిన అంశాలు ఇంకా ఒకటి రెండు ఉన్నా, అవి కూడా తేలికగానే సర్దుబాటు కావచ్చు. ఎందుకంటే కాంగ్రెస్‌లో అధిష్ఠానం నిర్ణయమే 'ఫైనల్' గనుక. అధిష్ఠానం చెప్పింది గనుక తాను అధికారం నుంచి వైదొలగుతున్నాననీ, కానీ పూర్తి కాలం సేవలందించాలన్నదే తన అభిమతమనీ సిద్దరామయ్య చెప్పడాన్ని బట్టి ఆయన వ్యూహం ఎలా ఉండబోతుందనేది తేలికగానే అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ అధిష్ఠానమంటే రాహుల్ గాంధీయే. సోనియా, ఖర్గే కూడా ఈ అంతంత మాత్రమే. సిద్దరామయ్య కొనసాగడానికి ప్రియాంక గాంధీ మద్దతు ఇచ్చినా, రాహుల్ మాత్రం డికె వైపే మొగ్గు చూపారనీ, దీనిలో ఖర్గే పాత్ర ఏమీ లేదనే అంటున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఉన్న ఖర్గే పేరు కూడా కొత్త సిఎం పదవికి ఒక దశలో ప్రచారమైంది. అయితే తనకు అలాంటి ఉద్దేశమేదీ లేదని ఖర్గే స్పష్టం చేశారు. నిజానికి 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే డికె శివకుమార్ సిఎం అవుతారని అంతా భావించారు. అయితే సామాజిక వర్గాల ప్రాధాన్యత దృష్ట్యా అప్పటికి సిద్దరామయ్యకు సిఎం సీటు ఇచ్చినా, రెండున్నరేళ్ల తర్వాత డికెకు అప్పగించే విధంగా అప్పట్లో ఇరువర్గాల మధ్య 'అంగీకారం' కుదిరిందనీ, అధిష్ఠానం ఆమోదంతోనే డికె తన వ్యూహాలు రూపొందించారనీ అంటున్నారు. దాని ప్రకారం గత నవంబరులో రెండున్నరేళ్లు పూర్తి కాగానే డికెకు సిఎం పీఠం అప్పగించాలనే డిమాండ్ మొదలయింది. కానీ తనకు ప్రజలలో అమితమైన ఆదరణ ఉన్నదనీ, అధిష్ఠానం తననే అధికారంలో కొనసాగే అవకాశం ఇస్తుందనీ సిద్దరామయ్య అంటూ వచ్చారు. డికె మాత్రం నిబ్బరంగా 'అంతా అధిష్ఠానం చూసుకొంటుందనే భరోసాతో కాలం గడిపారు. గత ఏడెనిమిది నెలలుగా అటు సిద్దరామయ్య, ఇటు డికె ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూ వచ్చినా, గత మంగళవారం ఢిల్లీలో ఇరువర్గాలు అధిష్ఠానంతో జరిపిన చర్చల తర్వాత ఒక స్పష్టత వచ్చింది. మరో రెండేళ్లలో జరిగే ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడమే టార్గెట్‌గా అధిష్ఠానం పావులు కదిపింది. డికెకు నాయకత్వం అప్పగిస్తే 'అదనపు ప్రయోజనాలు' కనిపించడంతో, రాహుల్ ఆ మార్పిడికే మొగ్గు చూపారనే అభిప్రాయం వినిపించింది. ఆరోజున అధికార మార్పిడిపై దాదాపు ఏడు గంటల పాటు చర్చలు జరిగినా అసలు ఆ విషయమే ప్రస్తావనకు రాలేదని కాంగ్రెస్ నేతలు బుకాయించారు. కానీ ఆ రాత్రికే సిద్దరామయ్య తాను వైదొలగుతున్నట్లు

సిద్దరామయ్య

ప్రకటించడంతో సమీకరణాలు త్వరత్వరగా మారిపోయాయి. డికెకు పీఠం అప్పగిస్తే ఎవరెవరికి డిప్యూటీ సిఎం పదవులు లభిస్తాయనే చర్చలు వెల్లువెత్తాయి. నలుగురి పేర్లు తెరపైకి వచ్చాయి కూడా. దానిపై మళ్లీప్రతిష్టంభన ఏర్పడింది. సిద్దరామయ్య కురుబ సామాజిక వర్గానికి చెందినా, ఆయన నిర్మించిన 'అహింద' కూటమిలో మైనారిటీలు, ఒబిసిలు, దళితులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఆయన బలమంతా ఆ కూటమిలోనే ఉంది. శివకుమార్ వొక్కళిగ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో మెజారిటీ నియోజకవర్గాల్లో ఆయనకూ అంతే బలంఉంది. అయితే వొక్కళిగ ఓట్లు కొంత శాతం దేవెగౌడ, కుమారస్వామి నాయకత్వంలోని జెడిఎస్ కు కూడా వెళ్తాయి. కానీ 'అత్యంత సంపన్నుడైన నేత'గా శివకుమార్‌కుగల 'అదనపు బలం' అధిష్ఠానం ఆయన వైపు మొగ్గు చూపేట్లు చేసిందని చెప్పవచ్చు. ఎన్నికల సమయంలోపార్టీని ముందుకు నడిపించగల 'సంపన్న నేత' అవసరం గనుక అధిష్ఠానం మద్దతు ఆయనకే లభించింది. అధికార మార్పిడి సజావుగా సాగినా, 'దెబ్బతిన్న పులి' ఊరికే ఉండదు కదా! తనకు రాజ్యసభ పదవి వంటివి అవసరం లేదనీ, ఎమ్మెల్యేగా 'క్రియాశీలక' రాజకీయాల్లోనే ఉంటాననీ సిద్దరామయ్య అంటున్నారు. ఆ మాటలను బట్టి ఆయన వ్యూహం ఏమిటో తేలికగానే అర్థమవుతుంది. వివాదాస్పదమైన వెనుకబడిన తరగతుల కమిషన్ సామాజిక, ఆర్థిక కులగణన నివేదికను రాజీనామాకు కొన్నిగంటల ముందు బుధవారం ఆమోదించడం ద్వారా సిద్దరామయ్య వ్యూహం ఎలా ఉండబోతుందనేది తెలుస్తోంది. అది రొటీన్‌గా జరగవలసిందే అయినా, రాజీనామాకు కొంచెం ముందు మాత్రమే చర్య తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కులగణన నివేదిక నిజానికి గత యేడాదే వచ్చినా కొన్ని సామాజిక వర్గాలకు ఆగ్రహం తెప్పించడం ఇష్టం లేక దానిని పక్కన పెట్టారు. కానీ ఇప్పుడు హఠాత్తుగా ఆమోదించడం వెనుక రాజకీయకారణాలు ఉన్నాయనే భావిస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో రెండు సార్లు కులగణన జరిగినా, ఆ నివేదికలు అమలు కాలేదు. ఇప్పుడు వాటిని అమలు చేస్తే ఎన్నికల్లో కొత్త సమస్యలు ఉత్పన్న మవుతాయి. తాను సిఎంగా కొనసాగి ఉంటే సిద్దరామయ్య ఆ నివేదికను ఆమోదించే వారు కాదేమో! కానీ చివరలో ఆమోదించి వెళ్తున్నారు గనుక దాని పర్యవసానాలు కొత్త ప్రభుత్వం ఎదుర్కొనవలసి వస్తుంది. లింగాయత్ సిఎం అయిన వీరేంద్ర పాటిల్‌ను 1990లో రాజీవ్ గాంధీ హఠాత్తుగా తొలగించినప్పటి నుంచి కాంగ్రెస్ ఆవర్గానికిదూరమైంది. పార్టీ తాజాచర్య కూడా మళ్లీ అటువంటి పరిణామాలకే దారి తీయవచ్చు. ఒక తుపాను వెలిసిందికానీ మరో తుపాను రాకుండా పార్టీ అధిష్ఠానం ఆపగలదా! చూడాలి. సిద్దరామయ్య తలుచుకొంటే 'అహిందా' బలంతో మరో ఉద్యమాన్ని సృష్టించగలరు. ఏం చేస్తారో మరి!

చైనా

ఎడారిలో 'అణు' కాంప్లెక్స్!

గన్ని మోహన్

సరిహద్దుల్లో స్థావరాలు ఏర్పాటు చేయడం, తమ సొంతగ్రామాలుగా ఆక్రమిత స్థలాల్లో పాగాలు వేయడం డ్రాగన్‌కు అలవాటన్నది జగమెరిగిన సత్యమే. తనకు ఎదురయ్యే ముప్పులన్నింటినీ ఎదుర్కొనేందుకు వీలుగా ఏకంగా ఒకమిలిటరీ కాంప్లెక్స్‌నే నిర్మిస్తోంది చైనా. జిన్‌పింగ్ హయాంలో పెరుగుతున్న సామ్రాజ్య విస్తరణ కాంక్షకు తోడు ప్రత్యర్థుల మూకుమ్మడి దాడులు చేసినా ధీటుగా తట్టుకునేందుకు వీలుగా ఎప్పటికప్పుడు తన ఆయుధ సంపత్తిని, సైనిక స్థావరాలను మెరుగు పరచుకుంటూ వస్తోంది. తాజాగా చైనాలోని ఒక మారుమూల ఎడారిలో భారీ సైనిక సముదాయానికి రూపకల్పన చేస్తున్న డ్రాగన్ తన చుట్టూ పొంచి ఉన్న ముప్పును ముందే పసిగట్టినట్లుగా తెలుస్తోంది. ఇరాన్‌కు ఆయుధసాయం అందిస్తున్నదన్న భావన అమెరికాలో ఎప్పటి నుంచో ఉంది. మరోవైపు రష్యా, చైనా దోస్తీ సుతరాము ఇష్టంలేదు. ఇక తైవాన్ తమదేనని ఇప్పటికీ చైనా చెపుతూనే ఉంది. దక్షిణచైనా సముద్రజలాలపై మాదే హక్కు అని చాటిచెపుతున్న సంగతి తెలిసిందే. వీటన్నింటితోపాటు నేపాల్ సరిహద్దుల్లోనే తమ చైనా భాషలో గ్రామాలు ఏర్పాటు చేస్తోంది. తద్వారా నేపాల్‌ను భారత్‌పైకి ఉసిగొలిపే చర్యలుచేపట్టింది. తాజాగా చైనా వద్ద ఉన్న అణ్వాయుధాలు అమెరికాలోని ఆనగరాన్ని లక్ష్యంగా చేసుకున్నా ఛేదిస్తాయి. అత్యంత సుదూర శ్రేణి క్షిపణులు కలిగి ఉన్న అణుస్థావరాల సమీపంలోనే బీజింగ్ ప్రయోగాలు, బంకర్లు, కమ్యూనికేషన్‌తో కూడిన విస్తారమైన కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. చైనా రూపొందించిన సుదూర లక్ష్యంఉన్న క్షిపణి తలచుకుంటే అమెరికాను చుట్టుముట్టేసి రాగలదని ఇప్పటికే రూఢీ అయింది. తన అణు పరిరక్షణ ప్రణాళికలో భాగంగా ఈ క్షిపణులున్న ప్రాంతంలో భారీగా రక్షణ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. అష్టభుజి ఆకారంలో నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్‌లలో అణు క్షిపణుల లాంచ్‌పాడ్స్ కూడా ఒక అంతర్భాభాగం. అలాగే సంచార వైమానిక రక్షణరంగ క్షిపణుల లాంచ్‌పాడ్‌లు, ఎలక్ట్రానిక్ యుద్ధసామగ్రి నిల్వ కేంద్రాలు వంటివికూడా ఉన్నాయి. అమెరికా రక్షణరంగ నిపుణుల అంచనాలప్రకారం చూస్తే ఇంతభారీ ఎత్తున ఎడారి ప్రాంతంలో వాయవ్య ప్రాంతంలో ఈ భారీస్థావరాలు ఏర్పాటు చేస్తున్నందంటే ముప్పు ఉండబోదని చెప్పలేమని కూడా చేస్తున్న వ్యాఖ్యలు ప్రపంచ దేశాలు అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి పొరుగుననే ఉన్న భారత్‌కు సైతం ఎప్పటికైనా ముప్పే. తమ భారీ అణుస్థావరాలను పరిరక్షిం చుకోవడంతో పాటు శతృవుల నుంచి ఎలాంటి ముప్పు ఎదురైనా లిప్త పాటుకాలంలో అధిగమించే సామర్థ్యంతో ఈ నిర్మాణంసాగుతోంది. అంతేకాకుండా వేలాది చదరపు కిలోమీటర్లఎడారి ప్రాంతాన్ని కూడా కవర్ చేసు కుంటూ లక్ష్యాన్ని ఛేదించగలిగే క్షిపణులు చైనా సొంతం. చైనా సైన్యం, జలాంతర్గాములు, విమానాల నుంచి అణ్వాయుధాలను ప్రయోగించ

జిన్‌పింగ్

గలిగినప్పటికీ చైనాకు వాయవ్యంగా ఉన్న జిన్ జియాంగ్ ప్రాంతం, గాన్సు ప్రాదేశిక ప్రాంతంలోని సిలో క్షేత్రాలే ఇపుడున్న అణ్వాస్త్రాల భద్రతకు ప్రధాన కేంద్రంగా ఉంది. చైనా అభివృద్ధి చేస్తున్న అణుసామర్థ్యం కట్టడికి అమెరికాచేస్తున్న యత్నాలు ఎప్పటికప్పుడు విఫలం అవుతున్నాయి. ఇటీవలి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటనలోకూడా ప్రస్తావనకు వచ్చినా సఫలంకాలేదు. చైనా అభివృద్ధిచేస్తున్న ఈ అణుస్థావరాలు హామీ అణుక్షిపణి క్షేత్రాలకు నైరుతి దిశగా ఉన్నాయి. రెండు కేంద్రాలు ఎడారిప్రాంతంలోనే రూపుదిద్దుకోవడం చూస్తుంటే ఎప్పటికైనాఇరుగు పొరుగు దేశాలతోపాటు అమెరికాకు కూడా ముప్పుపొంచి ఉందనే చెప్పాలి. అంతేకాకుండా అణుక్షిపణుల లాంచ్‌పాడ్‌లు కూడా ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ఉత్తర ఆక్టగాన్ చుట్టూ భారీ వాహనాలతో సైనిక, అణు విన్యాసాలు కూడా జరిగినట్లు నిఘా వర్గాలు చెపుతున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లయిన సందర్భంగా చైనా ఇటీవల నిర్వహించిన ఆయుధ ప్రదర్శనలో అణుక్షిపణులను కూడా ప్రదర్శించింది. అంతేకాకుండా భారీ వాహనాల్లో ఖండాంతర అణుక్షిపణులను కూడా విన్యాసాల్లో ప్రదర్శించి చైనా ప్రపంచ దేశాలకు తన సత్తాచాటింది. చైనా రూపొందిస్తున్న ఈ మిలిటరీ కాంప్లెక్స్ తన ఆయుధ పరిరక్షణ, భవిష్యత్తు ప్రయోగాలకోసమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే చైనాకు ముప్పు ఎవరివైపు నుంచిఉంటుందన్నది ఇతిమిద్ధంగా చెప్పలేం. చైనా దురాక్రమణకు పాల్పడుతున్న దేశాలకు వత్తాసుపలికే దేశాల నుంచే ముప్పుఉంటుందని చైనాకుకూడాతెలుసు. అందుకోసమే సర్వసన్నద్ధంగా ఉండేందుకు ఈ భారీ అణుక్షిపణి కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసుకుంటోంది. ఇప్పటికే సిక్కిం, భూటాన్ సరిహద్దుల్లోను, నేపాల్ సరిహద్దుల్లోను స్థావరాలు, గ్రామాలు ఏర్పాటుచేసు కున్న చైనా అమెరికా లక్ష్యంగా తన సురక్షిత స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నదనే భావించాలి. అమెరికాతో ఉన్నవివాదమల్లా చైనాకు అటుతైవాన్, ఇటు దక్షిణ చైనా సముద్ర జలాలేనని చెప్పాలి. అమెరికాతోపాటు ఇపుడు భారత్, ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్ మరికొన్ని ఇతర దేశాలు కూడా క్వాడ్‌తో కూడమి కట్టాయి. తైవాన్ తమదేనని చెప్పుకోడానికి కారణంకూడా దక్షిణచైనా సముద్రజలాల వివాదాలే. తమ దేశంలో అంతర్భాగంగా చేసుకుంటే ఈజలాలపై హక్కులు తమవే ఉంటాయన్నది చైనా వ్యూహంగా స్పష్టం అవుతోంది. అందుకోసమే ముందు అగ్రరాజ్యాన్ని ధీటుగా ఎదుర్కొనాలంటే అందుకు అనువైన స్థావరాలు, ఆయుధ సామగ్రిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇరాన్‌కు కారుచౌక ఆయుధాలను చైనాయే సమకూరుస్తోందన్న అమెరికా ఇప్పటికీ అనుమానం వ్యక్తం చేస్తూనే ఉంది. అత్యంత ఆధునిక ఆయుధ సంపత్తి కలిగిన అమెరికాను ఎదుర్కొనేందుకు తమవద్దఉన్న అణు సంపత్తిని కూడా చైనా సిద్ధం చేసుకుంటోంది. ఈక్రమంలో పొరుగుదేశాలు అప్రమత్తం కావాల్సిన అవసరం కూడా ఎంతో ఉంది.

కోట్లాది ప్రాణాలు హరిస్తున్న ధూమపానం

రామ కిష్టయ్య సంగన భట్ల

క్రీస్తు పూర్వం 1400ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలు వడే ధూమమేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడు దల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయోగిస్తున్నారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభమయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయితోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తుతున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థసహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా, పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, ట్రాన్స్‌కా కాసియా, ఉజ్బెకిస్తాన్, కజికిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా, క్రాస్నోదర్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహి స్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నా రని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తు న్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. 1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపు నిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగ దారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988 లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచం లోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడులో రెండొంతుల మంది మగవాళ్లు ధూమ పానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడ వాళ్లు కూడా పొగ తాగుతున్నారు. యూరప్‌లోని మాంటె నెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అల వాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్లు పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకుమాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళ్లు పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది. ఇక తక్కువగా పొగ తాగే



వారు ఉండే దేశాలు ఏవంటే ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా. ఈ ఐదు దేశాలూ అతి తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది. సిగరెట్లు, బీడీలు, గుట్కాలు, నసెం పొడులు, జర్దా, ఖైనీ, స్మోక్‌లెస్ టొబాకో లాంటి పలు రకాలైన పొగాకు ఉత్పత్తులు పలు ఆకర్షణీయ రూపాల్లో మనల్ని వశపరుచుకునేలా చేస్తాయి. వీటికి తోడుగా పొగతాగేవారితో తిరిగే స్నేహితులు, బంధువులు కూడా సెకండ్ హాండ్ స్మోకర్స్‌గా తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. అవగాహనలేమి లేదా తెలిసి కూడా పొగాకు ఉత్పత్తుల వాడకంతో నిండుప్రాణాలు ప్రమాదం లో పడడం, చివరికి వైద్య ఖర్చులకు కుటుంబాలు బజారున పడతాయి. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు దురలవాటుతో సాలీనా 8.7 మిలియన్ల ప్రాణాలు పోతున్నాయని, అనేక మిలియన్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతు న్నారని గణాంక వివరాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం ఇతివృ త్తంగా అన్‌మాస్కింగ్ ది అప్పీల్ కౌంటరింగ్ నికోటిన్ అండ్‌టొబాగో అడిక్షన్ (పొగాకు కంపెనీలవిజ్ఞప్తుల గుట్టు విప్పడం నికోటిన్, పొగాకు వ్యసనాల్ని వ్యతిరేకిద్దాం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పొగాకు ఉత్పత్తులను తయారు చేసే కంపెనీ లు వాడే ప్రమాదకర సువాసనలను వెదజల్లే పదార్థాలను వాడడం, మార్కెటింగ్ విధానాల్లో అనైతిక పద్ధతులు వాడడం, ఆకర్షణీయ ప్యాకేజీలను వాడడం, ప్రము ఖులతో ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, ప్రమాదకర ఇతర పదార్థాలను వాడడం లాంటి పోకడలను వ్యతిరేకిం చడం జరుగుతున్నది. పొగాకు పరిశ్రమలు గుప్పించే ప్రకటనల విషవలయంలో చిక్కి 37 మిలియన్ల 13-15 ఏండ్ల పిల్లలు కూడా సతమతం అవుతున్నారు. పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పరిశ్రమలు దాదాపు 16,000 రకాల సువాసన కలిగిన రసాయన పదార్థాలను కలుపుతున్నట్లు తెలుస్తు న్నది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశంఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న కేన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్‌కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్ సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి. పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు. ఎందుకంటే, పొగాకు ఊపిరితిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది. 80 శాతం కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలింది. సిగరెట్లలో 70కిపైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. ప్రస్తుత కోవిడ్ మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం వల్ల నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్‌డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్ల నుండి బయటికి

31-5Pg5.qxd:31-5Pg5.qxd 1/1/02 6:35 AM Page 1

గ్రీన్‌కార్డుపై యుటర్న్

నిబంధనలు సడలించిన అమెరికా

వలసదారులు స్వదేశం నుంచి దరఖాస్తు చేయాలనే నిబంధనలో మార్పులు

వాషింగ్టన్, మే 30: అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) నిబంధనల విషయంలో అమెరికా యూటర్న్ తీసుకుంది. గ్రీన్‌కార్డు దరఖాస్తు ప్రక్రియ జరుగుతోన్న సమయంలో వలసదారులు యుఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తాత్కాలిక వలసదారులు గ్రీన్‌కార్డు దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యుఎస్‌సిఐఎస్) ఈ నెల 21న చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా డిహెచ్‌ఎస్ వివరణ ఇచ్చింది. తాజా ప్రకటనలో డిహెచ్‌ఎస్ స్పందిస్తూ.. ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పేమీ కాదని వెల్లడించింది. దరఖాస్తుదారుడు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తి చేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అన్న దానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. ఇది ఎప్పటి నుంచో అమలులో ఉన్న నిబంధనే అని పేర్కొంది. ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తు చేయడమే మే 21న ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశమని వివరించింది. శాశ్వత నివాసం కోరుతున్న వలసదారుల దరఖాస్తుల పరిశీలన జరుగుతున్న సమయంలో కూడా వారు యుఎస్‌లో ఉండేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. వీసా ఓవర్‌స్టేలు, ఇమిగ్రేషన్‌కు సంబంధించిన ఇతర ఆందోళనలను మాత్రం తాము పరిగణనలోకి తీసుకుంటామని సూచనప్రాయంగా వెల్లడించింది. డిహెచ్‌ఎస్ వివరణ ఇచ్చినప్పటికీ.. ఎలాంటి పరిస్థితుల్లో గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులు యుఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం ఉంటుందో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. దాంతో ఈ వ్యవహారంపై వలసదారుల్లో పలు ప్రశనలు మిగిలే ఉన్నాయి.

2.0 ఆపరేషన్ సిందూర్‌కు సైనిక బలగాలు సిద్ధం

ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ,మే 30: ఒకవేళ అవసరమైతే ఆపరేషన్ సింధూర్ 2.0 చేపట్టేందుకు సైనిక బలగాలు సిద్ధంగా ఉన్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. ఆధునిక యుద్ధ రీతుల్లో ఆరితేరేందుకు త్రివిధ దళాలు సన్నద్ధం అవుతున్నాయని ఆయన అన్నారు. భూమి, ఆకాశం, సముద్రంలో అత్యాధునిక రీతిలో సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు చెప్పారు. పుణెలో జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్రిక్తల పరిస్థితులు తాత్కాలికంగా అదుపులో ఉన్నా కానీ రాబోయే దశకు చెందిన యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలు భీకరంగా రెడీ అవుతున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలు కేవలం సంప్రదాయ రీతికే పరిమితం కావు అని, సైబర్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్, కాగ్నిటివ్ డొమెయిన్లలోనూ యుద్ధ ప్రభావం ఉంటుందని ఆర్మీ చీఫ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సత్తా చాటిందన్నారు. సైనిక దళాలు చాలా కచ్చితత్వంతో అటాక్ చేయగలవని నిరూపించామన్నారు. యుద్ధ క్షేత్రంలో జరుగుతున్న మార్పుల పట్ల ఆర్మీ జాగ్రుతతో ఉందని, భవిష్యత్తుకు తగ్గట్లుగా అన్ని దళాలు ఆధునిక విధానంలో సమాయత్తం అవుతున్నాయని అన్నారు. మార్పుల్లో భాగంగా దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్స్, భారత్ బెటాలియన్స్‌తో పాటు ఇతర టెక్నాలజీ ఆధారిత సైన్యాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అన్ని అకాడమీల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ జరుగుతోందన్నారు. ఎన్డీఏ శిక్షణా కేంద్రంలో భారీ డ్రోన్లు, సిములేటర్లతో ఎన్డీఏ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంలోనూ ముందంజలో ఉన్నట్లు జనరల్ ద్వివేది తెలిపారు. ఓఓడీఏ అబ్జర్వ్, ఓరియంట్, డిసైడ్, యాక్ట్ చక్రాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏఐ ఆధారిత సేవల వినియోగాన్ని పెంచుతున్నట్లు చెప్పారు.

విద్యుత్ బిల్లులపై పదిశాతం సర్‌ఛార్జి వసూలు

రేపటి నుంచే అమలు

లక్నో, మే 30: ఎండ తీవ్రతతో ఇప్పటికే భారీగా కరెంట్ బిల్లులు కడుతున్న సామాన్యుడి నెత్తిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మరో పిడుగు వేసింది. జూన్ నెల నుంచి విద్యుత్ బిల్లులను కనీసం 10 శాతం పెంచుతున్నట్లు ప్రక టించింది. ఇంధన ధరల పెరుగుదల కారణంగా ఫ్యూయల్ సర్‌ఛార్జ్ భారం వినియోగదారులకు తప్పడంలేదని ఉత్తరప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ శనివారం ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. ఈ పెరిగిన ధరలు జూన్ నెలలో వచ్చే బిల్లింగ్ సైకిల్ నుండే నేరుగా వర్తిస్తాయని యూపీపీసీఎల్ స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం ఈ ఏడాది మార్చి నెలకు సంబంధించి లెక్కించిన ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ సర్‌ఛార్జ్ మొత్తాన్ని జూన్ నెల బిల్లుల్లో వసూలు చేయడం జరుగుతుంది. మార్చి నెలాఖరు నాటికి ఈ అదనపు భారం 10 శాతంగా తేలింది. దీన్ని అన్ని వర్గాల (గృహ, వాణిజ్య, పారిశ్రామిక) వినియోగదారుల బిల్లులకు అదనంగా చేర్చాలని ఆదేశాలు వచ్చాయని అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ గతేడాది తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారమే ఈ అదనపు సర్‌ఛార్జి ఉంటోందని రెగ్యులేటరీ అఫైర్స్ యూనిట్ చీఫ్ ఇంజనీర్ పంకజ్ సక్సేనా ఒక లేఖలో వివరిం చారు. ఈ కొత్త రూల్స్ ప్రకారం విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కొనుగోలు చేసే బొగ్గు, గ్యాస్ వంటి ఇంధన ధరల్లో వచ్చే మార్పులు లేదా అదనపు ప్రసార ఖర్చుల భారాన్ని మూడు నెలల ఆలస్యం తర్వాత నేరుగా కస్టమర్ల అకౌంట్లలోకి బదిలీ చేసే వెసులుబాటు విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కమ్‌లకు) ఉంటుంది. అందువల్లే మార్చి నెలలో కంపెనీలకు అయిన అదనపు ఖర్చును, కరెక్ట్‌గా మూడు నెలల తర్వాత అంటే జూన్ బిల్లుల్లో 10 సర్‌ఛార్జ్ రూపంలో వసూలు చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకు తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడు కరెంట్ బిల్లులు కూడా 10 శాతం పెరగడం మధ్యతరగతి గృహాల నెలవారీ బడ్జెట్‌ను పూర్తిగా అస్తవ్యస్తం చేయనుంది.

సంపూర్ణ ఆరోగ్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్!

వాషింగ్టన్, మే 30: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై శ్వేతసౌధం ముఖ్య నివేదికను విడుదల చేసింది. ట్రంప్‌మంచి ఆరోగ్యంతో ఉన్నారని, కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించడానికి పూర్తిగా ఫిట్‌గా ఉన్నారని ఆ నివేదిక స్పష్టం చేసింది. మంగళవారం వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ట్రంప్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా ఈ నివేదికను నిన్న విడుదల చేశారు. పరీక్షల అనంతరం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ, ప్రతి ఆరు నెలలకు జరిగే తన సాధారణ వైద్య పరీక్షలు పూర్తయ్యాయని, అన్నీ పర్ఫెక్ట్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమగ్ర వైద్య పరీక్షల్లో భాగంగా 22 మంది నిపుణులు సీటీ స్కాన్, క్యాన్సర్ స్క్రీనింగ్‌లతో పాటు ఇతర పలు పరీక్షలు నిర్వహించినట్లు నివేదికలో పేర్కొన్నారు. నివేదిక ప్రకారం ట్రంప్ బరువు 108 కిలోగ్రాములుగా (238 పౌండ్లు) నమోదైంది. గత ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలతో పోలిస్తే ఇది 6 కిలోలు ఎక్కువ. ఆయన బాడీ మాస్ ఇండెక్స్ 29.7గా ఉంది. వైద్యుల ప్రకారం బీఎంఐ 30 దాటితే ఊబకాయంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన ఆహారం, శారీరక శ్రమ, బరువు తగ్గడంపై వైద్యులు కొన్ని సూచనలు చేశారు. అదే సమయంలో ఆయన మేధో, శారీరక పనితీరు అద్భుతంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. మేధోపరమైన సామర్థ్యాన్ని అంచనా వేసే మాంట్రియల్ కాగ్నిటివ్ అసెస్‌మెంట్‌లో ట్రంప్ 30కి 30 మార్కులు సాధించారు. 2018, 2025లో నిర్వహించిన పరీక్షల్లోనూ ఆయన ఇదే స్కోరు సాధించడం గమనార్హం. మందుల వాడకం వల్ల ఆయన కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా మెరుగు పడ్డాయి. 2018లో 223గా ఉన్న టోటల్ కొలెస్ట్రాల్ తగ్గింది. చేతులపై ఉన్న గాయాలను తరచుగా కరచాలనం చేయడంవల్ల వైద్యులు పేర్కొన్నారు.

లోయలో పడిన శరణార్థుల బస్సు

- 22 మంది దుర్మరణం.. 36 మందికి గాయాలు - మృతుల్లో మహిళలు, చిన్నారులు అధికం - డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఘోర ప్రమాదం

కాబూల్, మే 30: ఆఫ్ఘనిస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదంచోటుచేసుకుంది. పాకిస్తాన్ నుంచి స్వదేశానికి ఆఫ్ఘన్ శరణార్థులతో ప్రయాణిస్తున్న ఓ ట్రక్కు బోల్తా పడటంతో కనీసం 22 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 36 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉండటం ఈ ఘటన తీవ్రతను మరింత పెంచింది. ఈ ప్రమాదం తూర్పు ఆఫ్ఘనిస్తాన్‌లోని లగ్మన్ ప్రావిన్స్ పరిధిలో కాబూల్‌నంగర్‌హార్ ప్రధాన రహదారిపై జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, గంటల తరబడి నిరంతరంగా వాహనం నడిపిన డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ట్రక్కు అదుపు తప్పి రహదారి పక్కనున్న లోతైన కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో భారీ సంఖ్యలో కుటుంబాలు ప్రయాణిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లగ్మన్ ప్రావిన్స్ గవర్నర్ ప్రతినిధి అబ్దుల్ మాలిక్ నియాజాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం మృతుల్లో 10 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు, స్థానిక గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రక్కులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. గాయపడిన వారిని నంగర్‌హార్, జలాలాబాద్ ప్రాంతాల్లోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్నవారంతా పాకిస్తాన్ నుంచి తిరిగి వస్తున్న ఆఫ్ఘన్ శరణార్థులేనని అధికారులు ధృవీకరించారు. 2023లో అక్రమ వలసదారులపై పాకిస్తాన్ ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించిన తర్వాత లక్షలాది మంది ఆఫ్ఘన్‌లు తమ స్వదేశానికి తిరిగి రావాల్సి వచ్చింది. దశాబ్దాలుగా పాకిస్తాన్‌లో నివసిస్తూ అక్కడే జీవనం సాగించిన కుటుంబాలు కూడా బలవంతంగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఇరాన్ కూడా ఆఫ్ఘన్ వలసదారులపై కఠిన చర్యలు చేపడుతుండటంతో వేలాది మంది స్వదేశానికి చేరుకుంటున్నారు. అయితే తిరిగి వచ్చిన వారికి సరైన నివాసాలు, ఉపాధి అవకాశాలు, రవాణా సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక కష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ప్రమాదం కూడా అలాంటి సంక్షోభ పరిస్థితుల్లోనే చోటుచేసుకున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో రోడ్డు ప్రమాదాలు సాధారణమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పాడైపోయిన రహదారులు, సరైన భద్రతా ప్రమాణాల లేమి, వాహనాల అధిక లోడింగ్, డ్రైవర్ల అలసట, ట్రాఫిక్ నియమాల అమలులో నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లోని ప్రమాదకర రహదారులు, లోతైన లోయలు ప్రయాణికులకు మరింత ముప్పుగా మారుతున్నాయి.

ఒక్కపరీక్ష కూడా సవ్యంగా నిర్వహించలేకపోయారు!

ప్రధాని మోడీపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ, మే 30: ఎన్డీయే హయాంలో ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమస్త విద్యా వ్యవస్థన్ను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. శనివారం దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలో ఆలస్యం జరిగింది. రాహుల్ గాంధీ దీనిపై స్పందించారు. నీట్, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ, ఇప్పుడు క్యూట్. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేద్దు అని విమర్శించారు. విశ్వగురు అనే వాదనలను సవాల్ చేశారు. ప్రధాని మోడీ సమస్త విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. మీరు ఏ తరం భవిష్యత్తును నాశనం చేస్తున్నారో, అదే తరం మిమ్మల్ని జవాబుదారీగా నిలబెడుతుంది అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. సీయూఈటీ ఆలస్యం జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో మరో వైఫల్యమని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, ఢిల్లీ మాజీ సీఎం అతిషి విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

భారత్‌లో సందడిచేస్తున్న టిఫాని ట్రంప్!

న్యూఢిల్లీ, మే 30: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు మరోసారి భారత దేశంలో సందడి చేస్తున్నారు. ట్రంప్ కుమార్తె టిఫానీ ట్రంప్ ప్రస్తుతం భారత్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పూర్తిగా వ్యక్తిగత పర్యటన నిమిత్తం ఇండియాకు వచ్చిన ఆమె ముందుగా భారతదేశ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ప్రఖ్యాత స్వామి నారాయణ్ అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించారు. అక్షర్‌ధామ్ ఆలయ ప్రాంగణంలోకి అడుగు పెట్టిన టిఫానీ ట్రంప్‌కు అక్కడి నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈక్రమంలోనే అక్కడి అద్భుత శిల్పకళను, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాలను ఆమె అత్యంత ఆసక్తిగా తిలకించారు. ఇక్కడి కట్టడాల వైభవాన్ని చూసి ఆమె పూర్తిగా ఆశ్చర్య పోయారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కొలువై ఉన్న 108 అడుగుల భారీ నీలకంఠ్ వర్ణి విగ్రహాన్ని ఆమె ప్రత్యేకంగా సందర్శించి అక్కడే కొంత సమయం గడిపారు. ఈ పర్యటనకు సంబంధించిన అందమైన ఫొటోలను టిఫానీ తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకోవడంతో ఈ హై ప్రొఫైల్ పర్యటన వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ పర్యటన ముగించుకున్న తర్వాత టిఫానీ ఆగ్రా తాజ్‌మహల్‌ను కూడా సందర్శించారు. చారిత్రక కట్టడం ముందు కూర్చుని ఫోటోలు దిగారు. ఆగ్రా పర్యటన అనంతరం ఆమె రాజస్థాన్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన, ఎడారి నగరం జైసల్మేర్‌లో ఆమె పర్యటించి, అక్కడి కోటలను, సంస్కృతిని వీక్షించారు. ఇది పూర్తిగా టిఫానీ ట్రంప్ వ్యక్తిగత పర్యటన అయినప్పటికీ ఆమె అమెరికా అధ్యక్షుడి కుమార్తె కావడంతో భారత అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థలు ఆమె పర్యటించే ప్రాంతాల్లో అత్యంత కట్టుదిట్టమైన, భారీ భద్రతా ఏర్పాట్లను చేశాయి. ఆమె వెళ్లే మార్గాల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. టిఫానీ ట్రంప్ భారత దేశానికి రావడం



ఇది మొదటి సారి కాదు. గతంలో 2018లో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఆమె భారత్‌లో అధికారికంగా పర్యటించారు. ఆ సమయంలో తండ్రితో పాటు టిఫానీ కూడా భారత్‌కు విచ్చేసి ఇక్కడి విశేషాలను తిలకించారు.

నేవీ వైస్ ఛీఫ్‌గా అజయ్‌కొచ్చర్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ,మే 30 ఆపరేషన్ సింధూర్ వ్యూహకర్త వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ శుక్రవారం నాడు నేవీ వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మిలిటరీలోని టాప్ నేతల మార్పులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అజయ్ కొచ్చర్ పదోన్నతి పొందారు. త్రివిధ దళాలు కొత్త చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి, తదుపరి నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ కే స్వామినాథన్ ఆదివారం రోజున తమ కొత్త బాధ్యలు స్వీకరించనున్నారు. ఇక శుక్రవారం రోజున ముంబైలోని వెస్ట్రన్ నావెల్ కమాండ్‌కు కమాండర్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠి శని, ఆదివారాల్లో పదవీవిరమణ చేయనున్నారు. ఆర్మీ జనరల్ ఉపేంద్ర ద్వివేది జూన్ 30వ తేదీన ఆర్మీ చీఫ్‌గా రిటైర్ కానున్నారు. వైస్ అడ్మిరల్ కొచ్చర్‌ది హర్యానాలోని కర్నాల్. ఆయన తండ్రి హర్యానా ఇరిగేషన్ శాఖలో మాజీ ఇంజినీర్. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత జాతీయ వార్ మెమోరియల్ వద్ద కొచ్చార్ పుష్పగుచ్చం ఉంచారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో నేవీకి చెందిన ప్లానింగ్‌ను అడ్మిరల్ కొచ్చార్ చేశారు. ముంబై నుంచి ఆయన ఆ ఆపరేషన్ నిర్వహించారు. పశ్చిమ సముద్ర ప్రాంతంలో ఉన్న శత్రు సమస్యను ఆయన తన ప్లానింగ్‌తో ఎదుర్కొన్నట్లు చెప్పారు. సాంప్రదాయ, సాంప్రదాయేతర శైలిలో వెస్ట్రన్ కమాండ్ ఆ సమయంలో రెస్పాండ్ అయ్యింది. వైస్ అడ్మిరల్ కొచ్చర్ 1988 జూలైలో నేవీలో చేరారు.

అమరత్వానికి పుతిన్ యాంటీ ఏజింగ్ ప్రాజెక్టు

26 బిలియన్ రూబుళ్లతో ప్రణాళిక

3-డి ప్రింటింగ్‌తో జీవకణాల రూపకల్పన, అభివృద్ధి

మినీపిగ్స్‌లో మానవ అవయవాల పెంపు

మాస్కో, మే 30: గత కొన్నేళ్లుగా రష్యా అధ్యక్షుడు పుతిన్ అమరత్వం గురించి మాట్లాడుతున్నారు. 73 యేళ్ల వయసున్న పుతిన్ చావును ఎదురించి ఎక్కువ కాలం రష్యా అధ్యక్షుడిగా పనిచేయాలని ఆరాటపడుతున్నారు. ఇప్పటికే మనుషుల అవయవాలపై రష్యా సైంటిస్టులు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పుడు చావును జయించేందుకు 26 బిలియన్ల రూబుల్స్ ఖర్చుతో 'యాంటీ-ఏజింగ్' ప్రాజెక్టును మొదలుపెట్టారు. 3-డి ప్రింటింగ్ ద్వారా జీవకణాలను సృష్టించి వాటిని డెవలప్ చేస్తారు. ఆ తర్వాత మినీపిగ్స్‌లో మానవ అవయవాలను పెంచుతారు. రాబోయే రోజుల్లో మనుషుల పూర్తి అవయవాలను కూడా మార్చేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందట. ఇలా మార్చడం ద్వారా మనుషుల మరణాన్ని వాయిదా వేసుకోవచ్చనేది పుతిన్ ఆలోచన.

పుతిన్ కూతురు నేతృత్వంలో..

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు పుతిన్ కూతురు మరియా, ప్రముఖ సైంటిస్టు మైఖేల్ కోవాచుక్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతం అయిన తర్వాత అవసరమైతే మనుషుల పూర్తి అవయవాలను మినీపిగ్స్‌లో పెంచే అవయవాలతో రీప్లేస్ చేయొచ్చని కోవాచుక్ మీడియాతో తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టుపై రష్యాలో బయోప్రింటింగ్ వ్యవస్థ సృష్టించిన ప్రముఖ సైంటిస్ట్ అలెగ్జాండర్ ఓస్ట్రోవ్‌స్కీ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం కోరికల స్థాయిలోనే ఉందని.. కార్యరూపం దాల్చలేదన్నారు.

మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై రాళ్లదాడి

కోల్‌కత్తా, మే 30: పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్‌లో శనివారం మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన సందర్భంగా ఆయనపై గుడ్లు, రాళ్లు విసిరారు. ఇదే సమయంలో బీజేపీ కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా దొంగ దొంగ అని నినాదాలు చేశారు. ఈ దాడి నుంచి అభిషేక్‌కు కాపాడేందుకు భద్రత సిబ్బంది తమ హెల్మెట్ ఇచ్చి రక్షణగా నిలిచారు. బీజేపీ కార్యకర్తలే దాడి చేశారని టీఎంసీ ఆరోపించింది. అక్కడ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో భద్రతా సిబ్బంది ఆయనను చుట్టుముట్టి రక్షణగా నిలుస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటన అనంతరం అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ ఈ దాడిని బీజేపీయే ప్రోత్సహించిందని ఆరోపించారు. ఇదంతా బీజేపీయే ప్రోత్సహించింది. వాళ్లు ఏం చేశారో చూడండి. ఇదేనా వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ. నెల కూడా కాలేదు, పోలీసులు ఎక్కడా కనిపించడం లేదని ఆయన అన్నారు. దాడి చేసినవారు తనను చంపడానికే వచ్చారని ఆరోపించిన బెనర్జీ ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డయిందని పేర్కొన్నారు. వారు నన్ను చంపాలనుకున్నారు. ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డ్ అయింది. మేము ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తప్పకుండా తీసుకువస్తాం గవర్నర్‌కు కూడా తెలియజేస్తాం. నేను తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తానని ఆయన అన్నారు. తాను త్రుటిలో తీవ్ర గాయాల నుంచి తప్పించుకున్నానని చెప్పారు. తలకు గాయంకాకుండా తప్పించుకున్నారు అదృష్టవశాత్తు, నేను హెల్మెట్ ధరించాను వారు నా బట్టలు చించి, నా కళ్లజోడు పగలగొట్టారని తెలిపారు. ఘటనా స్థలంలో పోలీసుల ఉనికి లేదు. వారు మమ్మల్ని చంపాలనుకుంటున్నారు. చంపనివ్వండి నేను చావనైనా చస్తాను కానీ ఇక్కడ నుంచి కదలనని అన్నారు. తగిన భద్రతా ఏర్పాట్లు చేసే వరకు తాను వెళ్లబోనని తేల్చిచెప్పారు.

సంక్షిప్తంగా..

సోనియాగాంధీకి కంటి శస్త్రచికిత్స

న్యూఢిల్లీ, మే 30: కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఈ సర్జరీ నుంచి కోలుకున్న సోనియా గాంధీ తాజాగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. న్యూఢిల్లీలోని తన నివాసమైన10 జన్‌పథ్‌కు చేరుకున్నారు. కొద్ది రోజులుగా సోనియా అనారోగ్యంపై చాలా ప్రచారం జరిగింది. ఆమెకు ఏమైంది అనే విషయంలో ఎలాంటి ప్రకటనా రాలేదు. ఇదే సమయంలో ఇటీవల న్యూఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో చేరినట్లు ప్రచారం జరిగింది. ఆమె తనయుడు రాహుల్ గాంధీ కూడా సోనియా గాంధీని ఆస్పత్రిలో కలిసి వచ్చారు. అయితే, సోనియా గాంధీకి కంటి ఆపరేషన్ జరిగినట్లు తాజాగా వెల్లడైంది.

రాజస్థాన్‌లో ఇసుక తుఫాను బీభత్సం

జైపూర్, మే 30: రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోని చురు, శ్రీగంగానగర్, బికనీర్, సీకర్ తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భీకర గాలులు వణికించాయి. దట్టమైన మేఘాల రూపంలో ఇసుక ఆవరించడంతో ఒక్కసారిగా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. అనంతరం ఆయా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఇసుక తుపాను కారణంగా వాహనదారులు, స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దట్టమైన ఇసుక తుపానుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి. అంతకుముందు జైపూర్‌లోనూ శుక్రవారం ఇదే విధమైన వాతావరణం కనిపించింది. ఇసుక తుపానుతోపాటు భీకర గాలులు వీచాయి. ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

భూతగాదాల్లో కాల్పులు - ఒకే కుటుంబంలో ఆరుగురి దారుణ హత్య

బెంగళూరు, మే 30: భూ వివాదం నేపథ్యంలో ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై ప్రత్యర్థులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత వారిని దారుణంగా నరికి చంపారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గోవిందపూర్ గ్రామానికి చెందిన నిరాలే, గోలగి కుటుంబాల మధ్య చాలా కాలంగా భూవివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో నిరాలే కుటుంబ సభ్యులపై గోలగి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఆరుగురిపై తొలుత కాల్పులు జరిపారు. ఆ తర్వాత వారందరినీ దారుణంగా నరికి చంపారు. ఈ సమాచారం తెలుస్తున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను చందు నిరాలే, దుండప్ప నిరాలే, శివపుత్ర నిరాలే, రాహుల్ నిరాలే, సమర్థ నిరాలే, షబ్బీర్ నదాఫ్‌గా గుర్తించారు.

కారును ఢీకొట్టి అరకిలోమీటరు ఈడ్చుకెళ్లిన ట్రక్కు

భువనేశ్వర్, మే 30: ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఓ తండ్రి, కుమార్తె త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి వారు ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఆపై ఓ అరకిలోమీటర్ వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భువనేశ్వర్‌లోని పలాసునీ బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. తండ్రీకూతుళ్లు కారులో వంతెన దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన ఒక భారీ ట్రక్కు దాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ తర్వాత కూడా ట్రక్కు డ్రైవర్ తన వాహనాన్ని ఆపకుండా కారును రోడ్డుపై అరకిలోమీటర్‌కుపైగా ఈడ్చుకెళ్లాడు. దాంతో కారులో ఉన్నవారితోపాటు, రోడ్డుపై ఉన్న ప్రయాణికులు కూడా తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

31-5Pg6exHMNWJQE.qxd:31-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:40 AM Page 1

లక్ష్మీనరసింహస్వామి దివ్యాశీస్సులు అందరిపై కలగాలి

మంత్రి నారా లోకేశ్

తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి: తమిళనాడు రాష్ట్రం రాణిపేట జిల్లా షోలింగర్‌లో కొలువైన ప్రసిద్ధ యోగ లక్ష్మీ నరసింహస్వామిని రాష్ట్ర మంత్రి నారాలోకేశ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు పర్యటనలో ఆయన కొండపైకి రోప్‌వేలో వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. 420 మెట్లు నడిచి యోగ ఆంజనేయస్వామి ఆలయ సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ దివ్యాశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. లోకేష్ వెంట తిరుపతి, చిత్తూరు జిల్లాల టిడిపి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్ ,డాక్టర్ మురళీ మోహన్ ఉన్నారు. కొండకెళ్ళే మార్గమధ్యలో భక్తులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి నారా లోకేష్ తమిళనాడు వాసులతో మమేకమయ్యారు. ఆలయ వేద పండితులు లోకేష్‌కు వేదాశీర్వచనం అందించి, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి నగరంలో మార్మోగిన గోవిందనామస్మరణ

తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి: పవిత్రమైన తిరుపతి నగరంలో ప్రతి శనివారం తెల్లవారు జామునే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో, నుదుటిపై గోవింద నామాలతో గోవింద నామస్మరణలతో పునీతులవుతున్నారు. గోవిందరాజ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య నగర సంకీర్తన ప్రారంభమైంది. గోవింద.. గోవింద.. అనే నామస్మరణతో తిరుపతి వీధులు ఆధ్యాత్మిక కాంతిని ప్రసరించాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో భక్తి భావాన్ని నింపాలనే లక్ష్యంతో మండలి సభ్యులు సేవాభావంతో ముందుకు సాగుతున్నారు. సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన

మండలి సభ్యులు మునెప్ప గారి మునినాథరెడ్డి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి,, విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, మిట్టపల్లి బ్రహ్మానందం, కన్నప్ప గారి కేశవులు, నాగేశ్వరరెడ్డి, రాజేంద్రన్, సుధాకర్ చౌదరి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అరుణమ్మ, జయమ్మ, విజయ కుమారి, అమరావతి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై

'జీరో టాలరెన్స్'విధానం

రైల్వే స్టేషన్, బస్టాండ్ పార్సెల్ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు

తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు వినియోగంపై తిరుపతి జిల్లా పోలీస్ శాఖ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తోంది. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం పోలీస్‌శాఖ ప్రధాన బాధ్యతగా భావిస్తోంది. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజల సహకారంతో మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్లడించారు. జిల్లా ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ డి. నాగార్జున రెడ్డి సిబ్బంది శనివారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్ పార్సల్ కార్యాలయాల్లో నార్కోటిక్ డాగ్స్ సహాయంతో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వస్తువులు, పార్సిళ్లు, సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలు, సరఫరా కార్యకలాపాలు ఏమైనా జరుగుతున్నాయా అనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ప్రజల భద్రత, యువత భవిష్యత్తు పరిరక్షణ దృష్ట్యా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు జిల్లావ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

తిరుమలలో విఐపి దర్శనాలను తక్షణమే రద్దు చేయాలి

ఎపి చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి

తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న విఐపి , బ్రేక్ దర్శనాల వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని ఏపీ చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. దేవాలయాల్లో విఐపి సంస్కృతి, ప్రత్యేక దర్శనాలపై మద్రాస్ హైకోర్టు ఇటీవల చేసిన కీలక వ్యాఖ్యలను ఏపీ చైతన్య వేదిక హర్షిస్తున్నదని తెలిపారు. దేవాలయంలో దేవుడొక్కడే వీఐపీ, దేవుడి ముందు అందరూ సమానమే అని న్యాయస్థానం స్పష్టం చేయడం సమాజానికి సరైన దిశానిర్దేశమని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రస్తుతం అమలవుతున్న వీఐపీ దర్శన విధానం కారణంగా సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూల్లో నిరీక్షించే సాధారణ భక్తుల కంటే, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, సినీ ప్రముఖులు, సిఫార్సులతో వచ్చే వారికి ప్రత్యేక దర్శన సౌకర్యాలు కల్పించడం

అన్యాయమని విమర్శించారు. మద్రాస్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి దేశంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో విఐపి దర్శనాలు, ప్రత్యేక ప్రవేశాలు, సిఫార్సు ఆధారిత దర్శన విధానాలను రద్దు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడటం, దేవాలయాల పవిత్రతను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని డాక్టర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు.

పవన్‌ను విమర్శిస్తే ఊరుకోం

సుగాలి ప్రీతి విషయంలో న్యాయం చేసింది

డి.సిఎంనే: జనసేననేత కిరణ్‌రాయల్

తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి: కాపు ముసుగులో పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే ఊరుకోమని తిరుపతి జిల్లా జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ హెచ్చరించారు. సుగాలి ప్రీతి కోసం లక్షలాది మందితో సభపెట్టామని, పవన్ కళ్యాణ్ న్యాయం చేశారన్నారు. దాసరి రాము వైసిపికి అమ్ముడుపోయాడని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవన్ కళ్యాణ్‌ను, నాదెండ్ల మనోహర్‌ను కించపరిచే విధంగా మాట్లాడుతున్నాడని అన్నారు. 2019లో జనసేన ఓడిపోయిన తరువాత కొంతమంది పార్టీని వదలి వెళ్ళిపోయారని, వారిలో దాసరి రాము ఉన్నాడన్నారు. రాము సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేశారని, రాము నోరు అదుపులో పెట్టుకోవాలని కిరణ్‌రాయల్ ఘాటుగా స్పందించారు. వైసిపి నుంచి గుంటూరు సీటు కోసం రాము అమ్ముడు పోయాడని ఆరోపించారు. వైసిపి సోషల్ మీడియాతోనే పేమెంట్ బ్యాచ్ మాట్లాడుతోందన్నారు.

ఏఐ యుగంలో ఎంబీఏ విద్యకు నూతన దిశ ఎన్‌సీ-రైమ్- 2026 ఘన విజయం

నారాయణ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్ మేనేజ్‌మెంట్ విద్యపై జాతీయ సదస్సు

హైదరాబాద్, ప్రభాతవార్త, మే 30: నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సి- రీ ఇమేజింగ్ ఎంబీఏ ఎడ్యుకేషన్ ఇన్ ద ఎరా ఆఫ్ ఏఐ, ఎనాలిస్టిక్స్ అండ్ ఫిన్‌టెక్-రైటమ్- 2026 పేరిట శనివారం ఒకరోజు జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించబడింది. ఈ సదస్సు హైబ్రిడ్ (ఆన్లైన్ + ఆఫ్లైన్) విధానంలో నిర్వహించబడగా దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, పరిశ్రమ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సు ప్రధాన అంశం ఏఐ, అనాలటిక్స్, ఫిన్‌టెక్ యుగానికి అనుగుణంగా ఎంబీఏ విద్యకు నూతన రూపకల్పన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, బిజినెస్ అనలిటిక్స్, ఫిన్ టెక్, మెషిన్ లెర్నింగ్ వంటి అంశాలు మేనేజ్ మెంట్ విద్యపై చూపుతున్న ప్రభావం, భవిష్యత్ మేనేజ్ మెంట్ విద్య ఎలా ఉండాలనే అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ మాట్లాడుతూ .. ఆధునిక మేనేజ్ మెంట్ విద్య కృత్రిమ మేధస్సు(ఏఐ), డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ ఆధారిత పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్

వ్యాపార ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆలోచనలు, పరిశోధన) కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

ముఖ్య వక్తగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ ప్రసం గంలో ఏఐ మేనేజ్ మెంట్ విద్యలో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందని తెలిపారు. సంప్రదాయ ఎంబీఏ బోధన విధానాలు పూర్తిగా మారిపోతున్నాయని, భవిష్యత్ ఎంబీఏ విద్యార్థులు టెక్నాలజీ, నాయకత్వం, నైతిక విలువలు, ఇన్నోవేషన్, సమస్య పరిష్కార సామర్థ్యాలను సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఏఐ ఆధారిత క్లాస్‌రూమ్స్, వ్యక్తిగత అభ్యాసన విధానాలు, డేటా ఆధారిత నిర్ణయాలు, ఇండస్ట్రీ అకాడెమియా భాగస్వామ్యాలు భవిష్యత్ మేనేజ్‌మెంట్ విద్యను ప్రభావితం చేస్తాయని తెలిపారు. ప్రపంచ స్థాయి బిజినెస్ స్కూల్స్ ఇప్పటికే ఏఐ ఆధారిత పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నాయని, భారతీయ బి-స్కూల్స్ కూడా వేగంగా మారాల్సిన అవసరం ఉందన్నారు.

ఎంబీఏ విద్యార్థులు "ఉద్యోగం కోసం చదవడం" కంటే "సమస్యలకు పరిష్కారాలు అందించే నాయకులుగా" ఎదగాలని సూచించారు. విశిష్ట అతిథిగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, పరిశోధన, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాభివృద్ధి అత్యవసరమన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పోటీకి సిద్ధమయ్యే విధంగా మేనేజ్ మెంట్ విద్యలో సరికొత్త మార్పులు రావాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తమ సందేశంలో ఏఐ, అనాలిటిక్స్, ఫిన్‌టెక్ ఆధారిత విద్య భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దుతుందని తెలిపారు. ఇలాంటి జాతీయ సదస్సులు పరిశోధన, అకాడమిక్ నైపుణ్యాలు, పరిశ్రమ విద్యా సంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయని అభినందించారు.

నారాయణ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ ఇందిర పొంగూరు మాట్లాడుతూ ప్రస్తుతం మేనేజ్ మెంట్ విద్య కేవలం సాంప్రదాయ వ్యాపారజ్ఞానానికే పరిమితం కాకుండా, కృత్రిమ మేధస్సు, డేటా అనలిటిక్స్, ఫైనాన్షియల్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక అంశాలతో సమన్వయం కావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం కావాలంటే సాంకేతిక నైపుణ్యాలతో పాటు పరిశోధనా దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి జాతీయ సదస్సులు విద్యార్థుల్లో విజ్ఞాన విస్తరణకు దోహదపడతాయని పేర్కొన్నారు.

తెలుగమ్మాయికి ప్రతిష్టాత్మక పురస్కారం

మిన్నెసోటా ఆస్పిరేషన్స్ ఇన్ కంప్యూటింగ్‌లో అవార్డ్

స్టేట్ ఆనరబుల్ మెన్షన్ అందుకున్న గోలి అనన్య

విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి: ప్రపంచ ఐటీ యవనికపై తెలుగు బిడ్డలు మరోసారి తమ సత్తా చాటారు. అమెరికాలో కంప్యూటర్ సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన యువతకు అందించే ప్రతిష్టాత్మక 2026 మిన్నెసోటా ఆస్పిరేషన్స్ ఇన్ కంప్యూటింగ్ అవార్డుల్లో తెలుగు అమ్మాయి అనన్య గోలి స్టేట్ హానరబుల్ మెన్షన్ పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. మిన్నెసోటా టెక్నాలజీ ఫౌండేషన్, నేషనల్ సెంటర్ ఫర్ విమెన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ప్రతిభావంతుల్లో అనన్య ఒకరిగా నిలిచారు. ఈడెన్ ప్రైరీ హైస్కూల్ లో సోఫో మోర్ చదువుతున్న అనన్య, ఇంత చిన్న వయసులోనే సాంకేతిక రంగంలో అద్భుతమైన లీడర్ షిప్ నైపుణ్యాలను ప్రదర్శించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ గర్వకారణంగా నిలిచారు. అనన్య గోలి కేవలం కోడింగ్, చదువులకే పరిమితం కాకుండా సాంకేతిక రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు అద్భుతమైన కృషి చేస్తున్నారు. ఈడెన్ ప్రైరీ హైస్కూల్‌లో టెక్నాలజీ రంగంలో ఉన్న అమ్మాయిలకు అండగా నిలిచేందుకు, వారిని ప్రోత్సహించేందుకు టెక్నోవేషన్ చాప్టర్‌ను ఆమె కో ఫౌండర్‌గా ప్రారంభించారు. దీని ద్వారా ఎంతో మంది తోటి విద్యార్థినులకు సాంకేతికతపై అవగాహన కల్పిస్తూ, సరికొత్త డిజిటల్ ఆవిష్కరణల వైపు వారిని నడిపిస్తున్నారు. ఐటీ రంగంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా రాణించగలరని అనన్య తన చేతలతో నిరూపిస్తున్నారు. ఈ అవార్డు గుర్తింపుతో పాటు అనన్య తన అంకితభావంతో అరుదైన ప్రొఫెషనల్ అవకాశాలను కూడా సొంతం చేసుకున్నారు. గత వేసవిలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మూడు జాబ్ షాడో అవకాశాలను దక్కించుకుని, కార్పొరేట్ టెక్నాలజీ ప్రపంచాన్ని ఆమె దగ్గరగా పరిశీలించారు. అంతేకాకుండా, ఐటీ రంగానికి చెందిన ప్రముఖ నిపుణుల సమక్షంలో ఒక ప్రొఫెషనల్ మెంటార్‌ను పొంది, తన నైపుణ్యాలకు మరింత పదును పెట్టుకుంటున్నారు. అమెరికాలో జరిగిన పలు కీలకమైన టెక్నాలజీ కాన్ఫరెన్స్‌లలో పాల్గొని, ప్రముఖ గ్లోబల్ టెక్నాలజిస్టులతో నెట్‌వర్కింగ్ చేసే అరుదైన అవకాశాన్ని సైతం ఆమె దక్కించుకోవడం విశేషం. అనన్యతో పాటు ఈడెన్ ప్రైరీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు అవార్డులకు ఎంపికయ్యారు. త్రయి కొప్పరపు (స్టేట్ విన్నర్), హిమజ గుంటూరు (స్టేట్ హానరబుల్ మెన్షన్), సరయు కాచం (స్టేట్ హానరబుల్ మెన్షన్) అందుకున్నారు. వీరితో పాటు సిసిలియా రతెమో, ఆయిషా ఆలం, బ్రూక్లిన్ బైఫీల్డ్, శగున్ శ్రీవాస్తవ కూడా ఈ అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

జూన్ 1 వ తేదీ నుంచే పెన్షన్లు పంపిణి

విజయవాడ మే 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సామాజిక పెన్షన్ల లబ్ధిదారులకు మరోసారి తీపి కబురు అందించింది. జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ఇందుకోసం మొత్తం రూ.2,728 కోట్లను కేటాయించింది. ఎప్పటిలాగే వచ్చే నెల మొదటి తారీఖున, అంటూ జూన్ 1 వ తేదీ సోమవరం ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా వృద్దులు వికలాంగులు, వితంతవులు ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఉదయం నుంచే సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి నేరుగా నగదును చేతికి అందించనున్నారు. ఈ జూన్ నెలలో ఏపీ వ్యాప్తంగా మొత్తం 62,34,445 మంది లబ్ధిదారులకు ఈ సామాజిక భద్రతా పెన్షన్లు అందనున్నాయి. ఈసారి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భర్త లేదా భార్య చనిపోయిన వారికి ఇస్తే స్పౌజ్ పెన్షన్లను కొత్తగా మరో 5,606 మందికి మంజూరు చేసింది. ఈ కొత్త స్పౌజ్ పెన్షన్ల పంపిణీ కోసం ప్రత్యేకంగా రూ.2.24 కోట్లను ప్రభుత్వం అదనంగా విడుదల చేసింది. దీనివల్ల ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద ఊరట లభించనుంది.

సెకండరీ ఆసుపత్రుల్లో 238 మంది వైద్యుల నియామకం

విజయవాడ మే 30 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని ఆసుపత్రుల్లో 238 మంది వైద్యులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరిని జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా ఒప్పంద పద్ధతిలో నియమించనుంది. పీజీ చేసిన స్పెషలిస్టు వైద్యులకు నెలకు రూ1.10 లక్షలు, ఎంబీబీఎస్ వైద్యులకు నెలకు రూ.61.960 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. నెల్లూరు , సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ఒక్కో జిల్లాకు 13 మంది చొప్పున, పోలవరం, కోనసీమ, ఏలూరు జిల్లాలకు 11 మంది చొప్పున పార్వతీపురం మన్యం, కృష్ణా ఎన్టీఆర్ , బాపట్ల తిరుపతి జల్లాలకు 10 మంది చొప్పు వైద్యుల ఖాళీలు భర్తీచేస్తారు. తూర్పుగోదావరి, ప్రకాశం, మార్కాపురం, కర్నూలు జిల్లాల్లో తొమ్మిది మంది చొప్పున, అల్లూరి సీతారామరాజు, చితూత్తరు అన్నమయ్య జిల్లాల్లో ఎనిమిది మంది చొప్పున అనకాపల్లి, పశ్చిమగోదావరి, పల్నాడు, నంద్యాల జిల్లాల్లో ఏడుగురు చొప్పున నియమిస్తారు. శ్రీకాకుళం, కాకినాడ, కడప జిల్లాల్లో ఆరుగురు చొప్పున, విజయనగరం జిల్లాల్లో ఐదుగురు , గుంటూరు జిల్లాల్లో నలుగురు విశాఖపట్నం జిల్లాలో ఒకరి చొప్పున నియమించాలని నిర్ణయించారు. సెకండరీ హెల్త్ సంచాలకులు కేవీఎన్ చక్రధరబాబుతో ఆసుపత్రుల్లో ఖాళీలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించారు. 148 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లను, 90 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లను సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ జిల్లా ఆసుపత్రుల్లో నియమించేందుకు మంత్రి ఆమోదం తెలిపారు.

చారాల దళితవాడలో యువతి ఆత్మహత్య

పోలీసుల వైఖరిపై మృతురాలి బంధువుల ధర్నా, రాస్తారోకో

తవణంపల్లె, మే 30 ప్రభాతవార్త: ప్రేమ విఫలమై యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం అరగొండ గ్రామ పంచాయతీలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలోని అరగొండ గ్రామపంచాయతీ చారాల దళితవాడకు చెందిన రమేష్ చిన్న కుమార్తె కె.కావ్య(18) అనే యువతి అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమిస్తోంది. అయితే తన ప్రేమను ఆ యువకుడు తిరస్కరించడంతో మనస్తాపంతో కావ్య శనివారం ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే బంధువులు అరగొండ అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. మృతురాలి బంధువుల ధర్నా రాస్తారోకో ప్రేమ విఫలమై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువతి సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించడంలో స్థానిక పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై మృతురాలి బంధువులు అరగొండ అపోలో ఆస్పత్రి ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆస్పత్రి వర్గాలు ఎంఎల్‌సి కేసుగా పరిగణిస్తూ తదుపరి చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఉదయం సమాచారం అందించడంతో పాటు జరిగిన సంఘటనపై మధ్యాహ్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. అయినప్పటికి పోలీసులు ఈసంఘటనపై సాయంత్రం 6 గంటల వరకు కేసు నమోదు చేయడం కానీ, మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించడం కాని చేపట్టపోవడంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ మృతురాలి బంధువులు ఆ స్పత్రి ఎదుట భైఠాయించి ధర్నా రాస్తారోకోకు పూనుకున్నారు.

ఎసిబి వలలో సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజినీర్ తెలుగు రమేష్

క్వాలిటి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ. 40 వేలు డిమాండ్

నగదు తీసుకుంటు అడ్డంగా దొరికిన ఎఇ

నందికొట్కూరు,మే 30,ప్రభాతవార్త: సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలుగు రమేష్ రూ. 40 వేలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కర్నూలు టెలికాం నగర్‌కు చెందిన జి.శ్రీరాములు సివిల్ కాంట్రాక్టర్ జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాలలో పాఠశాల భవనాల పనులకు సంభంధించిన బిల్లులు రూ.41.6

లక్షలు రావలసి ఉండడంతో ప్రక్రియలో భాగమైన క్వాలిటి కంట్రోల్ సర్టిఫికెట్ కోరగా ఏఈ రూ.40 డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. దీంతో కాంట్రాక్టర్ శనివారం ఏసిబి అధికారులకు సమాచారం ఇచ్చి బ్రాహ్మణకొట్కూరు సమీపంలోని నేషనల్ హైవేపై కారులో ఏఈ నగదు తీసుకుంటుండగా ఏసిబి డియస్పీ సోమన్న ఆధ్వర్యంలో దాడులు చేసి నగదు స్వాధీనం చేసుకొని ఎఈని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏసిబి సి.ఐ. కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

తుంగభద్ర నదిలో ఐదుగురు గల్లంతు

మంత్రాలయం, మే 30, ప్రభాతవార్త; మంత్రాలయంలో విషాదం చోటు చేసుకుంది. తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి ఐదు మంది శనివారం గల్లంతయ్యారు. ఇందులో ముగ్గురు పురుషులు కాగా, ఒక మహిళ, ఒక బాలుడు ఉన్నారు. వివరాల మేరకు మంత్రాలయం పట్టణానికి చెందిన శాంతప్ప ఆచారి ఇంటిలో నేడు ఆదిఆవరం సత్యనారాయణ వ్రతం నిర్వహించాలని కుటుంబ సభ్యులు తమ బంధువులను పిలిపించారు. ఇందులో వివిధ పట్టణాల నుంచి బంధువులు వచ్చారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన కంసాలి సతీష్ కుమారుడు కంసాలి యువన్‌చంద్ర(5), మంత్రాలయంకు చెందిన కంసాలి రాఘవేంద్ర(25), ఉరవకొండకు చెందిన రత్నమాచారి కుమార్తె సంధ్య(22), ఎమ్మిగనూరుకు చెందిన ధనుష్(22), కర్నూలుకు చెందిన సతీష్(35) ఆదోనికి చెందిన అపర్ణ మొత్తం ఆరు మంది స్నానానికి వెళ్లారు. అయితే ఇందులో యువన్‌చంద్ర అనే బాలుడు నీటిలో



మునిగిపోగా, బాలుడిని రక్షించడానికి వీరు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో అందరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. అదృష్టవశాత్తు అపర్ణ అనే బాలికను రక్షించారు. మిగిలిన ఐదు మంది గల్లంతయ్యారు. సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐలు మల్లికార్జున, విజయ్‌కుమార్, ఎర్రన్నల ఆధ్వర్యంలో అరగోళ్లు, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. టీడీపీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

జూన్ 10 లోపు విద్యుత్ సబ్సిడీ హామీ అమలు చేయాలి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం డిమాండ్

విజయవాడ, మే 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా జూన్ 10వ తేదీ లోపు యూనిట్ రూపాయిన్నరకే సబ్సిడీ విద్యుత్ హామీని అమలు చేయాలని, నాన్ ఆక్వా జోన్ రైతులు గత రెండేళ్లుగా చెల్లించిన బిల్లులు రీయింబర్ చేయాలని తాగేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అప్పడా మాజీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆక్వా రైతులతో కలసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా అందరికీ రూపాయిన్నరకే యూనిట్ విద్యుత్ అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు, రెండేళ్లుగా ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీడ్, ఫీడ్ ధరలు, ఎగుమతులు, అన్నీ అప్సడా నిర్ణయం మేరకు రైతులతో చర్చించి తీసుకునేవాళ్లమని కానీ కూటమి ప్రభుత్వం వచ3్చక ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ని నిర్వీర్యం చేసిన దళారుల చేతికి చంద్రబాబు పెత్తనం ఇచ్చాడని మండిపడ్డారు. ఫీడ్ ధరలు కూడా ఇష్టారాజ్యంగా పెంచితే ఊరుకోమని, రైతులతో చర్చించి ఏడాదికి ఒక్కసారే పెంచాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని త్వరలోనే ఆక్వా రైతులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహిస్తారని వడ్డి రఘురాం వెల్లడించారు.

విశాఖను అంతర్జాతీయ స్థాయిలో
పర్యాటకంగా అభివృద్ధి

వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్

విశాఖపట్నం-ప్రభాతవార్త

వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, విశాఖపట్నంను అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. ప్రకృతి రమణీయతకు మారు పేరైన విశాఖలో పర్యాటక ప్రదేశాలైన కైలాసగిరి, జూ పార్క్, కంభాలకొండ తదితర ప్రాంతాలను కలిపి, పర్యాటకంగా పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత వినోదాత్మక ప్రాంతంగా, విశాఖకు వచ్చే సందర్శకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బెంగుళూరుకి చెందిన ఇంటిగ్రేటెడ్ డిజైన్ సంస్థ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. విశాఖలో వైవిధ్యభరితమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి నివేదికను రూపొందించాలని ఆదేశించారు. ప్రధానంగా విశాఖకి దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను మెప్పించేలా అద్భుతమైన ఆకర్షణలు ఇక్కడ ఏర్పాటుచేసేలా చూడాలని, ముఖ్యముగా కైలాసగిరి, జూ పార్క్, కంభాలకొండ తదితర ప్రాంతాల్లో ఉండే వన్య ప్రాణుల సంరక్షణ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాల్లో ఉండే నైట్ సఫారీ సదుపాయం ఇక్కడ అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగ అధికారులతో సమన్వయం చేసుకొని, పూర్తి స్థాయి నివేదికను ఆగస్టు మాసాంతానికి సిద్ధం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సింగపూర్ కు చెందిన మాందాయ్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఇంటిగ్రేటెడ్ డిజైన్ సంస్థ ప్రతినిధులు మోహనరావు, రాహుల్ పాల్ తదితరులు తాము సర్వే చేసిన వివరాలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలతో కూడిన రిపోర్ట్ ను మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ తేజ్ భరత్‌కి అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ రాంబాబు, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ శిరీష పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా
దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు

- 3,532 రూట్ కిలోమీటర్ల పరిధితో కొత్త జోన్
- ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం, ప్రభాతవార్త

విశాఖపట్నం కేంద్రంగా 18వ జోన్ గా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ 1 నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించ నున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో మొత్తం 3,532 రూట్ కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ ఉండగా, డబుల్, ట్రిపుల్ లైన్లు తదితర ట్రాక్‌లతో కలిపి మొత్తం ట్రాక్ పొడవు 6,454 కిలోమీటర్లకు చేరుకుంటుందని తెలిపారు. జోన్ పరిధిలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు కలిపి నాలుగు డివిజన్లు, ఉంటాయని 385 రైల్వే స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నాలుగు డివిజన్లలో సుమారు 62 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా, జోన్ ప్రధాన కార్యాలయంలో 128 మంది గెజిటెడ్ అధికారులు, 1,100 మంది నాన్-గెజిటెడ్ సిబ్బంది పనిచేయనున్నారని తెలిపారు. ప్రతి ఏడాది సుమారు 100 మిలియన్ టన్నుల సరుకు రవాణా ఈ జోన్ పరిధిలో జరుగుతుందని, సరుకు మరియు ప్రయాణికుల రవాణా ద్వారా ఏటా సుమారు రూ.15,500 కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పారు. విశాఖపట్నం సమీపంలోని వడ్లపూడి రైల్వే వ్యాగన్ డిపోలో రోజుకు సగటున 250 నుండి 300 వ్యాగన్ల నిర్వహణ,తనిఖీ మరియు మరమ్మతు పనులు చేపట్టే సామర్థ్యం కలిగిన సంస్థ మన సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో ఉందన్నారు. 2019 ఫిబ్రవరి 17న విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అనంతరం కేంద్ర మంత్రివర్గం దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందని మాధవ్ గుర్తు చేశారు. జోన్ శాశ్వత ప్రధాన కార్యాలయ నిర్మాణానికి 2025 జనవరి 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలోని ముడసర్లోవలో శంకుస్థాపన చేశారని తెలిపారు. సుమారు రూ.183 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు అమలవుతోందన్నారు. ముడసర్లోవలో 52.2 ఎకరాల విస్తీర్ణంలో విశాఖ సముద్రతీరానికి ప్రతీకగా క్రూయిజ్ ఆకారంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన 12 అంతస్తుల ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. శాశ్వత భవనం పూర్తయ్యే వరకు వీఎంఆర్‌డీఏ ఐకానిక్ "ది డెక్" భవనం నుంచి తాత్కాలికంగా జోన్ కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న విశాఖపట్నం (పాత వాల్తేర్ డివిజన్ పునర్వ్యవస్థీకరణ తో ఏర్పడినది), విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో భాగమవుతాయని పేర్కొన్నారు. ఈ జోన్ ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కొంత భాగాన్ని కూడా కలుపుకుంటుందని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాల ప్రారంభంతో రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం అవుతాయని, కొత్త రైళ్ల మంజూరు, స్టేషన్లు మరియు ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు ఇది దోహదపడుతుందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అలాగే పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్య కార్యకలాపాలు, పెట్టుబడులు మరియు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని మాధవ్ పేర్కొన్నారు.

మెగా డీఎస్సీపై వైకాపా అసంబద్ధ ఆరోపణలు

శాసనమండలి ప్రభుత్వ డా.వేపాడ చిరంజీవిరావు ధ్వజం

9లో

పక్కా ప్రణాళిక.. సరైన వ్యూహంతోనే..
విశాఖకు ఉజ్వల భవిష్యత్తు

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ శ్రీభరత్ -పలు ప్రజా సమస్యలపై సూచనలు చేసిన ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా, విష్ణుకుమార్ రాజు, వంశీ -అజెండా అంశాలను వివరించటంతో పాటు, అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

విశాఖపట్టణం, మే 30, ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అధికార యంత్రాంగం సమష్టి కృషి, సమన్వయంతో, సరైన వ్యూహంతోనే విశాఖకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. నగరాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన తాగునీటి వ్యవస్థ, సమర్థవంతమైన మురుగునీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణతో కూడిన ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాల్సి ఉందని ఉద్ఘాటించారు. తాగునీటి, మౌలిక వసతుల ప్రాజెక్టుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, తీరప్రాంత కాలుష్య నివారణ చర్యలు, అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ, తాగునీటి ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన పలు అంశాలపై సమీక్షించి.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా ముందుగా ఆయన జీవీఎంసీకి అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50 వేల కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద విశాఖపట్నానికి రూ.1,500 కోట్ల విలువైన మూడు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మంజూరవ్వటం సంతోషకరమని, ఈ అంశంలో జీవీఎంసీ పోషించిన పాత్ర అభినందనీయమని అన్నారు. ఈ క్రమంలో మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల అమల్లో అధికార యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలని, ఫలాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జలధార-జలహారతి పనులు ద్వారా తాగునీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు అందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉల్లాస్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో అక్షరాస్యత పెంచాలని, పీఎంఈజీపీ ద్వారా మరిన్ని యూనిట్లు నెలకొల్పాలని, నైపుణ్య శిక్షణలు అందించాలని, మెరుగైన ఉపాధి కల్పించాలన్నారు. నూతన లేబర్ కోడ్ లపై వాణిజ్య కార్యకాలాపాలు నిర్వహించే యాజమాన్యాలతో ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా శిబిరాల్లో తనతో పాటు, జిల్లా కలెక్టర్ కూడా భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు. గృహ సంబంధిత పథకాల అమల్లో పారదర్శకత పాటించాలని, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. గ్రామీణ 8వ పేజీలో

పరిసరాలను పరిశుభ్రంగా వుంచాల్సిన బాధ్యత
ప్రతి ఒక్కరిపై వుంది..

పట్టణంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, మే 30, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత కార్యక్రమం మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు పాల్గొన్నారు. పట్టణంలో నీ ఫైర్ ఆఫీస్ కాలనీ నుంచి శేషు గెడ్డ, త్రిమూర్తులు స్వామి గుడి వరకు అందరి సభ్యుల సహకారంతో చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించు శ్రమదానం చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పట్ల పర్యావరణ పట్ల బాధ్యతగా ఉండాలని చెత్తను రోడ్లపై వేయకుండా తమ వంతు బాధ్యతగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలవలో పూడికతీత పనులను పరివేక్షించి వ్యాపారస్తులు శానిటేషన్ కూడికతీత పనులకు అడ్డంకి లేకుండా కాలువపై పలకలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వ్యాపారస్తులకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది కాలువ పూడిక తీత పై ఎప్పటికప్పుడు పరివేక్షించాలని ఆదేశించారు. శేషు గడ్డ వద్ద పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమం నిర్వహించితుండగా అక్కడే సచివాలయ ఉద్యోగస్తులు ఒక దగ్గరే ఉండడంతో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చారా చూడడానికి వచ్చారా అంటూ కమిషనర్ను ప్రశ్నించారు. మున్సిపాలిటీలోని 13 సచివాలయాల ఉద్యోగస్తులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణములో మున్సిపల్ శానిటేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలువ పూడిక తీత కార్యక్రమాన్ని 8వ పేజీలో

పొగాకు రహిత సమాజ నిర్మాణానికి..
ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

డా. వెలగపూడి ఉమామహేశ్వరరావు

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నేడు

పక్కా ప్రణాళిక.. సరైన వ్యూహంతోనే..

7వ పేజీ తరువాయి ..

మండలాల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యవసాయ రంగ బలోపేతానికి కృషి చేయాలని, రైతులు పండించే పండలకు మంచి మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల అమలు విషయంలో అన్ని వర్గాల వారినీ దృష్టిలో పెటు ్టకోవాలని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యాశాఖలో ఉత్తమ విధా నాలు అమలు చేయాలని, కేజీబీవీలంటే విజయానికి చిరునామా అని.. అదే నమ్మకాన్ని నిలబెడుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఆ దిశగా అధికారులు పని చేయాలని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో అమృత్ 2.0లో చేపట్టే ప్రాజెక్టులను సత్వరమే ప్రారంభించాలని, సాంకేతిక అంశాలను పూర్తి చేసి ముందుకు సాగాలని పేర్కొన్నారు. విశాలమైన మైదానాలు, భవనాలు ఉన్న ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ పాఠశాలను గుర్తించాలని, వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా నివేదికలు సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

చికెన్... మటన్ నాణ్యతను తనిఖీ చేసి గ్రేడింగ్ ఇవ్వాలి

నగర పరిధిలో క్రయ విక్రయాలు జరిగే చికెన్.. మటన్ నాణ్యతపై అధికారుల దృష్టి సారించాలని ఎంపీ చెప్పారు. ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలు చేయించాలని, అక్కడ పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాల ఆధా రంగా గ్రేడింగ్ ఇవ్వాలని సూచించారు. తగిన మోతాదులో శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించాలని చెప్పారు. ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

ప్రధాన అంశాలపై దృష్టి సారించి.. ఆశాజనక ఫలితాలు సాధించాలి : జిల్లా కలెక్టర్

కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ సూచించారు. ప్రధాన అంశాలపై దృష్టి సారించి, ఆశాజనక రీతిలో ఫలితాలు సాధించాలని నిర్దేశిం చారు. ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో భాగంగా ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్ణీత సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అచ్చెన్నాయుడు లోవ ప్రత్యేక వసతులు కల్పించాలి : విప్ గణబాబు

అచ్చెన్నాయుడు లోవ వద్ద టిడ్కో ఇళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, త్వరలోనే ఇక్కడొక కొత్త నివాస సముదాయం అందుబాటులోకి వస్తుందని, కావున అధికారులు స్పందించి ముందుగానే కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. ప్రజల అవసరార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. యూజీడీ, 24 గంటల పాలు స్వచ్ఛమైన తాగునీరు అందించే విషయంలో జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉందని పేర్కొన్నారు. భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటు పనులు జరిగే క్రమంలో గుంతలను వేగండా పూడ్చటం లేదని, దానివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. పనులు అయిన వెంటనే గుంతలను పూడ్చాలని సూచించారు.

టిడ్కో, రాజీవ్ గృహకల్పలో ఖాళీ ఇళ్లను అర్హులకు పునఃకేటాయించాలి : ఎమ్మెల్యే పల్లా

టిడ్కో, రాజీవ్ గృహకల్ప పథకాల కింద కేటాయించిన అనేక ఇళ్లలో లబ్ధిదారులు ఇప్పటికీ నివాసం ఉండడం లేదని.. 17 నుంచి 18 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా వినియోగంలో లేని ఇళ్ల కేటాయింపులను సమీక్షించి, అవసరమైతే రద్దు చేసి అర్హులైన పేద కుటుంబాలకు పునఃకేటాయించాలని అధికారులను కోరారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాజా స్థితిపై పరిశీలించి నివేదిక అందించాలని, సాంకేతిక అంశాలను పరిశీలించాలని అక్కడే ఉన్న హౌసింగ్, యూసీడీ అధికారులను ఆదేశించారు.

డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు అప్పగించాలి : ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

టిడ్కో ఇళ్ల కోసం డీడీల రూపంలో నగదు చెల్లించి, బ్యాంకు రుణాల ఈఎంఐలు కూడా చెల్లిస్తున్న లబ్ధిదారులకు ఇప్పటికీ ఇళ్లు అందకపోవడం బాధాకరమని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భారం, రుణాల వాయిదాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. డీడీలు చెల్లించిన అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లను కేటాయించి, పెండింగ్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను కోరారు. టిడ్కో ఇళ్ల పంపిణీపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, లబ్ధిదారులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా వుంచాల్సిన బాధ్యత

7వ పేజీ తరువాయి ..

పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసాద్ రాజు, శానిటేషన్ అధికారి పల్లా శ్రీనివాసరావు ను కాలువ పూడికతీత పనులు పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. స్వయంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కాలువ పుడికతీత వద్ద ఎంతవరకు నిర్వహించారు పరిశీలించి, పనులను పరివేక్షించే పద్ధతే ఇదేనా అంటూ అధికారులను ప్రశ్నించారు. అనంతరం రోడ్డు ఇరువైపులా ఉన్న షాపు యజమానులతో సమావేశం ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ గోపి,జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, పిట్టా శ్రీనివాసరావు, కర్రీ ఘూన్సీ,తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, లాలం సోమినాయుడు, చిట్టిబాబు, బిజెపి నాయకులు ఆడారి చిన్న, సుందరపు బాబ్జి,సీఎంఎం పద్మావతి, మున్సిపల్ మేనేజర్ కే విజయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, వాకర్స్ క్లబ్ సభ్యులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణానికి..

విశాఖపట్నం, మే 30, ప్రభాతవార్త :

పొగాకు వాడకం వల్ల కలిగే ప్రాణాంతక ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు కేవలం ధూమపానం రూపంలోనే కాకుండా గుట్కా, ఖైనీ వంటి నమిలే రూపాల్లో కూడా తీవ్రమైన ఆరోగ్య నష్టాలను కలిగిస్తుందని పేర్కొన్నారు. గుండెజబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులు, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి అనేక ప్రాణాంతక వ్యాధులకు పొగాకు ప్రధాన కారణమని చెప్పారు. పరోక్ష ధూమపానం వల్ల ధూమపానం చేయని వ్యక్తులు, ముఖ్యంగా చిన్నారులు మరియు గర్భిణీలు కూడా ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు సాగు మరియు ఉత్పత్తి ప్రక్రియలు పర్యావరణానికి కూడా తీవ్ర హానిని కలిగిస్తున్నాయని తెలిపారు. పొగాకు ఆకులను ఎండబెట్టేందుకు పెద్ద ఎత్తున అడవుల నరికివేత జరుగుతోందని, అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూసారం క్షీణించి భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని వివరించారు. సారవంతమైన భూముల్లో పొగాకు పంటలకు బదులుగా ఆహార పంటలను ప్రోత్సహించడం ద్వారా ఆహార భద్రతను మెరుగుపరచవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు పొగాకు ఉత్పత్తులను పూర్తిగా దూరం పెట్టాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పొగాకు వ్యసనానికి బానిసలైన వారికి వైద్య సహాయం అందేలా ప్రోత్సహించాలని కోరారు.

పొగాకు రహిత సమాజం -మన లక్ష్యం. ఆరోగ్యమే మహాభాగ్యం

పొగాకు ఉత్పత్తులను ఉపయోగించకుండా, ఇతరులను కూడా వాటి దుష్ప్రభావాల గురించి చైతన్య పరుస్తూ, ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేద్దామని డా. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలి

దిశ సమావేశంలో ఎమ్మెల్యే బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం, మే 30,ప్రభాతవార్త

టిడ్కో ఇళ్ల కోసం లక్షల రూపాయలు డీడీల రూపంలో చెల్లించి, బ్యాంకు రుణాల ఈఎంఐలు సైతం భరిస్తున్న లబ్ధిదారులకు ఇప్పటికీ ఇళ్లను కేటాయించకపోవడం అన్యాయమని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీ పి. విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన దిశ (డిఐఎస్ హెచ్ఏ) సమావేశంలో ఆయన ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని అనేక మంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం అన్ని అర్హతలు పూర్తి చేసి డీడీలు చెల్లించినప్పటికీ, సంవత్సరాలుగా ఇళ్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు ఒకవైపు అద్దె భారం, మరోవైపు బ్యాంకు రుణాల ఈఎంఐలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. డీడీలు చెల్లించిన అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లను కేటాయించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను కోరారు. టిడ్కో ఇళ్ల పంపిణీపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, లబ్ధిదారులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సూచించారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్ ,జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఎమ్మెల్యే గణ బాబు , ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

"సత్యాజీ మా బడా సాబ్"

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

విశాఖపట్నం -ప్రభాత వార్త



"సత్యాజీ.. మా బడా సాబ్" అంటూ కేంద్ర వస్త్ర, జౌళి శాఖ మంత్రిగిరిరాజ్ సింగ్ ఆప్యా యంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ను పలకరించారు. ఇందుకు విశాఖ విమానాశ్ర యం శనివారం వేదికగా నిలిచింది. సత్యకుమార్ యాదవ్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని పంచుకుంటూ, ఆప్యాయంగా "సత్యాజీ బడా సాబ్", "సత్యాజీ మా నాయకుడు" అంటూ గతంలో వారి ఇరువురు కలిసి పనిచేసిన సందర్భాలను కేంద్ర మంత్రి గుర్తు చేసుకున్నారు.

కేంద్ర మంత్రికి సత్యకుమార్ కృతజ్ఞతలు

దేశంలో మంజూరైన ఏకైక మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గానికి మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కి మంత్రి సత్యకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే హ్యాండ్లూమ్ రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమం, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపైఎయిర్ పోర్ట్ లాంజ్‌లో చర్చించారు. మరోవంక భారతీయ జనతా పార్టీ జాతీయ సహ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) శివప్రకాశ్ జీని కూడా మంత్రి సత్యకుమార్ కలుసుకున్నారు.

విశాఖ సెంట్రల్ జైల్‌ను సందర్శించిన జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ, మే30, ప్రభాతవార్త

విశాఖ జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసి నాయుడు కేంద్ర కారాగారాన్ని శనివారం అధికారికంగా సందర్శించారు. ముందుగా విద్యా పాఠ్యాంశంలో భాగంగా కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఎన్‌బీఎం న్యాయ కళాశాల విద్యార్థుల తో కార్యదర్శి సమావేశమయ్యారు. విద్యార్థులకు భారత న్యాయ వ్యవస్థ, వివిధ చట్టాలు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవల సంస్థల పాత్ర, ప్రజలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. న్యాయ విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి న్యాయ సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం ఆయన కారాగారంలోని అన్ని బ్యారక్‌లను సందర్శించి రిమాండ్ ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడారు.వారికి న్యాయ సంబంధిత సమస్యలు, అవసరాలు తెలుసుకొని జిల్లా న్యాయ సేవల సంస్థ ద్వారా అందించబడుతున్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు,ఇతర సేవల గురించి వివరించారు. అవసరమైన ఖైదీలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తదుపరి కారాగార సాధారణ వంటశాలలను సందర్శించి ఖైదీలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆహార నమూనాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.కారాగార ప్రాంగణంలోని పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ ఖైదీల సంక్షేమ చర్యలను ఆయన సమీక్షించారు.ఈ కార్యక్రమంలో జైల్ పర్యవేక్షణాధికారి ఎం. మహేష్ బాబు, ఉప పర్యవేక్షణాధికారి సూర్య కుమార్, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత గండి బాబ్జీ అక్రమాలు!

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా రైత్వారీ పట్టాలు-22-ఏ భూముల్లో అక్రమాల్ని నిరోధించాంటూ ప్రజా సంఘాల డిమాండ్ -సర్వే నంబర్ 107/11లో 8.8 ఎకరాల అక్రమణల్ని అడ్డుకోవాంటూ పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

విశాఖపట్నం, మే 29, ప్రభాతవార్త

పెందుర్తి మండలం దగ్గువానిపాలెం, రెడ్డివారి కల్లాల్లోని భూముల్ని కొంతమంది ఆక్రమించే పనిలో ఉన్నారు. సర్వే నంబర్ 107/11లోని 8.8 కరాల ప్రభుత్వ భూముల్లో దురాక్రమణకు సాగిస్తున్న టీడీపీ నేత గండి బాబ్జి అక్రమాల్ని అడ్డుకోవాలని ప్రజా సంఘాలు నినదించాయి. ఈ మేరకు శుక్రవారం పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాయి. ధర్నాలో ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ ఆయా భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న 21 పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మిగులు భూమిని కూటమి ప్రభుత్వ హామీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని కోరారు. ప్రభుత్వ భూమిగా తేల్చినా సదరు భూమిపై తమకు హక్కులున్నట్లుగా గండి బాబ్జి, ఎంవీవీ బిల్డర్స్, అప్పలనాయుడు వంటి వ్యక్తులు కొన్నాళ్లగా వ్యాజ్యాలు నడిపినా, వారికి అను కూలంగా రిపోర్టు రాలేదన్నారు. అదే సందర్భంలో అనేక దఫాలుగా దురాక్రమించడానికి వారంతా ప్రయ త్నించారని ఆరోపించారు. తాజాగా గండి బాబ్జి తదితరులు, పది రోజులుగా సర్వే నంబర్ 107/11లోని ప్రభుత్వ భూమిని దురాక్రమించడానికి ట్రాక్టర్లు, బుల్డోజర్లను ఉపయోగించి పెద్ద ఎత్తున ఆ భూమిని చదును చేసి రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. అదే విషయమై పెందుర్తి తహసీల్దార్, ఆర్డీవోకు ఫిర్యాదిచ్చారని పేర్కొన్నారురు. అయినా గండి బాబ్జి తన దురాక్రమణ చర్యలు ఆపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దురాక్రమణ తహసీల్దార్ను చక్కని ఎం తదితరులే ధశ్యాక్ పట్టా పొంది ఉన్నారని బాబ్జి పట్టా చెప్పడం బాధాకరమన్నారు. 22-ఏ ప్రభుత్వ భూముల నిషేధిత జాబితాలో ఉన్నవాటిని తొలగించమని కోరుతూ గండి బాబ్జి, ఆయన అనుచరుల తరపున తప్పుడు పద్ధతిలో కాజేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఆ చర్యల్ని నిరోధించి, ప్రభుత్వ భూమిగా బోర్డులేర్పాటు చేసి నివాసితులకు క్రమబద్ధీకరణలో భాగంగా పట్టాలు మంజూరు చేయాలన్నారు.

అధికారులపై కేసులు నమోదు చేయాలి

అవినీతికి పాల్పడి రైత్వారీ పట్టా మంజూరు చేసిన అధికారులపై కేసులు నమోదు చేసి, విచారించి బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.లక్ష్మి, ఐయఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె. నిర్మల, ఏపీఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవా, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకట లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఇందిర, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కో-కన్వీనర్ టి.రూప, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. ఏడుకొండలు, బి.రామకృష్ణ, మరిడిమాంబ కాలనీ నివాసితుల సేవా సంక్షేమ సంఘం నాయకులు కె.నాగేశ్వరరావు, దేముడమ్మ పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవించుదాం

విత్తన బంతులతో శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి - డ్రోన్ లతో చల్లేందుకు విత్తనాల గోళీలు తయారు చేయాలి సంకల్ప కళా గ్రామం ఒక పర్యాటక ప్రదేశం -జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ

విశాఖపట్నం మే 30,ప్రభాతవార్త



పర్యావరణ హితంగా జీవించుదాం అని ఎస్ఒఎస్ విద్యార్థులకు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం పెందుర్తి మండలం పెద్ద గాడి దగ్గర ఉన్న సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు నేతృత్వంలో భీమిలి ఎస్ ఒ ఎస్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ముందుగా డ్రోన్ లతో విత్తనాల గోళీలు జల్లించేందుకు విద్యార్థులు తో ఆరు మిల్లీ మీటర్ల సైజ్ లో విత్తనాల గోళీలు, బంతులు తయారు చేయించారు. అనంతరం రత్నం మాట్లాడుతూ విత్తన గోళీలు, బంతులు తయారు చేసి, కొండల మీద, తీరంలో చల్లాలని, తద్వారా శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలని కోరారు. డ్రోన్ లతో చల్లెర్గుదుకు ఆరు మిల్లీ మీటర్ల పరిమాణం లో విత్తనాల గోళీలు తయారు చేయడం ఆనందంగా ఉంది అని పేర్కొన్నారు. సంకల్ప కళా గ్రామం ఒక పర్యాటక ప్రదేశం అని వివరించారు. ఈ గ్రామం మరింత విస్తృతంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల చలపతిరావు మాట్లాడుతూ ఎద్దు గానుగ తో తయారు చేసిన నూనెలు ఆరోగ్యకరమైనవనిగా వివరించారు. అంతే కాకుండా తమ వద్ద కొయ్య బొమ్మలు, ప్రకృతి ఆధారంగా వేసిన రంగులతో నేసిన బట్టలు తయారు అవుతాయి అని వివరించారు.అలాగే ప్రకృతి ఆధారంగా పండించిన పంటలు లభ్యమవుతాయి అని అన్నారు. సంస్థ ప్రతినిధి జమీలియా మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ప్రకృతి తో మమేకమై జీవించాలని కోరారు. మనం ఆరగించిన పండ్ల విత్తనాలు దాచి విత్తనాల బంతులు, గోళీలు తయారు చేయడం అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, ఎస్ చెస్ భీమిలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను కంటతడి పెట్టించిన 'చెరిగిపోని చిరునామా'

జాతీయ స్థాయి నాటికల పోటీల్లో హర్ష క్రియేషన్స్‌కు ఘన విజయం

(విశాఖపట్నం - ప్రభాతవార్త)

నటరత్న ఎన్టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో సాతులూరులో నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీల్లో విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్స్ ప్రదర్శించిన "చెరిగిపోని చిరునామా" నాటిక ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ఈ నాటికలో నటీనటుల భావోద్వేగ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ నాటికలో ప్రధాన పాత్ర పోషించిన అమృత వర్షిణి ఉత్తమ నటిగా, కత్తి శ్యాం ప్రసాద్ ఉత్తమ నటుడిగా, భాగ్యరాజ్ ఉత్తమ ప్రతినాయకుడిగా బహుమతులు అందుకున్నారు. నాటిక ముగిసే సమయానికి ప్రేక్షకులు భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టడం విశేషం. విశాఖపట్నంనికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది పి.టి. మాధవ్ రచించిన ఈ నాటిక ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబ జీవన గాథను ఆవిష్కరించింది. జీవితంలో ఒక్కసారైనా ఇంటికి ఏసీ పెట్టుకోవాలని ఆశపడే ఓ ఇల్లాలి కోరిక, ఆర్థిక ఇబ్బందులతో వాయిదా పడుతూనే ఉంటుంది. కాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమెకు మందుల వేడి తట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. చివరికి ఆమె కోరిక తీరకుండానే కన్నుమూస్తుంది.ఆమె మరణానంతరం భర్త తన భార్యను ఫ్రీజర్ బాక్సులో ఉంచి, "జీవితంలో ఒక్క కోరిక తీర్చలేకపోయాను... ఇప్పుడు ఈ చల్లదనం అయినా ఆమెకు తగులుతుందో లేదో తెలియదు" అంటూ కుమారుడితో చెప్పే సన్నివేశం ప్రేక్షకులను తీవ్రంగా కదిలించింది.తల్లిదండ్రులు బ్రతికుండగానే వారి కోరికలు తీర్చాలని, వారి ప్రేమే "చెరిగిపోని చిరునామా" అనే సందేశాన్ని నాటిక హృద్యంగా తెలియజేసింది. భార్యాభర్తల అనుబంధం, తల్లిదండ్రుల మమకారం, ఆధునిక కుటుంబ సంబంధాల వైఖరిని ఆలోచింపజేసే విధంగా రచయిత కథను మలిచారు.ఇదే కథ ఆధారంగా రూపొందిన "ఆమె కథ" ప్రస్తుతం ఈటీవీ విన్‌లో కథాసుధ కార్యక్రమంలో ప్రసారం అవుతోంది. ప్రముఖ నటి ఆమని ప్రధాన పాత్రలో నటించిన ఈ కథ ప్రేక్షకులతో పాటు ప్రముఖుల ప్రశంసలు కూడా అందుకుంటోంది.

ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో స్వచ్ఛ విశాఖను నిర్మిద్దాం..

నగర పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి-దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్

విశాఖపట్నం, మే 30, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా స్వచ్ఛమైన విశాఖ నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం లో భాగంగా రెండవ వారం అనగా మే 29 నుండి జూన్ 4 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన దక్షిణ నియోజకవర్గంలోని 38వ వార్డు బుక్కా వీధిలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి.నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.నాగలక్ష్మి లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల మంచి ఆలోచనతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ఒక రాష్ట్రం- ఒక పరిశుభ్రత లక్ష్యంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా దక్షిణ నియోజకవర్గంలోని మురికివాడ ప్రాంతమైన 38వ వార్డు బుక్కా వీధిలో స్టార్మ్ వాటర్ డ్రైన్లు, నాలాలు, బ్యాక్‌లేన్ల పరిశుభ్రత పనులను రెండో వారంలో చేపట్టినట్లు పేర్కొన్నారు. కేవలం మున్సిపల్ సిబ్బంది కృషితోనే ఈ కార్యక్రమం విజయవంతం కాదని, ప్రజల సహకారం అత్యంత అవసరమని శాసనసభ్యులు స్పష్టం చేశారు. విశాఖపట్నం రాష్ట్రానికి తలమానికమైన నగరమని, స్వచ్ఛ సర్వేక్షణలో విశాఖ మొదటి ర్యాంకు సాధించేలా ప్రతి పౌరుడు బాధ్యతతో కృషి చేయాలన్నారు. నిత్యం ఇంటిలో వ్యర్థాలను నాలుగు రంగుల డస్ట్ బిన్లలో విభజించి జీవీఎంసీ సిబ్బందికి అందించాలన్నారు. వారానికి ఒక రోజు పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా నగరాన్ని మరింత అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చన్నారు. కాలువలు, నాళాలు శుభ్రపరచడం ద్వారా రానున్న వర్షాకాలంలో డ్రైన్లు పొంగిపొర్లకుండా, వర్షపు నీరుతో పాటు మురుగునీరు సాఫీగా ప్రవహించే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా దోమలు వృద్ధిని అరికడుతూ పరిశుభ్రతను మెరుగుపరుచుకోవచ్చునన్నారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విశాఖ నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ప్రతి వార్డులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచడం, వర్షాకాలంలో నీటి నిల్వలు, డ్రైనేజీ అడ్డంకులు ,దోమల వ్యాప్తిని నివారించడం లక్ష్యంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా రెండవ వారానికి సంబంధించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. మే 30 నుండి జూన్ 4, 2026 వరకు వార్డు స్థాయిలో వర్షపు నీటి కాలువలు (స్టార్మ్ వాటర్ (డ్రెయిన్లు), నాలాలు మరియు వెనుక సందుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం, సహకారం అత్యంత అవసరమని అదనపు కమిషనర్ అన్నారు. అనంతరం అందరూ కలిసి 38వ వార్డులో ప్రజల అవగాహన కోసం ఏర్పాటు చేసిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, దోమల నివారణ, నాలుగు బిన్‌ల వినియోగ విధానం తదితర అంశాలపై ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్‌ను సందర్శించి , ఆ ప్రాంతంలో కాలువలను శుభ్రపరిచి అందరికీ స్ఫూర్తిని కలిగించారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ శానిటేషన్, హెల్త్ సెక్రటరీలు, ఇతర అధికారులు, మాజీ కార్పొరేటర్ బి. ఉమామహేశ్వరరావు, గోడే నరసింహాచారి.సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 14 మంది ఉద్యోగులకు ఘన వీడ్కోలు

ఉద్యోగ విరమణ అనంతర జీవితం ఆనందంగా గడపాలి: అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి

విశాఖపట్నం, మే 30, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ)లో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన 14 మంది ఉద్యోగులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి మాట్లాడుతూ, ఉద్యోగ జీవితంలో సంస్థ అభివృద్ధికి విశేష సేవలందించిన ప్రతి ఉద్యోగి పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. జీవీఎంసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.పద్మజతో కలిసి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులకు పూలమాలలు వేసి, నూతన వస్త్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి తన కుటుంబంతో గడిపిన సమయం కంటే ఎక్కువ కాలం సంస్థ కోసం కష్టపడి పనిచేస్తారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న వారిలో అసిస్టెంట్ ప్లానర్ కె. వెంకటరావు, ఫార్మాసిస్ట్ కె.సత్యవేణి, ఒక మజ్దూర్, ముగ్గురు పీహెచ్ వర్కర్లు, ఒక డ్రైవర్, ఆరుగురు ఎంటీఎస్ ఉద్యోగులు, ఒక ఫిట్టర్ హెల్పర్ ఉన్నారని తెలిపారు. జీవీఎంసీ అభివృద్ధిలో వీరందరూ ఎనలేని సేవలు అందించారని కొనియాడిన ఆయన, పదవీ విరమణ అనంతరం కూడా ఏదో ఒక వ్యాపకంతో సంతోషంగా జీవించాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు మొత్తం రూ.97.80 లక్షల ప్రావిడెంట్ ఫండ్ మొత్తాన్ని అందజేశారు. అలాగే వారిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జెమ్స్ అసోసియేషన్ ప్రతినిధి సన్నీ, పర్యవేక్షకులు పైడిరాజు, గణేష్, జెమ్స్ యూనియన్ నాయకులు, జీవీఎంసీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KHANDAVALLI RAJESWARI W/O DIDDE VEERA VENKATA PRASAD previously called DIDDE RAJESWARI R/O 11-102, CHILAKARATNAM CHERUVU, PODURU, PENUMADAM, WEST GODAVARI, now changed my name from DIDDE RAJESWARI to KHANDAVALLI RAJESWARI. Hence forth I will be called as KHANDAVALLI RAJESWARI for all purposes.

(Ro.No.8556)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ఎఎంసీ ఎడి బాషిత్‌కు ఘన సన్మానం

విశాఖపట్నం, మే 30,ప్రభాతవార్త

ఉద్యోగి తన విధినిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగ విరమణ అనంతరం తగిన గుర్తింపునిస్తాయని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎన్ సంధ్యాదేవి అన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న షేక్ భాషిత్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సంధ్యాదేవి మాట్లాడుతూ ఆసుపత్రి పరిపాలన పరమైన విషయాల్లో మంచి సూచనలు, సలహాలను అందిస్తూ కళాశాల ప్రగతికి విశేషంగా కృషి చేశారన్నారు. విమ్స్ డైరెక్టర్ డా.కె.రాంబాబు మాట్లాడుతూ మూడేళ్ల పాటు విమ్స్ ఆసుపత్రిలో పరిపాలనాధికారిగా సేవలందించి చాలా పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు, అక్కడి ఉద్యోగులకు ప్రభుత్వ జీవోలు, ఇతర పరిపాలన అంశాలపై ఎంతో నేర్పించారన్నారు. అలాగే రీజనల్ ట్రైనింగ్ సెంటర్(ఫిమేల్)లో ఏవోగా పనిచేసిన సమయంలో శిథిలావస్థలో ఉన్న భవనాలను మరమ్మత్తులు చేయించడంతో పాటు, విద్యార్థులకు వసతి, నీటి కష్టాలు లేకుండా ఎంతో కృషి చేశారన్నారు. ఆర్టీసీ(ఎఫ్) కార్యాలయ ఉద్యోగులతో పాటు, కేజీహెచ్, ఎఎంసీ, విమ్స్ ఉద్యోగులు ఆయన ఉద్యోగులకు అందించిన సేవలను ప్రశంసిస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ. ఎడి బిఎస్ సుమతి, రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత, విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్. శ్రీనివాస్ కుమార్, సింహచలం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమారెడ్డి, చీఫ్ డైటిషియన్ రమణమూర్తి, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.రవిశంకర్. విమ్స్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ మనోజ్, కుటుంబ సభ్యులు షాపియా ఖానూన్, అబ్దుల్ హమీద్, అబ్దుల్ అజీజ్, రాషీద్ పాటు ఎఎంసీ, కేజీహెచ్ పరిపాలన విభాగం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాషిత్ దంపతులను పలువురు ఉద్యోగులు, ముస్లిం నాయకులు ఘనంగా సత్కరించారు.

మహానాడు సక్సెస్‌తో వైకాపాలో వణుకు

నవ్యాంధ్రను 'స్వర్ణాంధ్ర'గా మార్చడమే కూటమి లక్ష్యం -గొడ్డలి పార్టీకి రాజకీయ అర్హత లేదు -రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధ్వజం -గాజువాకలో ఘనంగా క్లస్టర్ మహానాడు కార్యకర్తల అభినందన సభ

గాజువాక, మే 30,ప్రభాతవార్త

గాజువాకలో నిర్వహించిన క్లస్టర్ స్థాయి మహానాడుకు లభించిన అపూర్వ స్పందన చూసి వైకాపా నాయకుల గుండెల్లో గుబులు మొదలైందని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం గాజువాక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమ న్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన కీలక సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. క్లస్టర్ మహానాడును విజయ వంతం చేసి, రాష్ట్ర స్థాయిలో గాజువాక ప్రతిష్టను పెంచిన పార్టీ శ్రేణులను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గత జగన్మోహన్ రెడ్డి పాలనలో దగాపడిన నవ్యాంధ్రప్రదేశ్‌ను తిరిగి 'స్వర్ణాంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దడమే ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. గొడ్డలి సంస్కృతిని నమ్ముకున్న వైకాపాకు రాజకీయాల్లో కొనసాగే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. మహిళల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ శ్వాస అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ మహానాడులో అనేక కీలక తీర్మానాలు చేశామని.. రాబోయే రోజుల్లో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధిని చూసి వైకాపా నేతలకు నిద్ర కూడా పట్టదని ఎద్దేవా చేశారు.

తరలివచ్చిన శ్రేణులు..

ఈ సమీక్షా సమావేశంలో మాజీ కార్పొరేటర్లు బొండా జగన్, రాజన్న రామారావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సర్వసుదనంతలక్ష్మి, రాష్ట్ర డైరెక్టర్లు మల్లి పెంట్రాజు, గుర్రం నూకరాజు, తమ్మిన విజయ్ కుమార్, కనకమాలక్ష్మి ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ కాకి స్వరూప రాణి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపుడి రాంబాయి, జోనల్ పరిశీలకుడు పులి వెంకటరమణారెడ్డి, వివిధ వార్డుల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జ్లు, ప్రధాన కార్యదర్శులు, పరిశీలకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

బీజేపీ జాతీయ నాయకులు శివప్రకాశ్ -కూర్మన్నపాలెంలో ఘనంగా ప్రారంభమైన ప్రశిక్షణా తరగతులు -హాజరైన మంత్రి సత్యకుమార్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

గాజువాక,మే 30,ప్రభాతవార్త

బీజేపీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆ పార్టీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెంలోని దామా కన్వెన్షన్‌లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణా మహా అభియాన్ తరగతులను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి మూడేళ్లకోసారి ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు, బూత్ నిర్వహణ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సోషల్ మీడియా వినియోగంపై కార్యకర్తలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా ఎదుగుతోందని, ప్రజలంతా ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్,రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, దామా సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ అభయ ఆంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు

ముఖ్య అతిథులుగా వెలగపూడి ప్రతాపరుద్ర, బుడుమూరి గోవింద్

ఆరిలోవ, మే 30, ప్రభాతవార్త

స్థానిక తొమ్మిదో వార్డ్ హనుమంతువాక గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, క్షేత్రపాలకుడు కోరిన కోర్కెలు తీర్చే దైవం శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగింది. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించారు. దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం చల్లని మజ్జిగ, ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా పార్టీ యువనేత వెలగపూడి ప్రతాపరుద్ర, వార్డు ఇంచార్జ్ బుడుమూరి గోవింద్ హాజరయ్యారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమం వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డ్ ప్రధాన కార్యదర్శి బాదరు బాలరాజు, 12వ వార్డ్ కార్యదర్శి పొతిన భరత్, పార్టీ సీనియర్ నాయకులు అబద్ధం తోపాటు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

గంటా చొరవతో రేవళ్లపాలెం రోడ్డు పనులు ప్రారంభం

మధురవాడ, మే 30, ప్రభాతవార్త

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు చొరవతో పెండింగ్‌లో ఉన్న రేవళ్లపాలెం 80 అడుగులు మెయిన్ రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. శనివారం ఈ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన ఎన్నో ఏళ్లుగా రోడ్డుపై ఉండిపోయిన డెబ్రీస్‌ను తొలగించాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణలో 32 మంది స్థలాలు పోతాయని జీవీఎంసీ అధికారులు గుర్తించారు. 28 మంది స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇచ్చారు. వివిధ కారణాలు చూపించి మిగి లిన ఆరుగురు స్థలాల వారికి ఇవ్వలేదు. దీంతో రోడ్డు పనులు ఆ ప్రాంతంలో నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా డెబ్రీస్ తో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం సంపత్ కుమార్ కమిషనర్‌గా ఉన్నప్పుడు టీడీఆర్ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినప్పటికీ ఆయన బదిలీ కావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే చొరవతో ఆ తర్వాత 3 పెండింగ్ టీడీఆర్‌లను జీవీఎంసీ అధికారులు విడుదల చేయగా, నాగోతి వెంకట్రావు, నాగోతి ఎల్లారావు, దేవర తాతబాబుల టీడీఆర్ వ్యవహారాన్ని తేల్చకుండా వదిలేశారు. ఏళ్ల తరబడి రేవళ్లపాలెం రోడ్డు పనులు నిలిచిపోవడంపై గంటా అసంతృప్తి వ్యక్తం చేసి ఆ పాతంలో పర్యటించారు. మిగిలిన మూడు టీడీఆర్ ల విడుదలకు బాధ్యత తాను తీసుకుంటానంటూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇవ్వడంతో మూడు స్థలాల యజమానులు కూడా ముందుకు వచ్చారు. డెబ్రీస్ ను దగ్గరుండి జేసీబీలతో తీయించారు. జెడ్సీ అయ్యప్ప నాయుడు, ఏసీపీ షబ్నాన్ శాస్త్రి, కూటమి నాయకులు చిక్కాల విజయబాబు, గరే గుర్నాథ్, శాఖారి శ్రీనివాస్, లొడగల జానకిరామ్, నాగోతి వెంకట సత్యనారా యణ, మన్యాల సోంబాబు, పోతిన శివ, నాగోతి వెంకట్రావు, కానూరు అచ్యుతరావు, పోలిశెట్టి నాగేశ్వర రావు, నాగోతి వెంకట్రావు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి సన్యాసిరావు, నమ్మి రమణ, బోయి శ్రీను పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై వైకాపా అసంబద్ధ ఆరోపణలు

శాసనమండలి ప్రభుత్వ డా.వేపాడ చిరంజీవిరావు ధ్వజం

విశాఖపట్నం మే 30 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ-విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేవలం 23 నెలల పాలనలోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపి, సామాన్యుల ప్రభుత్వంగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందని శాసన మండలి ప్రభుత్వ విప్ డా.వేపాడ చిరంజీవి రావు అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతన రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలన చూసి పారిపోయిన దిగ్గజ కంపెనీలు నేడు ఏపీకి క్యూ కడుతున్నాయని, ప్రపంచమంతా గూగుల్ సెర్చ్‌లో ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా గూగుల్ డేటా సెంటర్, ఐటీ దిగ్గజం 'టిసీస్' రాకను సుగమం చేశామని తెలిపారు. అనకాపల్లిలో 'ఆర్సెల్లర్ మిట్టల్', రాయలసీమలో 'రాయల్ ఎన్ఫీల్డ్' లాంటి ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను, రాజధాని అమరావతి శరవేగ అభివృద్ధితో అన్ని ప్రాంతాలను సమాంతరంగా అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. 'గొడ్డలి పార్టీ' నాయకుడు జగన్ మోహన్ రెడ్డి, నేడు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మెగా డీఎస్సీని "దగా డీఎస్సీ" అంటూ కుట్రపూరిత ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని డా. వేపాడ మండిపడ్డారు. "ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జరిగిన 15 డీఎస్సీలలో, 11 డీఎస్సీలను నిర్వహించి, 1.50 లక్షల మందికి పైగా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనమైన చరిత్ర కేవలం తెలుగుదేశం పార్టీది, చంద్రబాబు నాయుడు ది అన్నారు. జగన్ ఐదేళ్లపాటు నిద్రపోయి, ఎన్నికల ముందు కంటితుడుపుగా ఇచ్చిన డిఎస్సీ నోటిఫికేషన్ ఆయన అసమర్థత వల్లే కోర్టు స్టేతో ఆగింది తప్ప తాము ఆపలేదన్నారు. వార్షిక జాబ్ క్యాలెండర్‌ను 'సాక్షి' క్యాలెండర్‌కు పరిమితం చేసి, ఐదేళ్లలో ఒక్క కానిస్టేబుల్ పోస్టును కూడా భర్తీ చేయకుండా 20 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో జగన్ ఆడుకున్నారని అని ధ్వజమెత్తారు.

తొలి సంతకంతో మెగా డీఎస్సీ సంచలనం - 150 రోజుల్లో కల సాకారం

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వేసిన తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనేనని గుర్తుచేశారు. మంత్రి నారాలోకేష్ పట్టుదలతో కేవలం 150 రోజుల్లోనే 16,347 పోస్టులకు గానూ 15,941 ఉపాధ్యాయ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని వివరించారు.

పేపర్ లీక్ ఆరోపణలపై సాంకేతిక సమాధానం..

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఏ బ్యాచ్‌కు ఆ బ్యాచ్ పరీక్షా పత్రం కేవలం పరీక్షకు 10 నిమిషాల ముందు మాత్రమే జనరేట్ అవుతుందని, ఆ మాత్రం కామన్ సెన్స్ లేకుండా జగన్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అవుట్ సోర్సింగ్ అభ్యర్థి అయినా మెరిట్ సాధిస్తే అక్రమాలు జరిగాయని బురదజల్లుతారా అని ప్రశ్నించారు. అంతర్జాతీయ డిజిటల్ భద్రతా ప్రమాణాలతో పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు. ఆగస్టు 2025లోనే మెరిట్ లిస్టు పబ్లిష్ చేసి, సబ్జెక్ట్ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించి, ఫైనల్ కీ ఇచ్చాకే అభ్యర్థులను ఎంపిక చేశారని స్పష్టం చేశారు.

జీఓ 77, హారిజెంటల్ రిజర్వేషన్లపై అజ్ఞానం

జీఓ 77 ప్రకారం మహిళలు, క్రీడాకారులు, వికలాంగుల రిజర్వేషన్లను 'హారిజెంటల్ రిజర్వేషన్' పద్ధతిలో భర్తీ చేయడం జరుగుతుందని, దీనిపై కనీస అవగాహన లేకపోవడం వల్లే వైకాపా నేతలు గందరగోళానికి గురవుతూ నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా నిషేధించారని, హక్కుల కోసం పోరాడితే జైల్లో పెట్టించారని మండిపడ్డారు. "గురువు కన్నా గూగుల్ మిన్న" అంటూ ఉపాధ్యాయులను అవమానించారని అన్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వ స్కూళ్లలో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిపోయాయన్నారు. జగన్ టీచర్లను బ్రాందీ షాపుల దగ్గర కాపలా పెడితే.. కూటమి ప్రభుత్వం వారిని అంతర్జాతీయ స్థాయి శిక్షణ కోసం 'సింగపూర్' పంపించి గౌరవించిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ నిర్వహిస్తుందని, ఇప్పటికే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని వేపాడ చిరంజీవిరావు తెలిపారు. కారుణ్య నియామకాల్లోనూ అవినీతికి పాల్పడిన వైకాపా నేతలు పారదర్శకత గురించి మాట్లాడటం "దెయ్యాలు వేదాలు వల్లించినట్లు" ఉందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటానికి ఏ వంకా లేక దొంక పట్టుకుని వేలాడుతున్న జగన్ 11 సీట్లకు పడిపోయిన తన చరిత్రను గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రాత్రింబవళ్లు కష్టపడి మెరిట్ సాధించిన 16 వేల మంది ఉపాధ్యాయులను అవమానించవద్దని, యువతతో రాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, లక్షలాది మంది యువత భవిష్యత్తును అంధకారం చేసిన జగన్ చరిత్రలో ఒక 'నిరుద్యోగ ద్రోహి'గా మిగిలిపోతారని డా.వేపాడ చిరంజీవిరావు హెచ్చరించారు.

గాజువాక గ్రంథాలయంలో ఆకట్టుకున్న యోగాసనాల శిక్షణ

గాజువాక,మే 30,ప్రభాతవార్త

స్థానిక గాజువాక శాఖ గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు చదవడం, రాయడం చదివిన అంశాలను తిరిగి చెప్పడంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ ఇంజనీర్ పార్వతీశ్వరరావు విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడారు. మహాభారతం నుండి 'కర్ణుడి జీవిత విశేషాలు, ఆయన దాతృత్వం' గురించిన కథను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. పురాణ ఇతిహాసాల ద్వారా నైతిక విలువల ను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసం కొరకు యోగాసనాలు నేర్పించారు. విద్యార్థులంతా ఎంతో ఆసక్తితో యోగాసనాలు వేశారు. చివరగా జాతీయ గీతాలాపనతో ఈరోజు కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులే సమాజానికి మూలస్తంభాలు : గొలగాని అప్పారావు

గాజువాక,మే 30,ప్రభాతవార్త

కార్మికులు, కష్టజీవులు లేకపోతే సమాజం అనే బతుకు జట్కా బండి ప్రయాణం సాగదని సిఐటియు గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు స్పష్టం చేశారు. సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గాజువాకలో 64, 65, 86, 87, 88 వార్డుల పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ ఆయన ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గొలగాని అప్పారావు మాట్లాడుతూ.. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌గా కార్మికుల శ్రేయస్సు కోసం, వారి హక్కుల సాధన కోసం ప్రభుత్వాల మెడలు వంచి పోరాడిన తీరును, సాధించిన విజయాలను కొనియాడారు. సమాజంలో దోపిడీ వ్యవస్థను అంతం చేయడం, కార్మిక వర్గంలో ఐక్యతను సాధించడం, వర్గ పోరాటాన్ని బలోపేతం చేయడమే సిఐటియు ప్రధాన లక్ష్యమన్నారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం రాబోయే రోజుల్లోనూ పోరాటాలు కొనసాగుతాయని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నక్క నాగరాజు, నాయకులు గణేష్, మీనాక్షి, అరుణ కుమారి,పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

దంపతులను కాపాడిన భీమిలి పోలీసులు

విశాఖపట్నం, మే 30 ప్రభాతవార్త

ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్న దంపతులను భీమిలి పోలీసులు కాపాడారు. భీమునిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో కుటుంబ కలహాల కారణముగా భార్యా భర్తలు ఇద్దరు బీమిలి బీచ్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు వెళ్తున్నట్లు డయల్ 112 సమాచారం వచ్చింది. దీంతో తక్షణమే స్పందించిన భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని రక్షించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి ఇరువురికి కౌన్సిలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, భీమిలి పోలీసులును అభినందించారు.

కమోడ్‌లో ఉడుము కలకలం

స్టీల్‌ప్లాంట్ సెక్టార్-8లో ఘటన -చాకచక్యంగా పట్టుకున్న స్నేక్ క్యాచర్

గాజువాక,మే 30,ప్రభాతవార్త

ఉక్కునగరం సెక్టార్-8లోని ఓ నివాసంలో శనివారం ఉదయం ఉడుము కలకలం సృష్టించింది. ఒక ఇంటి బాత్‌రూమ్ కమోడ్‌లో అకస్మాత్తుగా పెద్ద ఉడుము ప్రత్యక్షం కావడంతో గృహస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం చేయాలో పాలుపోని స్థితిలో.. వెంటనే వారు స్థానిక స్నేక్ క్యాచర్ కిరణ్ కుమార్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న కిరణ్ కుమార్.. కమోడ్‌లో నక్కిన ఉడుమును ఎంతో చాకచక్యంగా బంధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నివాస ప్రాంతాల్లో పాములు, ఉడుములు వంటి వన్యప్రాణులు కనిపిస్తే ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, వాటిని హింసించకుండా తనకు సమాచారం అందించాలని కోరారు. ఉడుమును సురక్షితంగా పట్టుకోవడంతో సెక్టార్-8 వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

నిరుపయోగంగా ఉన్న టిడ్కో, గృహకల్ప ఇళ్లను పేదలకు ఇవ్వాలి

ఖాళీ గృహాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి -గంగవరం పోర్టు నిర్వాసితులకు తక్షణమే పరిహారం చెల్లించాలి -'దిశా' సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్

గాజువాక,మే 30,ప్రభాతవార్త

గాజువాక నియోజకవర్గ పరిధిలో దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న రాజీవ్ గృహకల్ప, టిడ్కో ఇళ్లను తక్షణమే అర్హులైన ఇతర పేదలకు పునఃకేటాయించాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ హాల్‌లో విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గృహనిర్మాణ, సామాజిక పింఛన్లు, నిర్వాసితుల సమస్యలపై అధికారులను నిలదీశారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం ఇళ్లు కేటాయించినా లబ్ధిదారులు వాటిలో చేరకపోవడం వల్ల వందలాది గృహాలు ఖాళీగా పడి ఉన్నాయన్నారు. ఈ ఖాళీ సముదాయాలు కాస్తా ఇప్పుడు గంజాయి, ఇతర వ్యసనపరులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారి స్థానిక కాలనీవాసులకు రక్షణ లేకుండా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే దీనిపై సమీక్ష జరిపి, ఇళ్లలో చేరని వారి కేటాయింపులను రద్దు చేసి, ఇళ్లు లేని నిజమైన పేదలకు ఇవ్వాలన్నారు. దీనిపై గతంలో పలుమార్లు కోరినా ఫలితం లేదని, ఈసారైనా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా.. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పల్లా తెలిపారు. గంగవరం పోర్ట్ ప్రాజెక్ట్ వల్ల ఉపాధి కోల్పోయిన గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబాలకు రావాల్సిన పునరావాస ప్యాకేజీలను, ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ 1 లక్ష జీవనోపాధి ఆర్థిక సహాయాన్ని తక్షణమే విడుదల చేయాలని స్పష్టం చేశారు. అలాగే గాజువాకలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వితంతువులు, దివ్యాంగుల పింఛన్ల మంజూరులో డీఆర్‌డీఏ అధికారులు జాప్యం చేయకుండా, త్వరితగతిన స్క్రూటినీ పూర్తి చేసి సామాజిక భద్రత కల్పించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులను నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రజాసమస్యలపై పోరాడతామని పల్లా పునరుద్ఘాటించారు. జిల్లా కలెక్టర్, జిల్లాకు చెందిన శాసనసభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చేపల వేట పునఃప్రారంభానికి మత్స్యకారులు సిద్ధంగా ఉండాలి

బోటు యజమానులకు కీలక సూచనలు చేసిన మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

విశాఖపట్నం, మే 30 ప్రభాతవార్త

సముద్రంలో మత్స్యవనరుల పునరుత్పత్తి దృష్ట్యా ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం అమలు చేసిన విషయం తెలిసిందే. వేట విరామం ముగియడంతో జూన్ 15 నుంచి చేపల వేట పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో బోటు యజమానులు, మత్స్యకారులు అన్ని భద్రతా చర్యలు పాటిస్తూ వేటకు సిద్ధమవ్వాలని మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బోటు యజమానులు చేపల వేటకు వెళ్లే ముందు బోటు, ఇంజిన్ స్థితిని పూర్తిగా పరిశీలించుకోవాలన్నారు. గత ఏడాది వేట విరామం అనంతరం సముద్రంలోకి వెళ్లిన సుమారు 25 బోట్లు సాంకేతిక లోపాల కారణంగా తిరిగి ఒడ్డుకు రావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. బోటులో పనిచేసే సిబ్బంది వ్యక్తిగత గుర్తింపు కార్డులు, బోటు రిజిస్ట్రేషన్, లైసెన్స్ పత్రాల ప్రతులు తప్పనిసరిగా ఉంచుకోవాలని తెలిపారు. సముద్రంలో మత్స్యశాఖ, కోస్టుగార్డ్, నేవీ, ఇతర ప్రభుత్వ అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు పూర్తి సహకారం అందించాలన్నారు. అనుమానాస్పద బోట్లు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సుదూర సముద్ర ప్రాంతాలకు వెళ్లే బోట్లు ట్రాన్స్పాండర్లు, జీపీఎస్ పరికరాలను ఎల్లప్పుడూ వినియోగిస్తూ విదేశీ జలాల్లోకి ప్రవేశించకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏపీఎంఎఫ్‌ఆర్ చట్ట నిబంధనలు పాటిస్తూ వేట నిర్వహించాలని పేర్కొన్నారు. వేటకు వెళ్లే ముందు ప్రయాణ వివరాలు, సిబ్బంది వివరాలు, సంప్రదింపు నంబర్లు, వేట ప్రాంతం, తిరిగి వచ్చే అంచనా సమయం వంటి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు, మత్స్యశాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. బోటులో తగినంత తాగునీరు, ఆహారం, ఇంధనం, ఐస్, టార్చ్‌లైట్, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, ప్రథమ చికిత్స పెట్టె, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం అన్ని మెకనైజ్డ్ బోట్లకు ఉచితంగా అమర్చిన ట్రాన్స్పాండర్లను ఎల్లప్పుడూ 'ఆన్'లో ఉంచాలని, ఇది బోట్ల స్థానాన్ని గుర్తించడంలో, అత్యవసర సమయాల్లో రక్షణ చర్యలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఎల్ఈడీ లైట్ల వినియోగంతో చేపల వేట నిషేధమని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, తెగిపోయిన వలలు, తాళ్లు వంటి వ్యర్థాలను సముద్రంలో పడవేయకుండా ఒడ్డుకు తీసుకువచ్చి సక్రమంగా పారవేయాలని సూచించారు. సముద్రంలో బోటు నిలిచిపోవడం, తుఫానులో చిక్కుకోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో బోటు రిజిస్ట్రేషన్ నంబర్, జీపీఎస్ కోఆర్డినేట్లు, సిబ్బంది వివరాలను వెంటనే మత్స్యశాఖ, మెరైన్ పోలీసు, ఇండియన్ కోస్టుగార్డ్ లేదా ఇండియన్ నేవీ అధికారులకు తెలియజేయాలని సూచించారు. జూన్ 2024కి ముందు జారీ చేసిన డీజిల్ ఆయిల్ సబ్సిడీ కార్డులు సాఫ్ట్‌వేర్ మార్పుల కారణంగా చెల్లుబాటు కాకపోవచ్చని, కొత్త కార్డుల కోసం మత్స్యశాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డీప్ సీ ఫిషింగ్ చేసే బోట్లకు 'యాక్సెస్ పాస్' తప్పనిసరి అని, సంబంధిత మత్స్యశాఖ అధికారుల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జేడీ సూచించారు.

దక్షిణ నియోజకవర్గం పరిధిలో రమాభానోజి ప్రాథమికోన్నత పాఠశాలలో

మెగా జాబ్ మేళా ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, మే 30 ప్రభాతవార్త

యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా సంవత్సరంలో పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గ పరిధిలో మూడవసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం,నారా లోకేష్ కోరిక ఒకటే రాష్ట్రం, జిల్లా, ప్రతి నియోజకవర్గ పరిధిలో ప్రతి సామాన్యుడి ఇంట్లో, బంగారు కుటుంబంలో ఉద్యోగ కల్పన మాధ్యేయం అని సామాజిక భద్రత ఉన్నచోట అభివృద్ధి జరుగుతుందని మంచి మంచి కంపెనీలు నేడు జాబ్ మేళాలో పాల్గొన్నాయన్నారు. అతి త్వరలోనే 40 పెద్ద కంపెనీలతో ఒక పెద్ద జాబ్ మేళా నిర్వహిస్తామని ఒక మంచి కాన్సెప్ట్‌తో ఇవాళ ఈ జాబ్ మేళా నిర్వహించడం ఆనందంగా ఉందని ఏ విద్యార్థి కూడా ఆర్థిక పరిస్థితుల వల్ల ఇబ్బందులు పడకూడదని సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలంటే ప్రతి ఒక్కరు బాగా చదువుకోవాలని ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని రానున్న రోజుల్లో, మీ స్నేహితులు కూడా ఉద్యోగాలు సాధించాలని కోరుతున్నానన్నారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించిన జాబ్ మేళాను దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాలకు చెందిన పలు ప్రముఖ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొని అభ్యర్థుల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించాయి. జాబ్ మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ఉద్యోగార్థులు హాజరై తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. స్థానికంగా ఇటువంటి ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫీసర్ టి.చాముండేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ అరుణ పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పి.వి. శివప్రసాద్ రెడ్డి, కూటమి శ్రేణులు, 31 వార్డు నేతలు, వివిధ హోదాల్లో ఉన్న వార్డు శ్రేణులు పాల్గొన్నారు.

దక్షిణ కోస్ట్ రైల్వే సీపీఆర్‌వోగా వై.బాలాజీ కిరణ్‌కు అదనపు బాధ్యతలు

విశాఖపట్నం, మే 30, ప్రభాతవార్త



భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ 2013 బ్యాచ్ అధికారైన వై. బాలాజీ కిరణ్ దక్షిణ కోస్ట్ రైల్వే (సౌత్ కోస్ట్ రైల్వే) ప్రధాన ప్రజా సంబంధాల అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన దక్షిణ కోస్ట్ రైల్వేలో డిప్యూటీ జనరల్ మేనేజర్-కమ్-సెక్రటరీ టు జనరల్ మేనేజర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నారు. భారతీయ రైల్వేల్లో ట్రాఫిక్, కమర్షియల్ విభాగాల్లో విశేష అనుభవం కలిగిన బాలాజీ కిరణ్ గుంటకల్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా, సికింద్రాబాద్ మరియు హైదరాబాద్ డివిజన్లలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాయుడుపేటకు చెందిన బాలాజీ కిరణ్ శ్రీకాళహస్తీశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీకాళహస్తిలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పట్టా పొందారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏతో పాటు పొలిటికల్ సైన్స్, ఇండస్ట్రియల్ రిలేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీలు సాధించారు. సామాజిక సేవ, యువత అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రత్యేక ఆసక్తి కలిగిన ఆయన నాయుడుపేటలో "ఆశయ" అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సివిల్ సర్వీసులో చేరకముందు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. అలాగే ఢిల్లీలోని శ్రీ చైతన్య ఐఏఎస్ అకాడమీలో డైరెక్టర్‌గా సేవలందిస్తూ అనేక మంది సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు మార్గదర్శకత్వం వహించారు. పరిపాలనా అనుభవం, వృత్తిపరమైన నైపుణ్యం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ సామర్థ్యంతో వై. బాలాజీ కిరణ్ దక్షిణ కోస్ట్ రైల్వే ప్రజా సంబంధాలు, మీడియా సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తారని రైల్వే వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ద్విచక్ర వాహనదారులు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి

ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ

ఎలమంచిలి, మే 30, ప్రభాతవార్త:

జాతీయ రహదారి కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద శనివారం ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నియమాలతో పాటు భద్రత నియమాలు పాటిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని, అతివేగము ప్రమాదకరమని ట్రాఫిక్ భద్రత నియమాలను పాటిస్తూ ప్రయాణాలను సాగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా విధుల్లో చేరిన రత్నకుమార్

స్వాగతం పలికి, అభినందించిన అధికారులు, సిబ్బంది

అనకాపల్లి , మే 30 (ప్రభాతవార్త) :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ గా ఎం. వీ. రత్నకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రింగ్ రోడ్‌లో ఉన్న జిల్లా కార్యాలయంలో రత్న కుమార్ పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన రత్నకుమార్‌ను రిజిస్ట్రార్ల సంఘం నాయకులు, సీనియర్ అధికారులు బంగారు వెంకటేశ్వరరావు, అప్పారావు, గీతాలక్ష్మి, బేగం, శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పదవీ విరమణ పొందిన అధికారులకు ఘన వీడ్కోలు

అనకాపల్లి, మే 30 (ప్రభాత వార్త):

పోలీసు శాఖలో దశాబ్దాల పాటు నిస్వార్థంగా సేవలు అందించి, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణతో ఆదర్శంగా నిలిచిన ముగ్గురు అధికారులకు అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆత్మీయ వీడ్కోలు సభ అత్యంత వైభవంగా నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారిలో బి.రామ్ కుమార్ (ఏఎస్ఐ, అనకాపల్లి టౌన్ పి.ఎస్), వి.త్రినాథ్ రావు (ఏఎస్ఐ, పరవాడ పి.ఎస్), ఎల్.గోవింద రావు (ఏఆర్ హెచ్.సీ) ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పదవీ విరమణ పొందిన అధికారులను , వారి కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి ఎంతో ఒత్తిడితో కూడుకున్నది. అటువంటి బాధ్యతాయుతమైన రంగంలో 36 ఏళ్లు (త్రినాథ్ రావు, గోవిందరావు), 35 ఏళ్ల (రామ్ కుమార్) పాటు నిబద్ధతతో పనిచేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వీరు అందించిన సేవలు శాఖకు గర్వకారణం. విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షిస్తున్నాను. విశ్రాంత జీవితంలో కూడా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అధికారుల సుదీర్ఘ అనుభవాన్ని కొనియాడారు. పోలీస్‌శాఖలో ఎన్నో ఒడిదుడుకు లను తట్టుకుంటూ, నిరంతరం ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేసిన మీ సేవలు చిరస్మరణీయం. యువ పోలీసు అధికారులకు మీ క్రమశిక్షణే మార్గదర్శకం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మీకు వెన్నుముకగా నిలిచిన మీ కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు అని పేర్కొన్నారు. సత్కారం అందుకున్న అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తమ సుదీర్ఘ సర్వీసులో ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఇన్నేళ్లపాటు తమ విధి నిర్వహణకు సహకరించిన పై అధికారులకు, తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖ కుటుంబం నుంచి విడిపోవడం బాధగా ఉన్నప్పటికీ, ఇంతటి ఘన వీడ్కోలు లభించడం ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. డీఎస్పీ జీ.ఆర్.ఆర్. మోహన్, ఏ.ఓ. సి.హెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు బాల సూర్యరావు, లక్ష్మి, రామకృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ అప్పలరాజు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని రిటైర్డ్ అధికారులకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజయ్యపేట వీఆర్‌పిపై చర్య తీసుకోండి.. గ్రామస్తులు డిమాండ్.!

(నక్కపల్లి ,ప్రభాతవార్త) :

మండలంలోని రాజయ్యపేట గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో ఆన్లైన్ జూమ్ కాల్ ద్వారా మస్టర్లు వేసిన నిధులు పక్కదారి పట్టించిన వీఆర్పి పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు డిమాండ్ చేశారు. రాజయ్యపేట పంచాయ తీలో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో ఆన్లైన్‌లో జూమ్ కాల్ ద్వారా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి మస్టర్లు వేస్తున్నారని ,రాజయ్య పేట గ్రామస్తులు ఎంపీడీవోకి తెలియజేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కలిసి 15 రోజుల క్రిందట రాజయ్యపేట పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో జరిగిన అవక తవకలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఎంపీడీవో, ఏపీవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో తప్పులను అరికట్టి తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆన్లైన్ వ్యవస్థను తెచ్చినప్పటికీ జూమ్ కాల్ ద్వారా ఆన్లైన్లో మస్టర్లు వేయడం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి గ్రామంలో ఉన్నట్టు చెప్పడం సైబర్ నేరం అవుతుందని గ్రామస్తులు వాపోయారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసం అని తెలిపారు. వెంటనే చర్యలు చేపట్టకపోతే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులకు తెలియజేశా రు. స్పందిం చిన అధికారులు సోమవారం ఉపాధి పనుల్లో భాగంగా మేము వచ్చి జరుగుతున్న అవకతవకలను పర్య వేక్షించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎంపీడీవోను కలిసిన వారి లో నక్కపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగా సుధాకర్ రావు ,నక్కపల్లి మండల జనసేన పార్టీ ప్రధా న కార్యదర్శి బొంది గురన్న ,రాజయ్యపేట జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), నాయకులు పిక్కి చిన్నారి, పిక్కి కోటి, మైలపల్లి రాము ,పిక్కి కోటేశ్వరరావు ,పిక్కి కాశి, పిక్కి ఆదిరాజు, కోట ముసలి, బొందలపు అప్పలరాజు ,వాసుపల్లి నూకరాజు, పిక్కి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైకాపా బూత్ లెవెల్ ఏజెంట్ల ఫారాలు అందజేత.!

(నక్కపల్లి, ప్రభాతవార్త):



పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్సీపీ పార్టీకి సంబంధించిన 292 బూత్ లెవెల్ ఏజెంట్ల -2 ఫారాలను మాజీ శాసన సభ్యులు, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయ కర్త కంబాల జోగులు ఆధ్వర్యంలో నక్కపల్లి సీనియర్ అసిస్టెంట్ (ఎలక్షన్ ఆఫీసర్) కి స్థానిక తహసిల్దార్ కార్యాలయం శనివా రం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సమన్వయం, ఓటర్ల హక్కుల పరిరక్షణలో వైఎస్ఆర్సీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. నియోజక వర్గంలో పార్టీ మరింత బలపడేలా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ బి ఎల్ ఎ -2 ఏజెంట్ కూడా మీ గ్రామాలలో, వార్డులలో ఉన్న బూత్ లెవెల్ అధికారితో పాటు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితా సమగ్ర విశ్లేషణ చేసి, మన పార్టీ ఓట్లు పోనివ్వకుండా అప్రమత్తంగా వ్యవహ రించాలని సూచిం చారు. ఆయనను కలసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ , జిల్లా ప్రధాన కార్య దర్శి సీరం నరసిం హమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు మధు వర్మ , గొర్ల గోవిందరావు , రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి గొర్ల బాబురావు, మాజీ సర్పంచ్ భార్గవ్ , మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షుడు అప్పన్న , నియోజకవర్గ యూత్ అధ్యక్షులు పోచిన నరేష్ , జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చప్పా రాజు , జిల్లా ఐటీ వింగ్ ప్రధాన కార్యదర్శి నల్లపురాజు వెంకటరాజు, మాజీ సర్పంచ్ గోవింద్ , నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ పోలీసుల భారీ గంజాయి పట్టివేత

56.40 కిలోల గంజాయి స్వాధీనం, ఇద్దరు అరెస్టు

అనకాపల్లి, మే 30 (ప్రభాత వార్త):

గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంపై అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఏ. విభూషణ రావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల సమయం లో అనకాపల్లి మండలం బవులవాడ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో మారుతి ఎర్టిగా కారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, అందులోని వ్యక్తులు పారిపోవడానికి యత్నించారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా, రెండు ప్లాస్టిక్ గోనె సంచుల్లో అక్రమంగా తరలిస్తున్న 56.40 కిలోల గంజాయి లభ్యమైంది. ఇందుకు సంబంధించి వివరాలు డి.ఎస్.పి ఎం శ్రావణి తెలియజేశారు. మహారాష్ట్ర థానే జిల్లాకు చెందిన రూపేష్ రాజు చిక్నే (34), ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన రాజు అంత్రు (37) అనే వీరిద్దరూ ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్ర కి తరలించి అధిక ధరకు విక్రయించి అక్రమ లాభాలు పొందాలని యత్నించినట్లు అంగీకరించారు. నిందితుల వద్ద నుండి 56.40 కిలోల గంజాయి, 4 మొబైల్ ఫోన్లు , మారుతి ఎర్టిగా కారు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు .28,20,000/- ఈ మేరకు సంబంధిత ఎన్.డి.పి.ఎస్. చట్టం కింద కేసు నమోదు చేసి అనకాపల్లి రూరల్ సీఐ జి. అశోక్ కుమార్ దర్యాప్తు కొనసాగించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టుకి తరలించినట్లు తెలిపారు. ఈ గంజాయి కేసును ఛేదించిన సిబ్బందిని, అధికారులను డి.ఎస్.పి ఎం శ్రావణి అభినందించారు.

సుజిత్ కుమార్‌జీను కలిసిన తోట నగేష్

(నక్కపల్లి, ప్రభాతవార్త) :

ఒరిస్సా రాష్ట్రం నుంచి నుంచి మరోసారి రాజ్యసభ కు ఎన్నికైన సుజీత్ కుమార్ జీని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ తోట నగేష్ మర్యాదపూర్వకంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో కలసి ఆయనను ఘనంగా సత్కరించారు. మూడవ సారి రాజ్యసభకు ఎంపిక అయినందుకు అభినందనలు తెలిపారు. సుజిత్ కుమార్‌తో తనకున్న స్నేహాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నగేష్ మాట్లాడుతూ రాజేష్ కామిరెడ్డి ఏర్పాటు చేసిన సమవేశంలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయనతోపాటు ఎంపీ అరవింద్ అరవింద్ , సినీ డైరెక్టర్ కమ్ముల శేఖర్, ఐపీఎస్ అధికారి చిత్తరంజన్‌ను కలసి గత పరిచయాలను గుర్తు చేసుకున్నారు. ఈ విధంగా ఒక వేదిక పైకి తీసుకురావడం సంతోషంగా ఉందని నగేష్ ఆనందం వ్యక్తం చేశారు.

లక్ష్మీదేవిపేట బ్రిడ్జి సమస్యపై అనకాపల్లి ఎంపీ ఫోకస్

దశాబ్దానికి పైగా ఉన్న సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ

అనకాపల్లి , మే 30, (ప్రభాత వార్త) :

అనకాపల్లి పట్టణంలో దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉన్న లక్ష్మీదేవిపేట రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం కార్యాలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో సమావేశమై పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపేటలోని లెవెల్ క్రాసింగ్ నెం.485 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరాన్ని ఎంపీ సీఎం రమేష్ జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో రోజువారీగా వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా, రైల్వే గేటు మూసివేతల కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు పలుమార్లు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రజల భద్రతతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం లక్ష్మీదేవిపేట నిర్మాణాన్ని అత్యధిక ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. అనకాపల్లి జిల్లా పరిధిలో చేపట్టాల్సిన రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు,నిర్మాణ పనులు ముఖ్యంగా రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతం, ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పన, రైల్వే కనెక్టివిటీ విస్తరణ,పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టుల వేగవంతమైన అమలు తదితర అంశాలను ఎంపీ జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని రైల్వే సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. లక్ష్మీదేవిపేట తో పాటు అనకాపల్లి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇతర రైల్వే అభివృద్ధి పనుల అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని రైల్వే సదుపాయాలు తీసుకురావడానికి నిరంతరం కృషి కొనసాగిస్తామని ఎంపీ పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ పై విషం కక్కుతున్న జగన్ రెడ్డి

మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి, మే 30 ,(ప్రభాతవార్త) :

కూటమి ప్రభుత్వంలో మరో మెగా డీఎస్సీ విడుదలకు సన్నాహాలు చేస్తుంటే ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తూ నిరుద్యోగులను వీధిన పడే విధంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్న వైనం ప్రజల గమనిస్తున్నారని, డిఎస్సి కి అటెండ్ అయిన నవీన్ కేసుని ఆధారం చేసుకుని జగన్ రెడ్డి దుష్ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీకి ప్రభుత్వం నోటిఫికేషన్ చేస్తే 200 కేసులు కోర్టులో వివిధ వర్గాల చేత వేయించి మెగా డీఎస్సీ అపాలని చూసారని, కష్టపడి చదివి ఉద్యోగాల సంపాదించిన 16 వేల మందికి జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, నాడు ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చిన ఒక్క పోస్టును భర్తీ చేయలేని అసమర్ధ ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయిన నీవు ఏదో విధంగా రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయడానికి చేసే ప్రయత్నాలు మానుకోవాలని నాగ జగదీష్ హితువు పలికారు.

మెగా జాబ్ మేళాలో 37 మందికి ఉద్యోగాలు

(అచ్చుతాపురం, మే 30, ప్రభాతవార్త)

యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలంలోని ఏపీఐసీ వన్‌స్టాప్ సెంటర్ పరిధిలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 280 మంది యువతీ యువకులు పాల్గొనగా, 37 మంది ఉద్యోగాలు సాధించి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గంలో ఇది మూడోసారి నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఇంటిలో ఒక ఉద్యోగం ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్న ఆయన, యువత తమ విద్యార్హతలకు అనుగుణంగా లభిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా వెనుకబడకూడదని, విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేశారు. యలమంచిలి నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తూ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం

(నక్కపల్లి, ప్రభాతవార్త):

నక్కపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదోతరగతిలో 573 మార్కులు సాధిం చడం పట్ల విద్యార్థి పూర్ణ శ్రీహరిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఆంజనేయులు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ ప్రత్యేక కార్యదర్శి సమక్షంలో అభినందించారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మంచి ఫలితాలు రావడం గర్వకారణం అని మంత్రి ఉపాధ్యాయులను కొనియాడారు.

మహిళా సాధికారతకు బ్రాండిక్స్ ఆదర్శం

జౌళి రంగాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్‌కు అపార అవకాశాలు

అచ్యుతాపురం యూనిట్ సందర్శనలో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

కోటి రూపాయల పెట్టుబడికి 50 మందికి ఉపాధి

(అచ్చుతాపురం, మే 30, ప్రభాతవార్త):

గ్రామీణ మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావలంబన వెలుగులు నింపుతూ, మహిళా సాధికారతకు ఆదర్శంగా నిలుస్తున్న బ్రాండిక్స్ సంస్థను కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రశంసించారు. వస్త్ర పరిశ్రమ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు అపార అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని సంస్థలు రాష్ట్రంలో స్థాపితమైతే లక్షలాది మందికి ఉపాధి కల్పించడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి బలమైన ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన వస్త్ర తయారీ సంస్థ బ్రాండిక్స్‌ను శనివారం కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న ఉత్పత్తి ప్రక్రియలు, అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతుల విధానాలను బ్రాండిక్స్ ఇండియా డైరెక్టర్, భారతీయ భాగస్వామి దొరస్వామి ఆయనకు వివరించారు. అనంతరం ఫ్యాక్టరీలోని వివిధ విభాగాలను పరిశీలించిన మంత్రి, కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సంక్షేమ చర్యలపై యాజమాన్యాన్ని అభినందించారు. కోటి రూపాయల పెట్టుబడికి 50 మందికి ఉపాధి అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక ఉపాధిని కల్పిస్తున్న రంగం జౌళి పరిశ్రమేనని తెలిపారు. ఈ రంగంలో పెట్టే ప్రతి రూ.1 కోటి పెట్టుబడికి సుమారు 50 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. బ్రాండిక్స్ వంటి భారీ పరిశ్రమల వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు వేల సంఖ్యలో ఉద్యోగాలు పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారని చెప్పారు. బ్రాండిక్స్ రాకతో ఈ ప్రాంతంలో మహిళా సాధికారత గణనీయంగా పెరిగిందని స్థానికులు తనకు స్వయంగా వివరించారని మంత్రి తెలిపారు. ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధిస్తే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. టెక్నికల్ టెక్స్‌టైల్స్‌లో సువర్ణావకాశాలు భవిష్యత్తు టెక్నికల్ టెక్స్‌టైల్స్‌దేనని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో ఈ రంగం అభివృద్ధిపై విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. సాధారణ దుస్తుల తయారీతో పాటు ఏరోస్పేస్, డ్రోన్లు, రక్షణ, వైద్య, వ్యవసాయ రంగాల్లో సాంకేతిక వస్త్రాల వినియోగం వేగంగా పెరుగుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు విశేష అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహా మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వస్తే భారీ స్థాయిలో ఉపాధి కల్పనతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జౌళిశాఖ ఉన్నతాధికారులు, బ్రాండిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పూడిమడకలో ఉచిత వైద్యశిబిరం

250 మందికి వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

(అచ్చుతాపురం, మే 30, ప్రభాతవార్త):

సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పూడిమడక గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సిఐటియు అచ్యుతాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 250 మంది ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర్రావు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాటాలతో పాటు సిఐటియు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణలో ఆహారపు అలవాట్లు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా వైద్య ఆరోగ్య వేదిక కన్వీనర్ టి. కామేశ్వరరావు, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాయి, డాక్టర్ కిరణ్, విష్ణు డెంటల్ క్లినిక్ వైద్యుడు డాక్టర్ ఎ. సుధీర్, శ్రీ నేత్ర ఐ కేర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ సిద్ధు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. రాము, మండల కన్వీనర్ కె. సోమునాయుడు, సిహెచ్. తాతయ్యలు, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు చంద్రమౌళి, వివిధ ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

లోవోల్టేజ్ సమస్య తీర్చండి

(నక్కపల్లి, ప్రభాతవార్త):

మండలం లోని ఉపమాక గ్రామము లో, లో- వోల్టెజ్ సమస్య , ట్రాన్స్ఫర్మర్ లు కేపాసిటీ సరిపోక పోవడం వలన తరచుగా ఫ్యూజ్ లు పోవడం వలన కరెంటు లేక ప్రజలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుకున్నారని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి నాయకత్వంలో ఏ ఈ కి వినత పత్రం అందజేశారు. ఉపమాకలో బ్రాహ్మణ వీధి, రామాలయం వీధి, మెరక వీధి, ఎస్సీ కాలనీ శివారు గ్రామాలు మామిడివానిపాలెం, సారిపల్లివానిపాలెం, అయ్యన్నపాలెం,మనబాల వానిపాలెం, శీనయ్యపాలెం గ్రామాలలో ఈ సమస్య తీవ్రంగా ఉందని, ట్రాన్స్ఫర్మర్ లు పెంచి లో వోల్టెజ్ సమస్య తీర్చి విద్యుత్ కోతలు తగ్గించాలని కోరారు. నక్కపల్లి మండలం ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ సత్యనారాయణ వినతి పత్రం అందజేసిన సందర్భంలో సమస్య పరిష్కారం కానియెడల హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత దృష్టికి తీసుకొని వెళ్ళవలసి వస్తుందని చెప్పారు. సమస్య పరిష్కారం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏఈని కలిసిన వారిలో టీడీపీ నాయకులు కోరుకొండ వరాహలరావు, కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీను, యలమంచిలి నాగేశ్వరావు మునసా లోవరాజు, జనసేన నాయకులు తోట అప్పారావు మేడిశెట్టి దుర్గ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్క బిఎల్ఏ బాధ్యతగా వ్యవహరించాలి

ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి .. విజయవంతంగా "పేట" నియోజకవర్గ వైసీపీ బీఎల్ఏల శిక్షణ

(నక్కపల్లి రూరల్/ అడ్డు రోడ్డు,ప్రభాతవార్త)

పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున నియమించబడిన బీఎల్ఏలకు శిక్షణ కార్యక్రమం స్థానిక సుబ్బరామిరెడ్డి కళ్యాణమండపంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ బి ఎల్ ఎ ల శిక్షణ కార్యక్రమంలో అత్యధికంగా బి యల్ ఏ లతోపాటు పార్టీ నాయకత్వం పెద్ద ఎత్తున హాజరవ్వడం తో విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామస్థాయి నుంచి పార్టీ నాయకత్వాన్ని సమన్వయపరుస్తూ బిఎల్ఏ ల ప్రాముఖ్యత వివరిస్తూ 2029 ఎన్నికలకు ముందు వచ్చే స్థానిక ఎన్నికల్లో ఏ విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అగ్రభాగాన నిలవాలి ఎక్కువ స్థానాలు సాధించుకోవాలి అనేది ప్రతి ఒక్కరు తెలుసుకొని గ్రామస్థాయిలో వ్యవహరించాలని కోరారు. అనంతరం ఈ బి ఎల్ ఈ ల శిక్షణ కార్యక్రమం లో మాజీ శాసనమండలి సభ్యులు, కాకినాడ జిల్లా వైఎస్ఆర్సీపీ పరిశీలకులు డి.వి.సూర్యనారాయణరాజు ,నియోజకవర్గ పరిశీలకులు దిలీప్ కుమార్ రాజు , రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, రాష్ట్ర పార్టీ నాయకులు చిక్కాల రామారావు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఐటీ వింగ్ జోనల్ వన్ అధ్యక్షులు జగదీష్ రెడ్డి లు పాల్గొని పలు మెలకువలను తెలియజేశారు. స్క్రీన్ ద్వారా బిఎల్ఏ ల పాత్ర పై పూర్తిస్థాయి వివరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలనేసి ఘనంగా నివాళు లర్పించారు. మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ కంబాల జోగులు మాట్లాడుతూ బిఎల్ఏల సమావేశానికి అత్యధికంగా హాజరైన విజయంతో చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు , అయినంపూడి బంగార్రాజు (మణి రాజు)తోపాటు నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు రమేష్ , శ్రీనివాస , మధు వర్మ , జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీరం నరసింహమూర్తి, రాష్ట్ర పార్టీ అనుబంధ సంఘాల నాయకులు గొర్ల బాబురావు ,లోడగల చంద్రావు, సురకాసుల గోవిందు, ఎలమంచిలి చందు, వీసం రాజు, కాకర వెంకట్రావు, పొడగట్ల పాపారావు, ఎల్లేటి సత్యనారాయణ, నియోజకవర్గ స్థాయిలో జడ్పిటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, మొత్తం 292 మంది బీఎల్ఏలు కార్యక్రమానికి హాజరయ్యారు.

మలేరియా, టైఫాయిడ్‌తో గిరి విద్యార్థి మృతి

గూడెంకొత్తవీధి, మే 30, ప్రభాతవార్త

మండలంలోని రింతాడ పంచాయతీ సచివాలయం 2 పరిధి ఏబులం కుమ్మర వీధి గ్రామానికి చెందిన వంతల అర్జున్, రొయ్యల దంపతుల కుమారుడు సతీష్ (16) సంవత్సరాల బాలుడు గత రెండు వారాలుగా మలేరియా ,టైఫాయిడ్‌తో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఈ ఏడాది పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి కాలేజీలో అడుగుపెట్టే ముందే విషాదం నెలకోవడంతో గ్రామంలోని తీవ్ర విషాద సాయిలు నిండాయి. తల్లిదండ్రులు బాబుని కోల్పోయిన బాధలో కుటుంబం మొత్తం తీవ్ర కన్నీటి పర్యంతం అయింది.

రోడ్డు పక్కన వ్యర్థాలతో దుర్గంధపు వాసన

గూడెం కొత్తవీధి,మే 30, ప్రభాతవార్త

మండలంలోని ఆర్ వి నగర్ గూడెం కొత్త వీధి మార్గ మధ్యలో రోడ్ పక్క చెత్త మరియు కుళ్ళిన చేపల వ్యర్థాలు వేయటంతో వాహన దారులు పాదాచారులకు తీవ్ర దుర్వాసన రావటంతో ఆ మార్గంలో ప్రయాణం చేయడానికి ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ మార్గంలోనే జీకే వీధి మండల కేంద్రనికి పలువురు అధికారులు ప్రయాణిస్తూ ఉంటారు. తక్షణమే పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.

జనసేన నేత గంజాయి రవాణా.. కూటమి ప్రభుత్వంపై వైసీపీ తీవ్ర విమర్శలు

గంజాయి వ్యవహారంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైసీపీ నేతలు

గూడెం కొత్తవీధి, మే 30, ప్రభాతవార్త

అక్రమంగా 170 కిలోల గంజాయి తరలిస్తూ గూడెం పాతవీధి సమీపంలో పట్టుబడ్డ వ్యక్తి జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడేనని పేర్కొంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. శనివారం జీకే వీధిలో నిర్వహించిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ బత్తుల సిద్దార్ మార్క్‌తో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని జనసేన నాయకులు ప్రకటించడం విచిత్రంగా ఉందని వైసీపీ నేతలు విమర్శించారు. గతంలో వైసీపీ నాయకులపై ఆరోపణలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు ఈ ఘటనపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో "ఆపరేషన్ పరివర్తన్" పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి గంజాయి సాగును అరికట్టడంతో పాటు గిరిజన రైతులను ఉద్యాన పంటలు, కాఫీ, మిరియాలు, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో తదితర పంటల సాగు వైపు ప్రోత్సహించామని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులు పెరగడంతో పాటు విద్యార్థుల్లో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతోందని ఆరోపించారు.ఈ సమావేశంలో జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్,మండలం వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు గాను దుమంతి సత్యనారాయణకు విశిష్ట సత్కారం

గూడెం కొత్తవీధి, మే 30, ప్రభాతవార్త

జన్ జాతీయ గరిమా ఉత్సవ్--2026 కార్యక్రమంలో భాగంగా గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ, భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న దుమంతి సత్యనారాయణ (రెవెన్యూ ఉద్యోగి)కు శుక్రవారం విశాఖపట్నంలోని ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎం) ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాణి మందా చేతుల మీదుగా ఆయనకు మోమెంటో అందజేసి సత్కరించారు.రాష్ట్ర నలుమూలల గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న 20 మంది గిరిజన సేవకులను ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా సన్మానించారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్న దుమంతి సత్యనారాయణ ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో మూడు, జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు అందుకుని విశేష గుర్తింపు పొందారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులు పాల్గొని సన్మాన గ్రహీతలను అభినందించారు.

భూగర్భ జలపరిశీలన బావుల ఏర్పాటు, పర్యవేక్షణపై ఇంజనీరింగ్ సిబ్బందికి క్షేత్రస్థాయి శిక్షణ

వివిధ మండలాల నుండి పాల్గొన్న 25 మంది అధికారులు -పాడేరు ఎంపీడీఓ, ఎంఆర్ఓ కార్యాలయాల వద్ద ప్రాక్టికల్స్ నిర్వహణ -భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు

పాడేరు,మే30, ప్రభాతవార్త

జిల్లాలో భూగర్భ జలాల లభ్యతను అంచనా వేయడం, నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పాడేరులో వివిధ మండలాలకు చెందిన 8 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, 6 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 11 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మొత్తం 25 మంది సిబ్బందికి 'పరిశీలన బావుల ఏర్పాటు మరియు భూగర్భ జలల నీటి మట్టాల పర్యవేక్షణ' అనే అంశంపై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో భాగంగా అధికారులకు పాడేరు లోని రెండు ముఖ్య ప్రదేశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించి, ప్రత్యక్షంగా వివరించారు ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని ఓపెన్ వెల్ (బావి) ఇక్కడ తెరిచిన బావుల ద్వారా నీటి మట్టాలను ఎలా కొలవాలి, ప్రత్యక్షంగా పరిశీలించి, బావులను ఎలా స్థిరీకరించాలనే అంశాలపై అయన అవగాహన కల్పించారు. తహశీల్దార్ (కార్యాలయం సమీపంలోని పీజోమీటర్ పీజోమీటర్ పరికరం ద్వారా భూగర్భ జలాల ఒత్తిడిని, ఖచ్చితమైన నీటి నిల్వలను ఏ విధంగా పర్యవేక్షించాలో ప్రత్యక్షంగా చూపించారు. జిల్లాలో భూగర్భ జలాల సంరక్షణకు, సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులకు క్షేత్రస్థాయి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని డిప్యూటీ డైరెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీర్లకు వివరించారు.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు

పాడేరు,మే30, ప్రభాతవార్త



కార్మికులు ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు తెలిపారు శనివారం పాడేరు జిల్లా కేంద్రంలో సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణ చేశారు. యుద్ధం కారణంగా దేశంలో ధరలు పెరుగుతున్నాయని పెరిగిన ధరలకు కార్మిక వర్గం వేతనాల పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు కేవలం కేంద్రంలో ఉన్న బిజెపి మోడీ వైఖరి వల్లనే భారతదేశాని కి ఈ దుస్థితి వచ్చిందని తెలిపారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని దీంతో నిత్యవసర సరుకు ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా కార్మిక వర్గం ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 15 సంవత్సరాల నుండి కనీస వేతనం ప్రకటన చేయడం లేదని అన్నారు తక్షణం రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం 26,000 ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకంలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు అసంఘటిత రంగం కార్మికులు ముఠా కళాసి లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ కోసం మరిన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు గతంలో ఇవ్వాల్సిన క్లెయిమ్స్ తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, ముఠా కలసి సంఘం అధ్యక్షులు సూరిబాబు, శంకర్రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు అవగాహన సమావేశం

గూడెంకొత్తవీధి,మే 3, (ప్రభాతవార్త

జూన్ 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పై మండలంలోని 56 పోలింగ్ కేంద్రాలకు చెందిన బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమాని కి సంబంధించిన షెడ్యూల్, నిర్వహించాల్సిన కార్యకలా పాలను అధికారులకు వివరించారు. పరిశుభ్రమైన, తప్పులులేని ఓటరు జాబితా తయారీ కోసం ప్రతి బీఎల్‌వో బాధ్యతాయుతంగా పనిచేయాలని గూడెంకొత్తవీధి తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు ఆదేశించారు.

కూటమి ప్రభుత్వంలో ఆదివాసీలకు అన్యాయం

అరకు రూరల్, మే 30, ప్రభాతవార్త

ఎన్నికల హామీ అమలు పై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని గిరిజన వ్యతిరేక వైఖరిని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తీవ్రంగా ఖండిం చారు. శనివారం అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో పి.అప్పలనర్స మాట్లాడుతూ గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, భూహక్కులు, సంక్షేమం విషయంలో పూర్తి నిర్లక్ష్యం చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ మరచి పోయి, గిరిజన ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అమలు చేస్తోంది. ఇది స్పష్టమైన ఆదివాసీ వ్యతిరేక వైఖరి అన్నారు. అంతే కాకుండా గత రెండూళ్ళలో రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీలకు పోడు భూమిలకు హక్కు పత్రాలు ఇవ్వకుండా నిరకరించారు. అర్హత కల్గిన వారు వేలాది మంది ఉంటే ఒక్కరికూడా హక్కు పత్రాలు ఇవ్వలేదాని తెలిపారు. గిరిజనులకు ఇవ్వాల్సిన పట్టాలు ఇవ్వకుండా ఆలస్యం చేయడం, అడవి భూములను మైనింగ్ కంపెనీలు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరిట కార్పొరేట్ కంపెనీ లకు కట్టబెట్టడం జరుగుతోంది. 1 బై 70 చట్టం ఆధ్వర్యంలో గిరిజనుల భూములను రక్షించాల్సిన ప్రభుత్వం దానిని బలహీనపరుస్తోంది. గిరిజనుల జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించాల్సిన 18 వేల కోట్లుకు గాను కేవలం 4వేల కోట్లు కేటాయించారు. దీన్ని గొప్పగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి గొప్పగా చెప్పడం అన్యాయం. నిధులు సక్రమంగా ఖర్చు చేయకుండా, కేటాయించిన కొద్ది నిధులు సైతం ఇతర శాఖలకు మళ్లించడం లేదా నిర్లక్ష్యం చేయడం జరుగుతోంది. గత ఏడాదుల్లో టి ఎస్ పి నిధుల వినియోగం 60-70 శాతం మాత్రమే ఉండటం విషాదకరం. ముఖ్యంగా పి వి టి జి ఎస్ కోసం ప్రత్యేక పథకాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయి. పీఎం జన్మన్ లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 1 లక్ష రూపాయలల్లో ఒక్క పైసా నేటికీ విడుదల చేయలేదు. బకాయి సొమ్ము విడుదల చేయకపోవడం తో మొండి గోడలు దర్శనం ఇస్తుందని అన్నారు. గిరిజనులకు రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయకపోవడం. స్థానిక గిరిజన యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా బయటి వాళ్లను తీసుకోవడం వల్ల గిరిజన యువత నిరాశకు గురవుతోంది. గిరిజన సంక్షేమ శాఖలో కూడా స్థానికులకు తగిన ప్రాధాన్యత లేదు.అరకు లోయ కేంద్రంగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ హామీ అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లు దయనీయ స్థితిలో ఉన్నాయి. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలోని ఆరోగ్య శాఖ గిరిజనుల ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం లేదు. డోలీ మోతలు ఇప్పటికీ కొనసాగు తున్నాయి. గిరిజన అడవుల్లో మైనింగ్ ప్రాజెక్టులు, ఇతర పెద్ద ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం ద్వారా గిరిజనుల సాంప్రదాయిక జీవన విధానం, సంస్కృతి, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. ఇది గిరిజనులను వేరుచేసి, వారి భూములను దోచుకోవడానికి చేస్తున్న కుట్ర. కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను సరిద్దుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు మరింత తీవ్రం చేస్తాం. గిరిజనుల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుందాని అన్నారు. ఈ కార్యక్రమంలో అరకు లోయ మండలం పార్టీ కార్యదర్శి కె. రామారావు, నాయకులు మగ్గన్న, భగత్ రామ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వేసవి క్రికెట్ శిక్షణా ముగింపు కార్యక్రమం

జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరు,మే30,ప్రభాతవార్త:

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో, సార్ద మెటల్స్ అండ్ అలాయ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, కొత్తవలస వారి సహకారం తో గిరిజన యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడం, వారికి క్రీడలపై ఆసక్తి పెంపొందించడం, అలాగే చెడు మార్గాల నుండి దూరంగా ఉంచాలనే లక్ష్యంతో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాన్ని ఈనెల 1వ తేదీ నుండి పాడేరు మండలం, తలారసింగి సిఏహెచ్ స్కూల్ లో 30 రోజుల పాటు క్రికెట్ శిక్షణా నిర్వహించారు. ఈ శిబిరంలో నైపుణ్యం కలిగిన ముగ్గురు కోచ్ల ఆధ్వర్యంలో సుమారు 100 మంది గిరిజన యువకులకు క్రికెట్ క్రీడలో ప్రాథమిక ,ఉన్నత స్థాయి శిక్షణా ఇవ్వడం తో పాటు వారికి బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వంటి అంశాలలో ప్రత్యేక శిక్షణాతో పాటు క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, జట్టు భావన వంటి విలువలను నేర్పించారు. శిక్షణా ముగింపు పూర్తయిన సంధర్భంగా ఈ శిక్షణాలో పాల్గొన్న గిరిజన యువకులకు సర్టిఫికెట్లు, క్రికెట్ కిట్లు ఎస్పీ అమిత్ బర్దర్ చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ గిరిజన యువత తమ ప్రతిభను ఇంకా పెద్ద స్థాయిలో ప్రదర్శించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే దిశగా క్రీడలను ఒక మంచి అవకాశంగా వినియోగించుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఎస్పీ అమిత్ బర్దర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.దుర్గా ప్రసాద్, అల్లూరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి,సయ్యద్ మహమ్మద్,సిఐ డి.ధీనబంధు, పాడేరు పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె పాపినాయుడు, పాడేరు పోలీసు స్టేషన్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భావం తెలుగు జాతి దశాబ్దాల కల సాకారం

తెలుగు ప్రజల పోరాట పటిమకు, నాయకత్వ సంకల్పానికి ప్రతీకగా రైల్వే జోన్.. జూన్ 1న విజయోత్సవంలా జరుపుకోవాలి - టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 30 ప్రభాతవార్త

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండటం తెలుగు ప్రజల దశాబ్దాల కల సాకారమైన చారిత్రాత్మక ఘట్టమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విజ యాన్ని ప్రతి తెలుగు వారి విజయంగా భావిస్తున్నా నని, రైల్వే జోన్ సాధన కోసం జరిగిన ఉద్యమాలు, పోరాటాల్లో భాగస్వామి కావడం పట్ల గర్వంగా ఉందని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రాష్ట్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ప్రధాన హామీల్లో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఒకటని గుర్తుచేశారు. దశాబ్దాల పోరాటం, ప్రజల ఆకాంక్షలు, ప్రజాప్రతినిధుల నిరంతర కృషి ఫలితంగానే నేడు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భవించిందన్నారు.

తెలుగు ప్రజల ఆకాంక్షలకు న్యాయం

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల కార్యకలాపాలు ప్రారంభించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని పల్లా పేర్కొన్నారు. రైల్వే పరిపాలన, మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త ప్రాజెక్టులు, ఉద్యోగ అవకాశాల కల్పనలో ఈ జోన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

కూటమి ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం

దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జూన్ 1 నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం తెలుగు ప్రజల పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

విజయోత్సవంలా జరుపుకోవాలి

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలుగు ప్రజల విజయ పర్వంగా భావించాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఈ చారిత్రాత్మక సందర్భాన్ని ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి పట్టణంలో, గ్రామంలో రైల్వే జోన్ సాధనకు గుర్తుగా సంబరాలు నిర్వహించాలని, సమీప రైల్వే స్టేషన్లు, రైల్వే బోర్డుల వద్ద మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని పంచుకోవాలని సూచించారు. ఇది కేవలం ఒక పరిపాలనా నిర్ణయం కాదని... తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి, సంకల్పానికి లభించిన విజయమని పేర్కొన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భావం రాష్ట్ర ప్రగతికి కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని, ఈ విజయాన్ని ప్రజలందరూ తమ విజయంగా భావించి విజయోత్సవంలా జరుపుకోవాలని పల్లా శ్రీనివాసరావు కోరారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్‌తో పాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో బీఎల్ఓ కిట్ల సామగ్రి పంపిణీ పూర్తి

నూటికి నూరు శాతం ఎలక్ట్రోల్ మేపింగ్ చేయాలి..నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,మే30, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు) పరిధి లోని బూత్ స్థాయి అధికారుల కొరకు కేటాయిం చిన పరిధిలో నూటికి నూరు శాతం ఎలెక్ట్రోల్ మ్యాపింగ్ జరగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు ఉంటుం దని పేర్కొన్నారు. ఇప్పటికే పాడేరు నియోజకవర్గం ఎన్నికల అధికారి, ఎలక్ట్రోల్ మ్యాపింగ్‌లో అలసత్వం వహించిన వారిపై (బిఎల్ఓలకు)సోకాజు నోటీసులు జారీ చేసినట్లుగా జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ తెలిపారు. అలాగే అరకు నియోజవర్గం చెందిన మరి కొంతమంది బిఎల్ ఓలకు కూడా ఎలక్ట్రోల్ మ్యాపింగ్ లో నిర్లక్ష్యం వహించిన వారికి పాడేరు సబ్ కలెక్టర్, అరకు నియోజకవర్గ ఎన్నికల అధికారి నోటీసులను జారీ చేశారు. అల్లూరీ జిల్లా, పాడేరు పరిధిలోని బూతులు అధికారులకు శనివారం ఉదయం తన ఛాంబర్‌లో బిఎల్ ఓలకు ప్రత్యేక కిట్ల సామగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేసారు. ముఖ్య ఎన్నికల అధికారి ఉత్తర్వుల ప్రకారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఈ సామగ్రి చేరుకోగా, అందులో మొత్తం 1,023 బీఎల్‌ఓ కిట్లకు సరిపడా సామగ్రిని జిల్లా యంత్రాంగానికి అందజేశారు. ఈ మొత్తం సామగ్రిని జిల్లా యంత్రాంగం క్షుణ్ణంగా తనిఖీ చేసి, రసీదులపై సంతకం చేసి స్వీకరించారు. పంపిణీ చేయబడిన ముఖ్యమైన సామగ్రి శ్రీ లక్ష్మి గణపతి ట్రేడర్స్ ద్వారా,భారత ఎన్నికల సంఘం (ఈ సి ఐ) లోగోతో కూడిన జూట్ కిట్ బ్యాగులు (1,023), తెల్లటి క్యాపులు (1,023), త్రివర్ణ ఫోల్డింగ్ గొడుగులు (1,023), 1 లీటరు వాటర్ బాటిళ్లు (1,023), రైటింగ్ ప్యాడ్ బుక్స్, జెల్ పెన్నులు, హెచ్‌బి పెన్సిళ్లు, ఎరేజర్లు, షార్పనర్లు మరియు ఫారం సెట్లు (ఫారం 6, 7, 8) సరఫరా అయ్యాయి.ఎమ్.వి.ఎమ్. ఎక్విప్‌మెంట్స్ ద్వారా: స్టాప్లర్ మెషీన్లు (1,023), స్టాప్లర్ పిన్ బాక్సులు (2,046), హైలైటర్ పెన్నులు (1,023), గ్లూ స్టిక్స్ (1,023), ప్యాడ్ విత్ క్లిప్ బోర్డులు (1,023) మరియు స్టాంప్ ప్యాడ్‌లు (1,023) అందజేశారు.ఈ సామగ్రి అంతా బల్క్ కార్టన్ బాక్సులు మరియు విడిగా (లూజ్) లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉంచుకున్న త్వరలోనే వీటిని జిల్లాలోని బూత్ స్థాయి అధికారులకు కిట్ల రూపంలో క్రమబద్ధంగా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

జిల్లాలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా జూన్ 7 నుండి జూన్ 21 వరకు యోగోత్సవాలు నిర్వహణ -జూన్ 7న కొత్తపల్లి జలపాతం వద్ద, 8న మత్స్యగుండం వద్ద నిర్వహణ : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,మే30,ప్రభాతవార్త

అల్లూరి జిల్లాలో గత ఏడాది మాదిరి గానే అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలనీ, అందుకు సంబంధించిన ప్రణాళికాబద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలనీ అధికారులను జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్‌లో జిల్లా అధికారులు, అల్లూరి జిల్లా మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో జూన్ 7 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ముందస్తుగా ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం సమీపాన జూన్ 7వ తేదీన, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, జూన్ 8 వ తేదీన హుకుంపేట మండలం మత్స్యగుండంలో పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ సమక్షంలో యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో, మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో జూన్ 7 నుండి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, సమగ్ర శిక్ష అభియాన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, గురుకులం ఓఎస్డి సమన్వయంతో యోగా నిర్వహణ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లా యోగా నోడల్ అధికారిగా ఆయుష్ శాఖకు చెందిన డా.మౌనిక శ్రీ వ్యవహరిస్తారన్నారు. పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించే యోగా కార్యక్రమంలో 500 మందికి తక్కువ కాకుండా కార్యక్రమంలో పాల్గొనే విధంగా చూడాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు యోగా కార్యక్రమంలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. యోగ కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలలో మౌలిక వసతులు కార్పెట్లు, మ్యాట్లు యోగాసనాలు వేయడానికి సిద్ధం చేయాలన్నారు. వేసవి, ఉక్కపోత దృష్ట్యా పాల్గొనే వారందరికీ తాగునీటి సదుపాయం, అవసరమైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లా అధికారులు అందరూ విధిగా కామన్ యోగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. స్కూల్, కాలేజ్ విద్యార్థులు, ఎన్ సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన కల్పించేలా రన్ ఫర్ యోగా, ర్యాలీలను నిర్వహించాలన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి, ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రముఖులను, స్వాతంత్ర్య సమరయోధులను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించుటకు, ప్రజల సమస్యలను పరిష్కరించుటకు మీడియా సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించుటకు మీడియా కీలక పాత్ర పోషించాలన్నారు. జిల్లాలో యోగా దినోత్సవం నిర్వహించుటకు అనువైన ప్రదేశాలను చూచించాలనీ,ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించుటకు విలువైన సలహాలు, సూచనలను అందించాలనీ, పత్రికలలో, డిజిటల్ మీడియా ఫ్లాట్ ఫామ్‌లలో, సోషల్ మీడియాలో జిల్లా యోగా దినోత్సవానికి, పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచురణ కల్పించాలన్నారు. జిల్లా యంత్రాంగం తరపున జిల్లా మీడియా యంత్రంగానికి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. పాడేరు ఐటిడిఏ పిఓ ఆదిత్య వర్మ, జిల్లా ఇంచార్జ్ డిఆర్ఓ ఎంవిఎస్ లోకేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణారావు, గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమిళ, గురుకులం ఓఎస్డి మూర్తి, సమాచార శాఖ ఇంచార్జ్ డిపిఆర్ఓ కె వెంకటరావు, మీడియా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా

అరకు రూరల్, మే 30, ప్రభాతవార్త

అల్లూరి జిల్లా కలెక్టర్ నిశాంతి.టి ఆదేశాల మేరకు అరకు లోయ మండలంలో రేపటి నుండి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకం క్రింద పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరగనున్నట్లు స్థానిక ఎంపీడీవో వీసం ప్రసాద్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుండి మండలంలో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. మండల పరిధిలో మొత్తం 6 వేల 314 మంది లబ్ధిదారులకు 2 కోట్ల 73 లక్షల 25 వేల 5 వందల రూపాయలు పింఛన్లు పంపిణీ చేయబడనున్నాయని చెప్పారు. మండలంలో వృద్ధాప్య పింఛన్ కింద 3 వేల 983 మంది లబ్ధిదారుల కు 1 కోటి 60 లక్షలను 4 వేల రూపాయలు వితంతు పింఛన్ కింద, 1 వేల 688 మందికి 68 లక్షల 20 వేల రూపాయలు వికలాంగుల పింఛన్ కింద, 466 మందికి 28 లక్షల 2 వేల రూపాయలు చొప్పున పంపిణీ చేయబడుతుందని తెలియజేశారు. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు, పక్షవాతం బాధితులు, ఒంటరి మహి ళలు, అభయహస్తం లబ్ధిదారులు, తీవ్రమైన మస్క్యులర్ డిస్ట్రోఫీ మరియు ప్రమాద బాధితులు, థలసేమియా, బహుళ వైకల్య కుష్ఠు వ్యాధిగ్రస్తులు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి పొందిన వారు మరియు ద్వైపాక్షిక ఎలిఫెంటియాసిస్ (గ్రేడ్-4) బాధితులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పింఛన్లు అందజేయబడ నున్నాయన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మండల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. గ్రామ స్థాయిలో పంచాయతీ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అరకులోయ మండలంలో మొత్తం 6 వేల 314 మంది లబ్ధిదారు లకు 2 కోట్ల 73 లక్షల 25 వేల 5 వందల పింఛన్లు జూన్ 1వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుండి పంపిణీ చేయబడుతున్నట్లు అరకులోయ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్ తెలిపారు.

జనసేన నేత సిద్ధార్థ మార్క్‌పై పార్టీ తొలగింపు చర్యలు

పాడేరు, మే 30, ప్రభాతవార్త

గూడెం కొత్తవీధి మండలానికి చెందిన బత్తుల సిద్ధార్థ్ మార్క్ ని జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య తెలిపారు. గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు దొరికిపోవటంతో పార్టీ నుండి తొలగించినట్టుగా తెలిపారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్నప్పటికీ గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, ఇటీవల పార్టీ క్రమశిక్షణ లోపంతో వ్యవహరించారని పేర్కొన్నారు. పార్టీ నిబంధనల మేరకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై పార్టీ పేరు, జెండా, గుర్తులను ఉపయోగించరాదని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని సూచించారు.

31-5Pg7exHMNWJQE.qxd:31-5Pg7exHMNWJQE.qxd 1/1/02 7:16 AM Page 1

వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

రాబడి రూ.10,63,184లు

రాపూరు (నెల్లూరు), మే 30, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన మూడవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం,గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మి అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోఛ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం,గిరిజనవాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యమ్రంలో పాల్గోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు,క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ॥ 10,63,184 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ॥ 3,42,109లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ॥ 27,750లు, నిత్య కళ్యాణం ద్వారా రూ, 88 వేలు, 500 రూపాయిల ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.3,31,400లు,దేవస్థానం వసతి ద్వారా రూ.14,400లు, తలనీలాలు 3.400 మంది సమర్పించగా తద్వారా రూ. 1,36,000 లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 1,20,285లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.14.740లు,వాహనాల పూజల ద్వారా రూ.2,400 లు చొప్పున మొత్తం రూ.10,63,184 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2021 మంది స్వీకరించారని, రాత్రి 7 గంటల 20 నిమిషాల వరకు మొత్తం 13,652 మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ,ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయిస్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

పరిశ్రమలకు వేగవంతంగా అనుమతులు: కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ, మే 30, ప్రభాతవార్త : జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు వేగవంతంగా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డిఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పారిశ్రామిక అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక చేయూత పధకాల అమలుపై సమావేశంలో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పెట్టుబడిదారులకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు, యంయంఎస్‌యంఈ పార్కులకు శంకుస్థాపన చేయటం జరిగిందని, వాటన్నిటినీ త్వరితగతిన పూర్తిచేసి పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వివిధ అనుమతులకు సంబంధించి సింగిల్‌డెస్క్ పోర్టల్ ద్వారా వస్తున్న ధరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ పారిశ్రామికి విధానాల కింద 26 క్లెయిమ్‌లకు రూ.3.48కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహాలను తాజాగా కమిటీ ఆమోదం తెలిపిందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో పీయంఈజీపీ, పియం విశ్వకర్మ పధకాల అమలులో పురోగతిని కమిటీలో చర్చించి ధరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు దిశానిర్దేశం చేసారు. ఈసమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి యం.మధు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ బాబ్జీ, వాసిరెడ్డి మురళీకృష్ణ(ఫ్యాప్సియా), కనకదుర్గ(ఎలీప్), యం.సుదర్శన్(డిఐఏ), ఎల్‌డియం వెంకటసుబ్బయ్య,డ్రగ్స్ డిపార్ట్‌మెంట్ ఏడి శ్రీరామ్మూర్తి, డిఆర్‌డిఏ పిడినాంచారయ్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యకు మహర్దశ

సొంత నిధులతో విద్యార్థులకు ప్రోత్సాహకాలు

200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేసిన మంత్రి సవిత

గుంటూరు మే 30 ప్రభాత వార్త ప్రతినిధి :

విద్యతోనే అత్యున్నత స్థానాలు సాధ్యమని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని, ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాలే దీనికి నిదర్శమని అన్నారు. తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. గుంటూరు నగరంలోని దేవరసాయి కృష్ణ కల్యాణ మండపంలో టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 104 మంది కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గీయ విద్యార్థులకు ఉమ్మడి గుంటూరు కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్త కనకదాస పేరుతో ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కారాలు మంత్రి సవిత శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు కుల సంఘాలు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యలో రాణిస్తున్న పేద విద్యార్థులకు ఈ సత్కారాలు మరింత ప్రోత్సాహమిస్తాయన్నారు. ఏపీలో విద్యా వ్యవస్థను రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అత్యున్నత స్థానాలకు తీసుకెళుతున్నారన్నారు. గత పాలనలో భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థను ఆయన గాడిన పెడుతున్నారన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు ముందు వందరోజుల ప్రణాళికలు అమలు చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో ఆయన కృషి మెచ్చుకోదగినదన్నారు. తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు, సన్నబియ్యంతో భోజనం, నాణ్యమైన విద్య ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందుతున్నాయన్నారు. బీసీ గురుకులాలు, బీసీ హాస్టళ్లలో ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కేవలం విద్యతోనే సరిపెట్టకుండా, క్రీడల్లోనూ ప్రోత్సహించేలా బీసీ గురుకులాల్లో స్పోర్ట్స్ కిట్లు అందజేయబోతున్నామన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల మనోభావాలకు గౌరవమిస్తూ, ఉన్నత విద్య చదివేలా ప్రోత్సహించాలన్నారు.

104 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యలో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన 104 మంది విద్యార్థులకు భక్త కనకదాస పురస్కారాలను మంత్రి సవిత అందజేవారు. రూ.3.30 లక్షల విలువ చేసే నగదు ప్రోత్సాహకాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. టెన్త్ తో పాటు సెకండ్ ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ ప్రోత్సాహకాలు అందజేశారు. టెన్త్, సెకండ్ ఇంటర్ లో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గంలో మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన 20 మంది టెన్త్, ఇంటర్ విద్యార్థులకు రూ.3 వేల చొప్పున రూ.30 వేలు అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన 20 మంది విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున రూ.40 వేలు అందజేశారు. మరో 120 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున రూ.లక్షా 20 వేలు ప్రోత్సాహక నగదు రూపంలో అందజేశారు. అత్యుమ్మ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంతంగా రూ.లక్ష నగదు, 200 స్కూల్ బ్యాగ్ లను మంత్రి సవిత అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ లో, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన నలుగురు విద్యార్థులకు రూ.25 వేల చొప్పున రూ.లక్ష లను మంత్రి సవిత తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. 200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లు పంపిణీ చేశారు.

వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతం

గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల

విజయవాడ, మే 30, ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా గ్రంధాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు విజయవంతం అయ్యాయని రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు తెలిపారు. విజయవాడ బందర్‌రోడ్డులోని ఠాగూర్ గ్రంధాలయంలో వేసవిశిక్షణా కార్యక్రమాన్ని శనివారం చైర్మన్ పరిశీలించారు. ఈసందర్బంగా శిక్షణ పొందుతున్న చిన్నారులతో ముచ్చటించి శిక్షణ శిబిరంలో నేర్పుతున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రంధాలయల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలకు విద్యార్దుల నుండి విశేషస్పందన లభించిందన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకతను, క్రమశిక్షణను పెంపొందించేందుకు ఈశిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ఈశిబిరాల్లో విద్యార్దులు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, కళలు, సాంస్కృతిక అంశాలు, వివిధ నైపుణ్యాలను నేర్చుకుంటున్నారని వివరించారు. ఈశిబిరాలకు హాజరవటం ద్వారా విద్యార్దులు మొబైల్ వాడకం తగ్గించి పుస్తకపఠనం వైపు దృష్టి సారిస్తున్నారన్నారు.

శిక్షణ పొందుతున్న చిన్నారులతో గ్రందాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు తదితరులు

ఈకార్యక్రమంలో కృష్ణాజిల్లా గ్రందాలయ చైర్మన్ యం.ఎస్.బేగ్, గ్రంధాలయ అధికారి కే.రమా దేవి, గిన్నీస్‌బుక్‌లో స్థానం పొందిన కుసుమ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఓ హోటల్‌లో డాలర్లు మాయం

తిరుపతి,మే 30ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు వచ్చిన ఓ భక్తకుటుంబం తిరుపతిలోని ఓ హోటల్ గదిలో దిగారు. శుక్రవారం ఉదయం గది నుండి కుటుంబంతో కలసి తిరుమలకు వెళ్ళారు. శ్రీవారి దర్శనార్థం తిరిగి గదికి రావడంతో డాలర్లు లేకపోవడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఏకంగా వెయ్యిడాలర్లు కనిపించలేదని పోలీసులను ఆశ్రయించారు. తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మారస సరోవరం హోటల్ రూమ్ నెంబర్ 1017 లో ఈ ఘటన జరిగింది. సింగపూర్ నుండి శ్రీవారి దర్శనానికి వచ్చిన ఎన్నారై ఆర్ముగం కుటుంబం శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి హోటల్ వచ్చి చూసుకోగా లాకార్స్‌లో ఉంచిన వెయ్యి డాలర్స్ మాయమయ్యాయి. దీంతో హోటల్ సిబ్బందిని అడిగినా ఫలితం లేకపోయింది. బాధితుడు ఆర్ముగం అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నమోదు చేసి విచారిస్తున్నారు. అలిపిరి ఎస్ఐ దుర్గాప్రసాద్ హోటల్ సిబ్బందిని విచారణ చేస్తున్నారు.

పాలకమండలి సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

ఇంద్రకీలాద్రి, మే 30, ప్రభాతవార్త : దుర్గమ్మవారి ఆలయానికి సంబంధించిన పలు టెండర్లను శనివారం జరిగిన పాలక మండలి సమావేశంలో ఆమోదించారు. అప్పగించిన తేదీనుండి 2027 మార్చి 31 వరకు ఆలయంలో పూలు, పూలదండలు టెండర్, ఉభయదాతలు, భక్తులకు, విఐపిలకు అందించే వస్త్ర ప్రసాదం టెండర్, కొండపైన, క్రింద టోల్‌గేట్ టెండర్, అన్నదాన, ప్రసాదాల విభాగంలో ఖాళీడబ్బాలు, గోనె, ప్లాస్టిగ్ సంచుల కొనుగోలు టెండర్, కొండపైన యాగశాల వద్ద రు.9,75,000లతో రిటైనింగ్ వాల్ టెండర్, చైర్మన్ చాంబర్ అభివృద్ధి పనుల టెండర్, పలు అభివృది పనులకు రు.40 లక్షల టెండర్, 4 ఎసి బస్సుల టెండర్, దుర్గమ్మవారి ఆలయ దత్తత దేవాలయం తాడేపల్లిలోని శ్రీమద్వీరాంజనేయ స్వామి సమేత కోదండరామస్వామి దేవస్థానంలో 2 సంవత్సరాల తాత్కాలిక పార్కింగ్ లైసెన్సు, జమ్మిదొడ్డి అతిథిగృహంనందు హెచ్‌టి సర్వీస్ ఏర్పాటుకు టెండర్, ఎలక్ట్రిక్ మెటీరియల్ సప్లై టెండర్, క్యూలయిన్ల ఏర్పాటు టెండర్, కేశఖండనశాల, కనకదుర్గానగర్, మహామండపం వరకు పలు అభివృద్ధి కార్యక్రమాల టెండర్, మహామండపం లిఫ్టుల వద్ద నుండి నూతన అన్నదాన భవనం వరకు ఆర్‌సిసి డ్రైన్ ఏర్పాటుకు, కనకదుర్గానగర్‌లో టాయిలెట్ల ఆధునీకరణ టెండర్, కొండ దిగువన పలు ఆర్చిగేట్ల అమరిక టెండర్, శ్రీ అమ్మవారికి సమర్పించే పట్టుచీరెలు, సాధారణ చీరెలు, పలు రకాల రవికె ముక్కలు, వివిధ వస్త్రాలను తీసుకుని విక్రయించుకునే లైసెన్సు ఆమోదం, ఓం టర్నింగ్ వద్ద రు.46లక్షలతో ఆర్‌అండ్ వారిచే రోడ్డు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఆలయంలో ఎలక్రిక్, ట్రాన్స్‌పోర్టు, కంప్యూటర్లు, ఓల్డ్‌టివిలు, పాత అంబులెన్స్, వాహనములను కొనడానికి వేలం పాడుకున్న మణికంఠ కు పాట లీజు ఆమోదం తెలిపారు. దేవస్థానం స్థలం 1.98 సెంట్లు ఖాళీగా వున్న భూముల లీజు ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. 2026 మార్చి వరకు ఆదాయ వ్యయాల వివరాలు పరిశీలించి ఆమోదించారు. మొవ్వగ్రామం, పునాదిపాడు ల్లో కౌలుకు ఇవ్వడానికి నిర్వహించిన వేలం ఆమోదించారు. దేవస్థానం కొండ దిగువన వున్న 1395 గజాల గోశాల స్థలాన్ని భూసేకరణ ద్వారా తీసుకోడానికి ఆమోదించారు. ఈ పాలకమండలి సమావేశంలో ఇవో వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య నిరాజనం: దుర్గమ్మవారి ఆలయంలో శనివారం విజయవాడకు చెందిన ముద్ర కూచిపూడి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ నాట్య గురువులు భాగవతుల శైలజ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని స్తుతి, పరమశివుని వైభవాన్ని, తాండవం, అయిగిరి నందిని, ముద్దుగారే యశోద తదితరాలకు కళాకారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి.

నేడు పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ: దుర్గమ్మవారు వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ మే 31తేదీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఉదయం 5.30 లకు ఘాట్ రోడ్ శ్రీ కామధేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభం అవుతుందని ఆలయ ఈవో శీనా నాయక్ తెలియజేసారు.

గొడ్డలి పార్టీలో పెరుగుతున్న అసహనం: సీఎం చంద్రబాబు

విజయవాడ,మే 30,ప్రభాతవార్తప్రతినిధి: గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. వైఎస్సార్సీపీ నెవ్వర్ ఎగైన్, ఎన్డీయే ఎగైన్ అండ్ ఎగైన్ అనేది కూడా ప్రజల నినాదంగా మారుతోందని వెల్లడించారు. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు తనకు కూడా కొన్ని తెలియవన్నారు. 30 ఏళ్ల క్రితమే కడప జిల్లాలో పాలెగాళ్ల రాజ్యంపై వేసిన పుస్తకాన్ని ఇప్పుడు అందరూ చదువుతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారని స్పష్టంచేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో తాజా రాజకీయ పరిణామాలపై చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. నక్సలైట్లు గన్ తో రాజ్యాధికారాన్ని సాధించలేరని చంద్రబాబు పేర్కొన్నారు. అలాంటిది వీళ్లు గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. హత్య రాజకీయాలు చేసిన వారు రాష్ట్రాన్ని పరిపాలించవచ్చు? కానీ బాధితులు మాత్రం జిల్లా రాజకీయాలు చేయకూడదన్నట్లుగా? వీరి సిద్ధాంతం ఉందని విమర్శించారు. వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉందన్నారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని తెలిపారు. సునీత పోరాటం కారణంగానే ఇప్పటికీ వివేకా హత్య కేసు సజీవంగా ఉందని చెప్పారు. నేటి తరానికి కూడా వీళ్ల హత్య రాజకీయాలు తెలుస్తున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంతకుముందు చంద్రబాబు ప్రాంతీయ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో మైండ్ గేమ్ ఆడే గొడ్డలి పార్టీ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ, వారి కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు.

పునర్విభజన, మహిళ బిల్లులను విడదీసి చూడొద్దు: సీఎం చంద్రబాబు

మహానాడు విజయంపై పార్టీ కేడర్‌కు అభినందనలు తెలిపిన సీఎం

విజయవాడ,మే30,ప్రభాతవార్తప్రతినిధి: పునర్విభజన, మహిళ బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదని. ఈ రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ని టీడీపీ ప్రకటించడం దేశ రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందన్నారు. మహిళా రిజర్వేషన్లను అన్ని పార్టీలు స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. మొదటి నుంచీ మహిళలకు టీడీపీ అండగా ఉందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు. మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33 మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్లి అని అన్నారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు.

ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే..తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు.

టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33 మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్లి అని అన్నారు. డీలిమిటేషన్ విషయంలో 2011 జనాభా లెక్కలైనా, తాజా లెక్కలైనా మనకు నష్టం కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందుకే ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. పెంచిన స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారి ఆలోచన కూడా మారవచ్చని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు.రెండు బిల్లులను తీసుకురావడానికి కేంద్రం సిద్ధమవుతోందని, ఆ రెండింటినీ విడదీసి చూడాల్సిన అవసరం ఏముందని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లులు తప్పనిసరిగా తీసుకురావాలని, ఇవి దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

చంద్రబాబును కలిసిన ఆశావహులు

త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ క్రమంలో రేస్‌లో ఉన్న ఆశావాహులు చంద్రబాబును కలిసి తమకు అవకాశం పరిశీలించాలని కోరారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలోనూ, సచివాలయంలోనూ, పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చంద్రబాబు, లోకేశ్ ను కలిసి రాజ్యసభలో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇలా గత రెండు రోజుల్లో వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్ రావు, రెడప్పగారి శ్రీనివాసరెడ్డి, టీడీ జనార్ధన్, చింతకాయల విజయ్, తిప్పేస్వామి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

విహార యాత్రలో విషాదం..

నీటిలో మునిగి పిన్నమ్మ, కుమార్తె మృతి

ఉరవకొండ, మే 30 ప్రభాతవార్త: బక్రీద్ పండుగ విహార యాత్ర ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. అనంతపురం జిల్లా ఉరవకొండ మండల పరిధిలోని పి.కౌకుంట్ల గ్రామంవద్ద పీఏబీఆర్ (పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) వెనుక నీటిలో మునిగిపోయి అనంతపురం నగరం ఆజాద్‌నగర్‌కు చెందిన షేక్ ఫరీదా (35) ఆమె అక్క కుమార్తె షేక్ యాస్మిన్ (13) మృతి చెందారు. ఉరవకొండ ఎస్ఐ పి.జనార్ధననాయుడు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు బక్రీద్ పండుగ సందర్బంగా కుటుంబం అంతా ఒకచోట చేరింది. సరదాగా గడపడానికిగాను 9 మంది సభ్యులతో కూడిన కుటుంబం శనివారం ఉదయం ఆటోలో పీఏబీఆర్ డ్యాం చేరుకుంది. అక్కడే భోజనాన్ని తయారు చేయించుకొనడంలో నిమగ్నమయ్యారు. ఇంతలో బాలి షేక్ యాస్మిన్ డ్యాం చివరి నీటిలో ఆడుకొంటూ గుంతలో పడి మునిగిపోతుండగా అక్కడే ఉన్న పిన్నమ్మ షేక్ ఫరీదా ఆమెను రక్షించే క్రమంలో అదే గుంతలోపడి ఇరువురికీ ఈత రాని కారణంగా ఊపిరాడక నీటిలో పడి మునిగిపోయారు. కొద్ది సేపటి తరువాత ఇతర కుటుంబ సభ్యులు అక్కడి చేరుకొని ఇరువురిని బయటకు తీయగా వారు అప్పటికే మృతి చెందారు. మృతురాలు ఫరీదాకు భర్త దాదాపీర్, ఇద్దరు కొడుకులు ఉన్నారు. యాస్మిన్‌కు తండ్రి ఫరూక్, తల్లి కుర్శిద్, అక్క, తమ్ముడు ఉన్నారు. విషయం తెలియగానే ఉరవకొండ ఎస్ఐ పి.జనార్ధననాయుడు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించి బాలిక తల్లి కుర్శిద్ పిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇరువురి మృతదేహాలను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఇక్కడ పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

31skl13:31skl13.qxd 30-05-2026 22:46 Page 1

కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాటం

వీరఘట్టం, మే 30 ప్రభాతవార్త :

కార్మికుల సమస్యలు తెలుసుకుని నిరంతరం పోరాటం చేస్తుంది సిఐటియు అని జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌లో సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, కనీస వేతనం కూడా ఇవ్వటం లేదని, కాంట్రాక్టర్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి కూడా అదే విధంగా ఉందన్నారు. కార్మికుల హక్కులు కాల రాస్తున్నాయని పిఎఫ్, ఈఎస్ కూడా ఇవ్వటం లేదన్నారు. షాప్ ఎంప్లాయిస్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వలన రిజర్వేషన్ సౌకర్యం లేకపోవడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్మికులు సామాజిక న్యాయం కూడా కోల్పోతున్నారని, సేవ రంగంలో మహిళ శ్రమను కారు చౌకగా దోచుకుంటున్నారని, లేబర్ కోడ్ చట్టాన్ని తీసుకురావడం వలన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆమె అన్నారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ప్రసాద్, వై.ప్రసాద్, పి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ ఎన్.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా చేసిన టీడీపీ నాయకుడు

సంతబొమ్మాళి, మే 30 ప్రభాతవార్త :

సంతబొమ్మాళి మండలంలోని మూలపేటలో గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణంతో పరిసర ప్రాంతాలలో భూములు ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో ఎక్కడ ప్రభుత్వం స్థలాల కనబడితే చాలు ఆక్రమించి ఆ స్థలం తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ఇదే కోవకు చెందినదే నౌపడలో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ఇంత జరిగిన అధికారులు చర్యలు లేకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే మండలం నౌపడ-వెంకటాపురం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకొని నౌపడ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని స్థానిక టిడిపి నాయకుడు ఆక్రమణ చేశాడు. సర్వే నెంబర్ 386లో రోడ్డుకు ఆనుకుని ఉన్న సుమారు 6 సెంట్లు ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించుకున్నాడు. అంతటితో ఆగకుండా ఆక్రమించిన స్థలం చుట్టూ పొడవైన కర్రలను పాతారు. ఆక్రమించిన స్థలం విలువ ప్రస్తుతం మార్కెట్లో 50 లక్షలు వరకు పలుకుతున్నది. ఆక్రమించిన స్థలం పక్కనుండి ప్రతిరోజు రాకపోకలు సాగించే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. మూలపేట పోర్టుతో నౌపడలో భూములకు విలువ పెరగడంతో ప్రభుత్వ స్థలంపై కన్ను పడితే చాలు వెంటనే అధికార పార్టీ నాయకులు కబ్జాకు చేస్తున్నారు. ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఆక్రమణలు తొలగించాలని అధికారులు పలుమార్లు చెప్పిన సదరు టిడిపి నాయకుడు పట్టించుకోలేదు. మా ఆధీనంలో ఉన్న భూమి అని, దీనికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని సదరు టిడిపి నాయకుడు అధికారులకు చెబుతున్నాడు. పత్రాలు చూపించమని అధికారులు అడిగితే సదరు టిడిపి నేత ఇవ్వకపోవడం కొసమెరుపు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదర్శనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

రాజాం, మే 30 ప్రభాతవార్త :

ప్రజారోగ్య సంరక్షణ, ప్రభుత్వ వైద్య సేవలను బలోపేతం చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నిబద్ధతను ప్రదర్శిస్తూ, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖధికారిణి కె.రాణి ఆదర్శనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ పర్యటన సందర్భంగా కె.రాణి వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి, వైద్య, సహాయక సిబ్బందితో సంభాషిస్తూ ప్రజలకు అందిస్తున్న వైద్యారోగ్య సేవలు పనితీరు, రికార్డులు నిర్వహణ, మాతా, శిశు సంరక్షణ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వారికి అందిస్తున్న సేవలు, పరిశుభ్రత పాటించడం, రోగుల సంరక్షణ, అవసరమైన ఆరోగ్య సేవలను అందించడంలో సిబ్బంది కనబరుస్తున్న అంకితభావం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. సేవా భావంతో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించడం మరియు రోగి-స్నేహపూర్వక విధానానికి గాను డాక్టర్ ఉంగా కిరణ్ కుమార్ గారిని అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి ప్రత్యేకంగా అభినందించారు. పనితీరులో స్థిరత్వాన్ని కొనసాగించాలని మరియు ప్రజా ఆరోగ్య సేవల పంపిణీలో నిబద్ధతతో, నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు జవాబుదారీ తనాన్ని నిర్ధారించడం, సేవా ప్రమాణాలను మెరుగుపరచడం, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం పట్ల శాఖ యొక్క చురుకైన విధానాన్ని ప్రతిబింబిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జంప్ కృష్ణ మోహన్, సీనియర్ అసిస్టెంట్ - ప్రసాద్ రావు, సత్యారావు, చంద్రశేఖర్ రాజు, ల్యాబ్ టెక్నీషియన్ జె.సింహాచలం, స్టాఫ్ నర్సులు దేవి, రామలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాంబాబు, యల్ జి ఎస్ - సంతోషి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యువజన అధికారికి సన్మానం

ఇచ్ఛాపురం, మే 30, ప్రభాత వార్త:

శ్రీకాకుళం జిల్లా మై భారత్ జిల్లా యువజన అధికారి నమ్మలి కృష్ణని హంగీర్ బెహరా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.పుస్తకం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువత అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు , యువజన సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో హంగీర్ బెహరాతో పాటు తదితరులు పాల్గొని, యువజన సేవల పట్ల జిల్లా యువజన అధికారి చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్తులో యువత కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు

కోటబొమ్మాళి, మే 30, ప్రభాతవార్త :

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు - బోయిన రమేష్, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన సత్యశ్రీసివాస్ అన్నారు. శనివారం కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోగల - హడ్కోకాలనీలో ఇంటింటి తాగునీరు కొళాయిలను వారు ప్రారంభించారు. ప్రస్తుత వేసవిని దృష్టి పెంచుకొని ఎలాంటి త్రాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైన సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని వారు అన్నారు. సమస్యను పంచాయతీ ప్రత్యేక అధికారుల దృష్టిలో పెట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పంచాయతీ సిబ్బంది ప్రతిరోజు దీనిపై దృష్టి సారించి సమస్య ఏర్పడితే అక్కడకక్కడే పరిష్కరించాలని ప్రజలకు త్రాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు రానివ్వద్దని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్. రాంకుమార్, కొత్తమ్మతల్లి పాలక మండలి అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు కోరాడ గోవింద్, టి. కృష్ణారావు, దేవాది కృష్ణారావు, దేవాది సింహాద్రమ్మ, బి. పాడురంగరావు, గోపి, పంచాయతీ కార్యదర్శి చింతాడ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు టీడీపీ నేతలు పరామర్శ

కంచిలి, మే 30, ప్రభాతవార్త :

శనివారం కొల్లూరు పంచాయతీలో ఎఎస్ పల్లిలో గేదెల త్రినాధ్ భార్య కుమారికి ఆరోగ్యం బాగులేకపోవడం, అలాగే కొల్లూరు గ్రామంలో ఉదయాన జగ్గులు భార్య మరణం పొందడం, గుండం అయ్యగారు అల్లుడు చనిపోవడం ఆయా పంచాయతీల్లో తెలుగుదేశం నాయకులు వివిధ గ్రామాల్లో పరామర్శలు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటీడీపి కంచిలి మండలం అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, ఎక్స్ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, టీడీపీ ప్ర.కార్యదర్శి రామారావు, ప్రదీప్ భగీరది, సంజయ్, కామేష్ రెడ్డి రాముడు, ధర్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైస్సార్సీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల నియామకం

ఇచ్ఛాపురం, మే 30 ప్రభాతవార్త :

మండలంలోని పంచాయతీలను క్లస్టర్‌లుగా విభజన చేసి వైస్సార్సీపీ ఇన్‌ఛార్జ్‌లను నియమించినట్లు నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. పార్టీ కమిటీలు నిర్మాణం మరియు భవిష్యత్తులో కార్యక్రమాలకు సంబంధించి క్లస్టర్ ఇన్‌చార్జ్‌లకు తోడుగా సభ్యులను నియమించనున్నట్లు చెప్పారు. క్లస్టర్ 1 బూర్జపాడు, కేసుపురం, ఈదుపురంనకు నర్తు ప్రేమ్ కుమార్. క్లస్టర్ 2 ధర్మపురం, తులసిగాం, కొఠారినకు పిట్ట విశ్వనాధం. క్లస్టర్ 3 లొద్దపుట్టి, టి.బరంపురం, అరకభద్రనకు పిట్ట ఆనంద్. క్లస్టర్ 4 బొడ్డబొడ, పాయితారి, కీర్తిపురం, కొలిగాం, హరిపురంనకు వడ్డీన తేజ. క్లస్టర్ 5 బిర్లంగి, మశాకపురం, తెలుకుంచినకు బాకీ లక్ష్మినారాయణ. క్లస్టర్ 6 బాలకృష్ణాపురం, మండపల్లి, ముచ్చింద్ర, కేదారిపురంలకు బదకల మోహన్‌దాస్‌లను నియమించినట్లు చెప్పారు.

మెగా డీ.ఎస్సీ పారదర్శకంగా నిర్వహిస్తే విమర్శించడం తగదు

కోటబొమ్మాళి, మే 30, ప్రభాతవార్త :

వైసీపీ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వారు, నేడు పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేసిన కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు మండిపడ్డారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని చేపట్టి, వేలాది మంది నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిందని ఆయన పేర్కొన్నారు. ఏనాడు ఉద్యోగాల గురించి పట్టించుకోని వైసీపీ నేతలు, నేడు మెగా డీఎస్సీపై అవాస్తవ ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేశామని, నిరుద్యోగులు ఈ అపోహలను, అవాస్తవ ప్రచారాలను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్‌ను అంచలంచలుగా, ఎన్ని అవంతరాలు అవాంతరాలు ఎదురొచ్చిన అధిగమించి నెరవేర్చడం ఆశామాషి కాదని ఆయన అన్నారు. జరుగుతున్న అభివృద్ధికి సహకరించాలి తప్ప లేని తప్పులను ఎత్తిచూపడం సరికాదని గోవిందరాజులు హితవు పలికారు.

వైకాపా రాక్షస పాలనకు రెండేళ్లు

ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ 'కూన'

ఆముదాలవలస, మే 30 ప్రభాతవార్త:

గత వైకాపా రాక్షస పాలలకు రెండేళ్లు పూర్తయ్యావని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఏపీలో గత వైసీపీ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించి, 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', 'దీపం-2', 'ఆడబిడ్డ నిధి' వంటి పథకాల ద్వారా కోట్లాది మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల సంక్షేమం, రైతుల అభ్యున్నతి వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మరోవైపు వైసీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో చట్టవ్యవస్థ క్షీణించడంతో హత్యలు, దాడులు, రాజకీయ హింస పెరిగాయని విమర్శించారు. యువతలో నిరుద్యోగం పెరిగి, ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడం, బకాయిల చెల్లింపుల్లో జాప్యం, విద్యా రంగంలో నాణ్యత క్షీణించడం, పరిశ్రమల పెట్టుబడులు తగ్గిపోవడం వంటి అంశాలు కూడా వైసీపీ పాలన వైఫల్యాలుగా నిదర్శనం అన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం, మైనారిటీల అభివృద్ధి వంటి రంగాల్లోనూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సంక్షేమం, యువత ఉపాధి, రైతుల ఆదాయ వృద్ధి, మహిళల సాధికారత లక్ష్యంగా పని చేస్తోందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. గత వైకాపా పాలనలో జరిగిన నష్టాలను పూడ్చి, ఆంధ్రప్రదేశ్‌ను పురోగతి దిశగా తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే రవికుమార్ వెల్లడించారు.

ఫైనల్‌కి చేరిన మఖరాంపురం జట్టు

ఆముదాలవలస, మే 30 ప్రభాతవార్త:

ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చిరంజీవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఎమ్మెల్యే కప్ టి20 క్రికెట్ పోటీ సెమీ ఫైనల్‌లో శనివారం నరసన్నపేట జట్టుపై మఖరాంపురం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నరసన్న పేట జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 121 పరుగులకు మాత్రమే పరిమితమైంది. ఈ జట్టులో థామస్ 37 పరుగులు చేశారు. 122 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన మఖరాంపురం జట్టు 13 ఓవర్లలో 122 పరుగులు చేసి సునాయాస విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నారు. జూన్ 1వ తేదీన జరిగే ఫైనల్ మ్యాచ్‌లో సెమీఫైనల్ వన్‌లో విజయం సాధించిన ఇచ్ఛాపురం జట్టుతో మఖరాంపురం జట్టు తలపడనుంది. ఆమదాలవలస క్రికెట్ అసోసియేషన్ పరిధిలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలలో నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్ నేతృత్వంలో సోమవారం మఖరాంపురం ఇచ్ఛాపురం జట్లు మధ్య ఫైనల్స్ ఉంటాయని తెలిపారు. అనౌన్సర్‌గా ఈశ్వరరావు, అంపైర్‌గా సుదర్శన్, జగన్, క్రికెటర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎన్ఈఆర్ నివాసానికి మంత్రి సత్యకుమార్ యాదవ్

రణస్థలం, మే 30 ప్రభాతవార్త :

జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు నివాసానికి విచ్చేశారు. మంత్రిని సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే ఎన్ ఇ ఆర్ ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి ఎమ్మెల్యే తనయుడు, యువ నాయకుడు ఎన్.తేజ బాబు ఎచ్చెర్ల నియోజకవర్గ యువత కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎనఇఆర్ ప్రీమియర్ లీగ్ - మోదీ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను సందర్శించి క్వార్టర్ ఫైనల్స్‌ను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎచ్చెర్ల సమగ్ర అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఈశ్వరరావు చేస్తున్న కృషి ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ప్రశంసించారు. ఎమ్మెల్యే ఎనఇఆర్ ప్రజలకు ఎల్లప్పుడూ చేరువగా ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. యువతలో క్రీడా స్ఫూర్తి, సమైక్యతను పెంపొందించేందుకు ఎచ్చెర్ల నియోజకవర్గ యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఎన్ ఇ ఆర్ ప్రీమియర్ లీగ్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న ఎన్.తేజ బాబును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. యువత ప్రోత్సాహం పట్ల తేజ బాబు చూపుతున్న చొరవ ఆదర్శనీయమని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రజని ఎనఇఆర్, కూటమి నాయకులు పాల్గొన్నారు

సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సంతబొమ్మాళి, మే 30 ప్రభాతవార్త :

అధిక జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి ఆదివారం చాలా విశేషమైనటువంటి రోజున సూర్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు సుసరాపు శ్రీకాంత్ శర్మ తెలిపారు. ఈ ఆలయం లో ప్రతి ఆదివారం శ్రీ సూర్యనారాయణ స్వామివారి నమస్కారాలు, సూర్య మూల మంత్ర హవనం జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని పురోహితులు కోరారు. ఈ ప్రత్యేక పూజలు సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేయనున్న తీర్థప్రసాదాలు స్వీకరిస్తారని కోరుతున్నారు.

కళ్లి సోదరులకు సోదరి వియోగం

కోటబొమ్మాళి, మే 30, ప్రభాతవార్త:

కళ్లి సోదరులు, మాజీ ఏ.ఎం.సీ చైర్మన్ కళ్లి లక్ష్మణ్ రెడ్డి, కళ్లి నాగారెడ్డి సోదరి నక్క మహాలక్ష్మి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలు శనివారం ఉదయం గ్రామంలో నిర్వహించారు. ఆమె మృతి పట్ల ఆమె మేనల్లుడు మండల పార్టీ ప్రతినిధి కళ్లి శివారెడ్డి తోపాటు, స్థానికంగా పలువురు తెలుగుదేశం నేతలు కార్యకర్తలు అభిమానులు వారి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన గురునాథ్ రెడ్డి

రణస్థలం, మే 30 ప్రభాతవార్త:

జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆహ్వానం మేరకు నడుకుదిటిపాలెం ఆయన నివాసానికి శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఇఆర్ ఆధ్వర్యంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ను బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జీరు గురునాథ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి గురునాథ్ రెడ్డి కి సూచించారు. నాయకులు దారపు శ్రీను, నిద్రబంగి రాము, నిద్రబంగి ఆదినారాయణ, నిద్రబంగి రాము, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ కంచమ్మ తల్లి దేవస్థాన అభివృద్ధి కొరకు శ్రీకంచమ్మ తల్లి అమ్మవారి అజ్ఞాత భక్తులు 2,85,000 రూపాయలు విరాళంగా అందించారు.

ప్రభాతవార్త - కంచిలి

శ్రీకాకుళం వార్త

ఇరు వర్గాల కొట్లాట... ఎనిమిది మందిపై కేసు

కోటబొమ్మాళి, మే 30, ప్రభాతవార్త :

కిష్టిపురం గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎసఐ సత్యనారాయణ తెలిపారు. ఇరు వర్గాలు శనివారం రాత్రి కొట్లాటకు దిగారు. పాత కక్షలు, భూ వివాదం శనివారం రాత్రి చిలికి చిలికి గాలివానగా తయారైంది. ఇరు వర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ కొట్లాటలో ఇరు వర్గాలకు రక్త గాయాలు కావడంతో పరస్పరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వర్గానికి చెందిన బమ్మిడి చిన్నారావు, బమ్మిడి చంద్రమోహన్, బమ్మిడి కళావతి, బమ్మిడి చిన్నమ్మడులు పైన, అలాగే రెండవ వర్గం అయిన బొమ్మాలి లతమ్మ, గొంటి రామారావు, గొంటి చిరంజీవి, గొంటి ఎర్రమ్మ లు పైన స్థానిక ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి గాయపడ్డ వారిని స్థానిక సామాజిక ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఖాదీ క్లస్టర్‌తో కార్మికులకు మేలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ - పొందూరులో ఐదు ఎకరాల స్థల పరిశీలన

పొందూరు, మే 30 ప్రభాతవార్త :

ఖాదీ క్లస్టర్ ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఖాదీ కార్మికుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పొందూరులో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో క్లస్టర్ స్థాపన కోసం సర్వే నెంబర్ 310లో రెవెన్యూ అధికారులు గుర్తించిన ఐదు ఎకరాల స్థలాన్ని శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో ఖాదీ ఉత్పత్తుల తయారీ, ఆధునిక శిక్షణ కేంద్రాలు, మార్కెటింగ్ సదుపాయాలు అన్నీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నూతన స్థలంలో మౌలిక వసతులు, భవన నిర్మాణాలు పూర్తయినంతవరకు క్లస్టర్ తాత్కాలిక నిర్వహణను స్థానిక కామన్ ఫెసిలిటీ సెంటర్ భవనంలో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. 2017లో నిర్మించి నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని ఆయన పరిశీలించి, క్లస్టర్ నిర్వహణకు అనుగుణంగా రాబోయే రెండు వారాల్లో దీనిని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, పొందూరు పంచాయతీ ఈవో పి.జగదీష్, సాయిబాబా వీవర్స్ సొసైటీ మేనేజర్ వి.శ్రీనివాసరావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో సంస్కార భారతి విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి ర్యాంకులతో కళాశాలకు కీర్తి తీసుకొచ్చిన విద్యార్థులు

ప్రభాతవార్త - సోంపేట:

సోంపేటలోని సంస్కార భారతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహితమవుతున్న సంస్కార భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పీజీ సెట్-2026 ఫలితాల్లో విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. శుక్రవారం విడుదలైన పీజీ సెట్ ఫలితాల్లో కళాశాలకు చెందిన గండుపల్లి గీత (బోటనీ) 25వ ర్యాంకు, గున్న గాయత్రి (ఇంగ్లీష్) 56వ ర్యాంకు, సోమేశ్వర పాత్రో (ఫిజిక్స్) 95వ ర్యాంకు, మడ్డు కీర్తి (బోటనీ) 102వ ర్యాంకు, రంగాల శివాని (కామర్స్) 204వ ర్యాంకు, తాండ్ర వికాస్ (కెమిస్ట్రీ) 255వ ర్యాంకు, బల్లెడ శ్రీకన్య (బోటనీ) 387వ ర్యాంకు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఘన విజయంపై సంస్కార భారతి విద్యాసంస్థల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో), అధ్యా పకులు, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు.

పౌరాణికానికి గుర్తింపు .. ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

పలాస, మే 30 ప్రభాతవార్త :

ఆయనో ఉపాధ్యాయుడు, వృత్తి విద్యాబోధన అయినప్పటికీ, ఆయనొక కళాకారుడు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడైనప్పటికీ, తెలుగు సాహిత్యంపై ఆసక్తితో పౌరాణిక నాటకాల వైపు ఆకర్షితుడై, పౌరాణిక పద్యాలను అభ్యసించి అలవోకగా పాడగలడు. ఎంతో మంది గురువుల వద్ద పౌరాణిక నాటకాలలో శిక్షణ పొంది రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఒడిశా రాష్ట్రాలలో వందలకొలది పౌరాణిక నాటకాల ప్రదర్శనలలో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకుని మంచి గుర్తింపు పొందారు. శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు కణితి సూర్యనారాయణ మాస్టారు సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానం, శ్రీరామాంజనేయ యుద్ధం, లవకుశ వంటి పౌరాణిక నాటకాలలో స్త్రీ పాత్రలతో పాటు, ఎన్నో విభిన్న పాత్రలను పోషించి నేటికీ అనేక చోట్ల ప్రదర్శనలిస్తూ వారెవ్వా! అనిపించుకుంటున్నారు. ఇదే నేపథ్యంలో ఈ ఏడాది జూన్ నెలలో రాజమండ్రిలో నిర్వహించబడుతున్న ప్రపంచ తెలుగు మహాసభలకు చైతన్య సారస్వత పరిషత్ నుండి సూర్యనారాయణ మాస్టారుకు ఆహ్వానం అందడంతో ఆనందాయక విషయం.

మహాలక్ష్మమ్మ దేవాలయం దగ్గర గంగాహారతి

కంచిలి, మే 30, ప్రభాతవార్త :

శనివారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా కర్తలి గ్రామంలో మహాలక్ష్మమ్మతల్లి దేవాలయం దగ్గర గంగహారతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐటీడీపి కంచిలి మండలం అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, ఎక్స్ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, భగీరది, మోహన్, బర్తుడు రాముడు, రాజా కేశవ లోకనాథం గ్రామ పెద్దలు పూజ కమిటీ సభ్యులు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో చోరీ

రాజాం, మే 30, ప్రభాతవార్త :

రాజాం బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో చోరీ జరిగింది. విఆర్ఎల్ఏ బ్యాటరీలు 20, కాపర్ వైర్ ముక్కలు, మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు లోనికి చొరబడి పట్టుకొని వెళ్లినట్టు సబ్ డివిజన్ ఇంజనీర్ వెంకట ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారుగా వీటి విలువ 35 వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పట్టణ సీఐ అశోక్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా చేతి పంపు బోర్లుకు మరమ్మతులు కరువాయే!

సరుబుజ్జిలి, మే 30 ప్రభాతవార్త :

మండల కేంద్రం సరుబుజ్జిలి గ్రామంలో ప్రజా చేతి బోరులకు మరమ్మత్తులు చేయక గ్రామస్తులు త్రాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. మరమ్మత్తుల గూర్చి ఆయా సంబంధ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాధుడే లేక లబోదిబోమంటున్నారు. వేసవి ఎద్దడి అధికమవడంతో గ్రామస్తులు త్రాగునీటికై ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సర్పంచుల పదవి విరమణ జరిగిన తర్వాత ఆయా పంచాయతీ సచివాలయ సిబ్బంది వీధిలైట్ల గూర్చి మరియు చేతి పంపు మరమ్మత్తుల పనులు చేయాల్సి ఉండగా దానిని వారు పట్టించుకోవట్లేదు. తదుపరి చేతి పంపు బోర్లు మరమ్మత్తులు చేయకపోతే దానిపై తీవ్రమైన విపత్తులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

తీవ్రమైన ఎండ-వడదెబ్బపై ప్రజారోగ్య సూచనలు

సంతకవిటి, మే 30, ప్రభాతవార్త :

సంతకవిటి మండలం గారన్నాయుడుపేట గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలకు ఎఎనఎం రాకోటి హేమలత మరియు ఆశావర్కర్ కురిటి లక్ష్మీ ఓఆరఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తూ వడదెబ్బ నుంచి కాపాడుకోడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మొయ్య అప్పలనాయుడు, మేట్‌లు కనుగుల వసంత, కురిటి ధనం, కురిటి విశాలాక్షి, కనుగుల లత, కురిటి నాగరాజు పాల్గొన్నారు.

31 -5Pg9th cheli.qxd:31 -5Pg9th cheli.qxd 1/1/02 6:44 AM Page 1

రుచి మామిడితో రుచులు

మామిడిని మటన్‌తో మిక్స్‌చేసి మజారుచులను . రొయ్యలతో కలిపి వండి అదిరిందిరయో అనిపిస్తారు. ఇలా ఒక్కటికాదు..జిహ్వాకు పనిచేపే రుచులు మేళాలే జరుపుకొంటారు అందులో ఇవీ కొన్ని....

మటన్ కర్రీ

కావాల్సినవి : మామిడికాయ-ఒకటి, ఎముకతీసివేసి మటన్-అరకేజీ, ఆమ్‌చూర్‌పొడి-టీస్పూన్, పెరుగు-ముప్పావుకప్పు, పసుపు- టీస్పూన్, నూనె-నాలుగు టేబుల్ స్పూన్లు, ఆవాలు-టీస్పూన్, జీలకర్ర- టీస్పూన్, కరివేపాకు రెబ్బలు-పది, లవంగాలు-అయిదు, దాల్చిన చెక్క-చిన్నముక్క, పెద్ద ఉల్లిపాయలు-రెండు, అల్లం పేస్టు-టేబుల్‌స్పూన్, ధనియాల పొడి-టేబుల్‌స్పూన్, కారం-టేబుల్‌స్పూన్, గరంమసాలా-టీస్పూన్, ఉప్పు-తగినంత.

తయారీ : మటన్ ముక్కలకు పెరుగు, ఆమ్‌చూర్‌పొడి, పసుపు పట్టించి ఫ్రిజ్‌లోపెట్టాలి. మందపాటి గిన్నెలో నూనె పోసి వేడిచేసి ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, లవంగాలు, దాల్చినచెక్క వేయాలి. ఆవాలు చిటపటలాడాక ఉల్లిపాయలు వేసి గోధుమ రంగులోకి వచ్చేంతవరకు వేయించాలి. ఇప్పుడు మటన్ ముక్కలు, అల్లం పేస్టు వేయాలి. స్టవ్ మంట బాగా పెంచి బాగా వేయించాలి. తర్వాత ధనియాల పొడి, కారం, గరంమసాలా పొడి, మామిడికాయ ముక్కలు వేయాలి. వీటిని బాగా కలుపుతూ కొన్ని నిమిషాలు వేయించాలి. తర్వాత రెండు కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. ఇప్పుడు మంట తగ్గించి, మూత పెట్టి అరగంటపాటు లేదా మటన్ ముక్కలు మెత్తగా అయ్యేంతవరకు ఉడికించాలి. ఉప్పువేసి సన్నటి మంట మీద కూడ దగ్గరకు అయ్యేంతవరకు ఉంచాలి.

ఈ కూర అన్నం చపాతీల్లోకి బాగుంటుంది.

రొయ్యల వేపుడు

కావాల్సినవి : రొయ్యలు-అరకేజీ, తురిమిన మామిడికా-ఒకటి, ఉల్లిపాయలు-రెండు, పచ్చిమిర్చి- నాలుగు, కారం-రెండు టేబుల్‌స్పూన్లు, గరంమసాలా పొడి-టీస్పూన్, ధనియాల పొడిటీస్పూన్, పసుపు-టీస్పూన్, నూనె-మూడు టేబుల్ స్పూన్లు, ఉప్పు- సరిపడా.

తయారీ : రొయ్యలను శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. కడాయిలో నూనె పోసి వేడిచేసి ఉల్లిపాయ ముక్కలు వేసి గోధుమ రంగులోకి వచ్చేంత వరకు వేయించాలి. ఇప్పుడు రొయ్యలు వేసి ఎర్రగా వేయించాలి. తర్వాత పసుపు, కారం, ధనియాల పొడి, గరంమసాలా వేసి కాసేపు వేయించాలి. ఇందులో మామిడికాయ తురుము వేసి బాగా కలిపి పావుగంట సేపు ఉడికించాలి లేదా నూనె పైకి తేలేంతవరకు ఉంచాలి.

చికెన్ కూర

కావాల్సినవి : స్కిన్‌లెస్ చికెన్-కేజీ, ఉడికించిన మామిడికా గుజ్జు-కప్పు, పసుపు-టీస్పూన్, కారం-రెండు టేబుల్‌స్పూన్లు, ధనియాల పొడి6టీస్పూన్, జీలకర్ర పొడి టీస్పూన్, నూనె-నాలుగు టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి-ఆరు, చిన్న ముక్కలుగా కోసిన ఉల్లిపాయలు-రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- టేబుల్ స్పూన్, గరంమసాలా పొడి- టీస్పూన్, ఆమ్‌చూర్ పొడి-టీస్పూన్, ఉప్పు-తగినంత, కొత్తిమీర తురుము-టేబుల్‌స్పూన్.

తయారీ : గిన్నెలో మామిడికాయ గుజ్జు, పసుపు, కారం, జీలకర్ర, ధనియాల పొడి, గరంమసాలా పొడి, టేబుల్ స్పూన్ నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలకు బాగా పట్టించి రెండు గంటలపాటు పక్కన పెట్టాలి. మందపాటి గిన్నెలో మిగిలిన నూనె పోసి వేడిచేసి పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంతవరకు వేయించాలి. తర్వాత అల్లంవెల్లులి పేస్టు, మసాలా పట్టించిన చికెన్ వేసి మూతపెట్టి మధ్యస్థంగా ఉండే మంట ఈద పది నిమిసాల పాటు ఉడికించాలి. ఇప్పుడు అరకప్పు నీళ్లు పోసి ఇరవై నిమిషాల పాటు ఉడికించి నూనెపైకి తేలిన తర్వాత స్టవ్ కట్టేయాలి. చివరగా కొత్తిమీర తురుము వేయాలి.

అన్నం చపాతీల్లోకి ఈ కూర చాలా బాగుంటుంది.

పెసర పచ్చడి



కావాల్సినవి : మామిడికాయ ముక్కలు-ముప్పావు కప్పు, పెసరపప్పు-అరకప్పు, ఎండుమిర్చి-ఎనిమిది, జీలకర్ర-టీస్పూన్, బెల్లం-అర టీస్పూన్, ఉప్పు తగినంత.

తాలింపు కోసం: ఆవాలు-అర టీస్పూన్, మినపప్పు-అర టీస్పూన్, ఎండుమిర్చి-రెండు, ఇంగువ - చిటికెడు, కరివేపాకురెబ్బ- ఒకటి, నూనె టేబుల్ స్పూన్.

తయారీ : పెసరపప్పును తక్కువ మంట మీద ఎర్రగా వేయించి చల్లార్చుకోవాలి. అలాగే జీలకర్ర, ఎండుమిర్చిలను కూడా వేయించి,చల్లార్చాలి. ఇప్పుడు పెసరపప్పు; జీలకర్ర, ఎండుమిర్చిలను మిక్సీలో వేసి పొడి చేయాలి. తర్వాత మామిడికాయ ముక్కలు, ఉప్పు, బెల్లం వేసి కొద్దిగా నీళ్లు పోసి మిశ్రమంలా తయారుచేసుకుని పక్కన పెట్టాలి. ఇప్పుడు కడాయిలో నూనె పోసి ఆవాలు, మినపప్పు వేసి కాస్త వేగాక ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి కొనినన సెకన్లపాటు వేయించి స్టవ్ కట్టేయాలి. ఈ తాలింపును పచ్చడిలో వేయాలి. ఈ మామిడికాయ, పెసర పచ్చడి అన్నం, రోటీల్లోకే కాకుండా దోసెల్లోకీ బాగుంటుంది. ★

చిట్కా

- కొబ్బరి కాయను ఖచ్చితంగా మధ్యకు పగుల కొట్టాలంటే కాయను కాసేపు నీళ్ళలో వుంచి ఆ తర్వాత కొట్టి చూడండి.
- అరటిపండును మెత్తగాచేసి కాలిన ప్రాంతంలో లేదా గాయమైన ప్రాంతములో అద్దుటవలన బాధ త్వరగా తగ్గుతుంది.
- ఉదయాన్నే అరటిపండు తినుటవలన సుఖవిరోచనం అవుతుంది.
- అరటిపండు గుజ్జు పంచదార తేనె కలిపితింటే గుండెదడ తగ్గును.
- జామ ఆకులను మెత్తగా నూరి ముఖానికి రాసుకుంటే మొటిమలు పోతాయి.
- జామాకులను మెత్తగానూరి కట్టుటవలన కీళ్ళనొప్పులు తగ్గుతాయి.
- అల్లపు రసము పుచ్చుకొనిన కడుపునొప్పి తగ్గును □

ముఖ వర్చస్సుకే ఫేస్‌పీల్స్'!

చర్మం ప్రకాశ వంతంగా మారడానికి.. ముఖవర్ఛస్సు మరింతగా ఇనుమడించడానికి ఫేషియల్స్ వేసుకోవడం సహజం అయితే వాటితో పాటు అప్పుడప్పుడూ ఫేస్ పీల్స్ కూడా వేసుకుంటూ ఉండాలి. అయితే ఫేస్ పీల్స్ అనగానే.. పార్లర్‌కే వెళ్లక్కర్లేదు. ఇంట్లో లభ్యమయ్యే పదార్థాలను ఉపయోగించే అద్భుతమైన ఫేస్ పీల్స్ తయారుచేసుకుని, ముఖానికి వేసుకోవచ్చు. మరి, ఆ పదార్థాలేమిటో చూద్దాం.

కీరాదోస.. అరకప్పు కీరాదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇందులో ఉన్న కీరాదోస.. పిగ్మెంటేషన్ సమస్యను తగ్గించడంతో పాటు ముడతలు, సన్నని గీతలు వంటివి కూడా తగ్గముఖం పట్టేలా చేస్తుంది.

ఫైనాపిల్ /బొప్పాయి.. అరకప్పు ఫైనాపిల్ ముక్కలు, పావు కప్పు బొప్పాయి ముక్కలు తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. తర్వాత అందులో అరచెంచా ఆర్గానిక్ తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ఒసారి, చల్లని నీటితో మరో సారి ముఖాన్ని శుభ్రం చేసుకుని పొడి వస్త్రంతో తుడుచు కోవాలి.

అవకాడోతో.. బాగా గిలక్కొట్టిన కోడిగుడ్డులోని తెల్లసొనలో మెత్తగా చేసుకున్న అరచెంచా అవ కాడో, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. 20 నిమిసాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మంలోని తేమని అధిక సమయ నిలిపి ఉంచడానికి బాగా తోడ్పడుతుంది. ఫేస్ పీల్స్ వేసుకున్న తర్వాత ఎండలోకి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. లేదంటే ట్యాన్ సమస్య బారిన పడే అవకాశాలు ఎక్కువ. □

అంతర్వాణి

ప్రభువు ప్రేమకు చేరువగా ..!

ఓ పట్టణంలో జరుగుతున్న సంతకు మారుమూల గ్రామం నుంచి ఓ రైతు వచ్చాడు. ఆ సంతలో తను ఏద్దైన ఒక వస్తువును కొనాలనుకున్నాడు. అంతే కాదు ఆ వస్తువు తన గ్రామంలో ఎప్పుడూ, ఎవరూ చూడ నిదిగాను, వాడనిదిగా ఉండాలని అనుకొన్నాడు. ఆ సంతలో ఒక గొడుగుల దుకాణానికి వెళ్లాడు. ఆ రైతు గొడుగులను ఎప్పుడూ చూడలేదు. అతని గ్రామంలో కూడా ఎవరూ దాన్ని వాడలేదు. దాని గురించి తెలుసుకునేందుకు దుకాణం యజమానిని అడిగాడు 'ఇది ఏమిటి?' అని. షాపు యజమాని 'దీన్ని గొడుగు అని అంటారని.. ఇది వర్షానికి తడవకుండా సాయం చేస్తుంది'అని చెప్పాడు. బాగుందని చెప్పి రైతు ఓ గొడుగును కొన్నాడు. రాత్రికి తన గ్రామానికి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం గ్రామస్తులు అడిగారు ఆ వస్తువు ఏమిటని?. అందుకు రైతు 'ఇది గొడుగు, వర్షానికి తడవకుండా సాయం చేస్తుంది' అని చెప్పాడు. అందరూ దాన్ని చూసి ఆనందించారు. ఒకరోజు వర్షం రానేవచ్చింది. రైతు గొడుగును చంకలో పెట్టుకుని, వర్షంలో తడుస్తూనే ఇంటికి వచ్చాడు. అప్పుడు గ్రామస్తులు 'గొడుగు ఉంది కదా? ఎందుకు తడిసిపోయి వచ్చావు?' అని ప్రశ్నించారు. అందుకు రైతు ఇలా అన్నాడు.. గొడుగు వర్షంలో మనం తడవకుండా సాయం చేస్తుంది అని షాపు యజమాని చెప్పాడు. కానీ దాన్ని ఎలా వాడాలో చెప్పలేదన్నాడు. రైతుకు గొడుగు వాడకం తెలుసని షాపు యజమాని భావించి, దాన్ని ఎలా వాడాలో చెప్పలేదు అని అంటాడు. దీన్ని చదివి మనం నవ్వు కుంటాం కానీ దేవుడు కూడా మనల్ని చూసి ఇలాగే నవ్వుకుంటాడు. ఎందుకంటే క్రైస్తవులు 'యేసు క్రీస్తు' గొప్ప వాడు అని అంటారు కానీ తమకు మాత్రం కాదని భావిస్తారు. ఎందుకంటే వారు దేవుడి ప్రేమను అనుభవ పూర్వకంగా గ్రహించ లేదు. అందుకే దేవుడి వాక్యం ఇలాగ సెలవిస్తున్నది 'యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలిసికొనుడి, ఆయనను ఆశ్రయించునరుడు ధన్యుడు' (కీర్తనలు 34:8). దేవుడు అనంతుడు, సర్వశక్తి మంతుడు అంటారు. కానీ వ్యక్తిగతంగా మనకు నిజంగా శక్తి మంతుడు అనే అనుభవం ఉందా? అంటే దేవుడి ప్రేమను మాటల్లో కాదు చెప్పాల్సింది అను భవించి, గ్రహించాలి. ప్రతి ఒక్కరూ దేవుడి ప్రేమను అనుభవించాలి. అప్పుడే ప్రభువును మనస్ఫూర్తిగా ఆరాధించగలం.

- పి.వాణిపుష్ప

తెర

'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్

'మన డాక్టర్ బాబే' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లా ఉంటుంది టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శ్రీ స్కంద.. శరణ్యసుధీక్ష సమర్పణలో స్కంద ఫిల్మ్స్ బ్యానర్ మీద 'మన డాక్టర్ బాబే' అనే సినిమాని కృతాక్షి నిర్మిస్తున్నారు. ఈ మూవీతో శ్రీ స్కంద హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాకి చలపతి కుమార్ పువ్వల స్టోరీ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ.. 'మన డాక్టర్ బాబే' టీజర్ ఆద్యంతం వినోదభరితంగా ఉంది. ఇలాంటి మంచి కామెడీ సినిమాలు రావాలి. టైటిల్‌లో డాక్టర్, మన అని పదాలు అంటే కచ్చితంగా హిట్ అవుతుంటాయి. శ్రీ స్కంద మాట్లాడుతూ.. ..'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీలోని ప్రతీ ఒక్కరూ మన సినిమా అని అనుకుని ఎంతో సపోర్ట్ చేశారు. నటుడు అలీ మాట్లాడుతూ.. .'మన డాక్టర్ బాబే' సినిమాలో స్కంద చాలా చక్కగా నటించారు. చలపతి అందరి నుంచి మంచి నటనను రాబట్టుకున్నారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలి. దర్శకుడు చలపతి కుమార్ మాట్లాడుతూ.. 'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. వీఎన్ ఆదిత్య గారితో నాకు ఎన్నో ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. ప్రభు గారు, సురేష్ గారు నన్ను ఎంతగానో సపోర్ట్ చేస్తుంటారు. నిర్మాత కృతాక్షి మాట్లాడుతూ.. 'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా సినిమాకి అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాన్ను అని అన్నారు.విశ్వ కార్తికేయ మాట్లాడుతూ.. .. చలపతి నన్ను సోలో హీరోగా లాంచ్ చేశారు.'మన డాక్టర్ బాబే' కథ నాకు తెలుసు. ఈ చిత్రం ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది.

'చెన్నై లవ్ స్టోరీ' జూలైలో రిలీజ్

'చెన్నై లవ్ స్టోరీ' జూలైలో రిలీజ్'చెన్నై లవ్ స్టోరీ" మూవీ సాంగ్స్, జూలైలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న సినిమా హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన సాంగ్స్ మ్యూజిక్ లవర్స్ ఆదరణతో ఛాట్ బస్టర్స్‌గా మారుతున్నాయి. ఫస్ట్ సింగిల్ 'తొలి ప్రేమేం తోపు కాదే..' ఇప్పటికే హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకోగా, రీసెంట్ గా ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి చేతుల మీదుగా రిలీజ్ చేసిన సెకండ్ సింగిల్ 'వదలనే..'పాట కూడా ఇన్ స్టంట్‌గా సక్సెస్ అయ్యింది. ఇలా రిలీజ్ చేసిన ప్రతి పాట ప్రేక్షకుల ఆదరణ పొందుతూ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా మ్యూజికల్‌గా బ్లాక్ బస్టర్ జర్నీ చేస్తోంది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్య క్రమాలు ఫుల్ స్వింగ్‌లో జరుగు తున్నాయి. జూలైలో ఈ చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

'రిస్క్' ట్రైలర్ లాంచ్

సంపంగి,16 వంటి చిత్రాలకు చార్ట్ బస్టర్ మ్యూజిక్ అందించిన ఘంటాడి కృష్ణ స్వీయ సంగీత దర్శక నిర్మాణంలో రూపొందిన చిత్రం ఖిరిస్క్ఖి. సందీప్ అశ్వ, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. జూన్ రెండో వారంలో ఈ సినిమా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లా డుతూ.. రిస్క్.. టైటిల్ చాలా బాగుంది. హీరో సందీప్ మాట్లాడుతూ.. నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే చాలా ఇష్టం. యాక్టింగ్ అంటే ప్యాషన్. చిన్న చిన్న మ్యూజిక్ వీడియోలు, షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ ఇక్కడి వరకు వచ్చాను. వెండితెరపై నన్ను నేను చూసుకోవడానికి దాదాపు పదేళ్లు పట్టింది. దర్శకుడు ఘంటాడి కృష్ణ మాట్లాడుతూ.. నా ఆశ నా శ్వాస సంగీతం. 16మ సంపంగి వంటి చిత్రాల్లో నా పాటలతో ఎంతో మందికి దగ్గరయ్యాను. ఆ పాటల ద్వారానే ప్రేక్షకులు నన్ను గుర్తిసు_న్నారు. ఆ ప్రేమ నాకు చాలానే. దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. 30 ఇయర్స్ పృథ్వి మాట్లాడుతూ.. ఘంటాడి కృష్ణ ఎన్నో ఎవర్‌గ్రీన్ పాటలు అందించిన మ్యూజిక్ డైరెక్టర్. ఆయన పాటలు ఇప్పటికీ ప్రేక్షకులు వింటూనే ఉన్నారు. ట్రైలర్ చాలా అద్భుతంగా ఉంది. .మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ.. ఘంటాడి కృష్ణ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎన్నో మంచి పాటలతో మనందరినీ అలరించారు. ఇప్పుడు దర్శకుడిగా వస్తున్నారు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఆషు రెడ్డి మాట్లాడుతూ.. ఈ ట్రైలర్ చాలా క్యూరియాసిటీని కలిగించింది.

' టీఎఫ్‌సీసీ' షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్

' టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ - 2026' నిర్వహిస్తున్నాం : టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ జూన్ 13 వరకు ఉచితంగా ఎంట్రీలు పంపే అవకాశం జూన్ 21న హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో అవార్డుల ప్రధానోత్సవం చిత్ర పరిశ్రమలో కొత్త ప్రతిభను ప్రోత్సహించేం దుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్స వాన్ని పురస్కరించుకుని టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ వార్డ్స్ - 2026ను టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు.ఈ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదు. 5 నుంచి 25 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలింలను ఔత్సాహిక దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు పంపవచ్చు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నామని, ఇకపై ప్రతి ఏడాది దీన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో గుర్తింపు పొందిన పలువురు హీరోలు, దర్శకులు షార్ట్ ఫిలింల నుంచే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.టీఎఫ్‌సీసీ వైస్ ఛైర్మన్ గురురాజ్ మాట్లాడుతూ, కొత్త టాలెంట్‌ను వెలుగులోకి తీసుకురావడంలో డా.రామకృష్ణ గౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు ఛైర్మన్ అల్లా భక్షు మాట్లాడుతూ, ఇతర ఫెస్టివల్స్ భారీ ఎంట్రీ ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఉచితంగా అవకాశం కల్పించడం విశేషమని తెలిపారు.

'నేనెవరు?' అద్భుతమైన ప్రేక్షకాదరణ!

నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో, సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్య పాత్రల్లో యువ దర్శకుడు చిరంజీవి తన్నీరు రూపొందించిన సందేశాత్మక వినోదాత్మక చిత్రం'నేనెవరు?' మే 29న ప్రపంచవ్యాప్తంగా విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోందని చిత్ర నిర్మాతలు అండేకర్ జగదీష్ బాబు, సకినాన భూలక్ష్మి తెలిపారు. సినిమా విడుదలైన అన్ని ప్రాంతాల్లో ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని, అనేక కేంద్రాల్లో హౌస్‌ఫుల్ షోలతో ప్రదర్శిత మవుతోందని వారు వెల్లడించారు. ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ టాక్‌తో రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోందని, మరిన్ని కేంద్రాల్లో చిత్రాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్ చిత్ర యూనిట్‌ను అభినందించారు. 'నేనెవరు?' చిత్రానికి ప్రేక్షకులు ఇంత గొప్ప ఆదరణ అందించడం చాలా ఆనందంగా ఉందని, మంచి కథతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తుండటం సంతోషకరమని అన్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు సినిమాను ఆదరించడం తనకు మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. చిత్ర దర్శకుడు చిరంజీవి తన్నీరు, నిర్మాతలు అండేకర్ జగదీష్ బాబు, సకినాన భూలక్ష్మి, చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే సాయికిరణ్, జోగిని శ్యామల తమ పాత్రలతో ప్రేక్షకులను

ఆకట్టుకుంటున్నారని, సినిమాలోని భావోద్వేగాలు, సందేశాత్మక అంశాలు, కోర్టు సన్నివేశాలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నాయని చిత్ర యూనిట్ పేర్కొంది. దర్శకుడు చిరంజీవి తన్నీరు రూపొందించిన కథనం, చిన్నికృష్ణ అందిం చిన సంగీతం, నాయుడు ప్రసాద్ కొల్లి సినిమాటోగ్రఫీ, నందమూరి హరి తారకరామా రావు ఎడిటింగ్, శ్రీనివాస్ మాటలు, ఎస్.ఎస్. వీరు రాసిన పాటలు చిత్రానికి ప్రధాన బలాలుగా నిలిచాయని నిర్మాతలు తెలిపారు.

'హిట్ అండ్ రన్' ఫస్ట్ లుక్ రిలీజ్

క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లకు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఆడియెన్స్ డిఫరెంట్ కంటెంట్‌ను ఎక్స్‌పీరియెన్స్ చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రల్లో త్వరలో రానున్న చిత్రం 'హిట్ అండ్ రన్' శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్‌రెడ్డి అల్లం ఎంటర్టైన్మెంట్, శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు.ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్‌ను ఫినిష్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. సంజయ్ రావ్ పుట్టిన రోజు సందర్భంగా'హిట్ అండ్ రన్' సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సంజయ్ రావ్ ఇంటెన్స్ లుక్, ఆ గాయాలు, రక్తంతో నిండిపోవడం చూస్తుంటే'హిట్ అండ్ రన్' ఎంతో ఇంట్రెస్టింగ్‌గా ఉండబోతోందని అర్థం అవుతోంది.త్వరలోనే'హిట్ అండ్ రన్' టీజర్‌ను విడుదల చేయబోతోన్నారు. టీజర్ వచ్చిన తరువాత మూవీ మీద ఒక్కసారిగా అంచనాలు అమాంతం పెరుగుతాయని మేకర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

జూన్ నెలాఖరుకు కనీసం 8 వేల పనులు పూర్తి కావాలి

జలధార పనుల పై సమీక్షించిన కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విజయనగరం, మే 30 , ప్రభాతవార్త :

జలధార – జల హారతి కింద చేపడుతున్న పనులు వేగంగా పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి తెలిపారు. జూన్ నెలాఖరు నాటికి కనీసం 8 వేల పనులు పూర్తి కావాలన్నారు. శనివారం కలెక్టర్ జలధార పనుల పై మండల వారీగా సమీక్షించారు. జిల్లాలో జలధార కింద 12,305 పనులు మంజూరు కాగా 5 వేల పనులు ఇంతవరకూ ప్రారంభం అయినాయని, 1303 పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల వారీగా ఎన్ని పనులు మంజూరైనాయి. ఎన్ని ప్రారంభం చేశారు. ఎన్ని పనులు పూర్తయి నాయని ఆరా తీశారు. మంజూరైనవన్నీ వెంటనే ప్రారంభం కావాలని, ప్రారంభించిన పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. పనుల డైలీ రిపోర్ట్ పంపాలని డ్వామా పి.డి.కి సూచించారు. అలాగే నీటి పరిరక్షణ నిర్మాణాలను తనిఖీ చేయాలని, నీటి నిల్వల స్థితిని పరిశీలించాలన్నారు. ఉపాధి వేతన దారుల వేతనం పెరగాలని , ఉపాధి పనుల్లో వేగం పెరగాలని తెలిపారు. తాగు నీటి సరఫరా పై ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, ఆర్.డబ్ల్యు.ఎస్ మండల స్థాయి అధికారులు నీటి సరఫరా పై దృష్టి పెట్టాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. పరిశుభ్రమైన తాగునీరు అందకపోతే ఏదో ఒక నీరు తీసుకో వడం జరుగుతుందని, అలాంటప్పుడే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టా లని తెలిపారు. ఈటిసిలో ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ కవిత, దవమ పి.డి. శారదా దేవి, ఇరిగేషన్ ఈ ఈ రమణ, డి.డి.ఓలు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్ ఆదేశం

విజయనగరం, మే 30 , ప్రభాతవార్త:

జిల్లాలోని ఎస్.కోట మండల పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన "మెసర్స్ జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ " (ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ (మల్టీ యుటిలిటీ ఎంఎస్ఎంఈ పార్క్)) శంకుస్థాపనకు ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ సెక్రటరీ డాక్టర్ ఎన్. యువరాజ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన శనివారం అమ రావతి నుంచి జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్‌తో నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో పార్కుకు సంబంధించిన ప్రస్తుత ప్రగతి, భూసేకరణ, మౌలిక వసతుల కల్పనపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పార్కుకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక పార్కుకు సంబంధించిన ప్రస్తుత క్షేత్రస్థాయి పరిశీలన నివేదికను, సాధించిన పురోగతిని స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వివరంగా నివేదించారు. శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.

నీటి సరఫరా ప్రాజెక్టుకు ఎమ్మెల్యే భూమి పూజ

బొబ్బిలి మే 30 ప్రభాతవార్త:

సువర్ణముఖి నది నుంచి సుమారు 16 కిలోమీటర్ల మేర పైపులైను నిర్మాణం.బొబ్బిలినియోజకవర్గంలో, బొబ్బిలి పట్టణ ప్రజల తాగునీటి సమస్యను శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన) ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి నిధులు 123.9 కోట్ల మంజూరు చేయించడం జరిగింది.. నేడు ఉదయం స్వామివారి వీధిలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక రిజర్వాయర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా బొబ్బిలి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు తీరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ జుజు ఎస్.జ్యోతి , మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మాజీ చైర్మన్ రాంబర్కి శరత్ , వార్డు ప్రతినిధులు, టీడీపీ జనసేన నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

మెరకముడిదాం, మే 30. (ప్రభాతవార్త) :

మండలం సోమలింగాపురం వై జంక్షన్ నందు మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమము నకు సీనియర్ గ్రామీణ వైద్యులు శివ రాజు, భాస్కర్ రాజు ముఖ్య అతిథులుగా వచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సెంటర్లో ప్రతి ఒక్కరికి మజ్జిగ పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ ఏ ఎన్ శర్మ, ఎస్ గౌర్నాయుడు ధనుంజయ్ రమేష్, వై త్రిమూర్తులు, ఎంవి రమణ, సురేష్ దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఏడువొంపులగెడ్డ నిర్వహణకు ఓఅండ్ఎం నిధులు మంజూరు

రామభద్రపురం, మే 30, ప్రభాత వార్త:

కొండకెంగువ గ్రామస్తులు మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరాధించే "దేవుడుబాబు" ఆలయం లో సొంత నిధులతో అభివృద్ధి పనులు చేయించిన ఎమ్మెల్యే బేబీనాయన రామభద్రపురం మండలంలో ఏడువొంపులగెడ్డపై ఉన్న ఆనకట్ట నిర్వహణ మరియు అనుసంధానంగా ఉన్న చెరువుల నిర్వహణకు ఓ అండ్ ఎం నిధులు రూ12 లక్షలు మంజూరు చేయించి, ఈరోజు శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) చేతుల మీదుగా పనులు ప్రారంభిం చడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, ఏడువొంపులగెడ్డపై ఉన్న ఆనకట్ట నిర్వహణ లోపం వలన కనీసనిల్వ ఉండవలసిన నీరు ఉండడం లేదని అన్నారు.అలానే, ఏడువొంపులగెడ్డ కుడికాలువ నుంచి కంబాలచెరువు, అక్కడ నుంచి కొత్త చెరువు మరియు నిష్ఠల చెరువుకు వెళ్ళే నీటి మార్గాల మరమ్మత్తులు కూడా చేయనున్నట్లు తెలిపారు. మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ , మండలాఅధ్యక్షులు,దిక్కుసుచి అయిన కరణం విజయ భాస్కరరావు క్రొత్తు తిరుపతి , మడక తిరుపతిరావు , కనిమెరక శంకరరావు, గంటా సాయి, శివ, రామభద్రపురం మండల పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిడుగుల నుంచి పశువులను రక్షించుకోవాలి

పశు వైద్యాధికారిణి గాయత్రి

వేపాడ, మే30, ప్రభాతవార్త:

మండుతున్న ఎండల నుండి ప్రస్తుతం వాతావరణం మార్పు చెందడం వలన పిడుగులతో కూడిన వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించి పిడుగుల నుండి పశువులను రక్షించుకోవాలని మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ కోరాడ గాయత్రి కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ శాఖ వారి సూచనలకు అనుగుణంగా పశుపోషక కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. షెడ్లను ఎత్తయిన చెట్లు, విద్యుత్ తీగలకు, స్థంభాలకు, ట్రాన్స్ ఫార్మర్లకు దగ్గరగా లేకుండా చూడాలన్నారు. ఏదైనా పశువు పిడుగుపాటుకు గురైయినప్పుడు తక్షణమే సమీప పశువైద్యుని సంప్రదించాలని ఆమె కోరారు.

గాయత్రి కాలనీలో కార్డెన్ సెర్చ్

రాజాం, మే 30, ప్రభాతవార్త :

రాజాం టౌన్, గాయత్రి కాలనీ నందు విజయనగరం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు మేరకు, చీపురుపల్లి డి.ఎస్.పి. ఎస్.రాఘువులు సూచనలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఎలాంటి పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలు 3 ఆటోలు సీజ్ చేయడమైనది. కార్యక్రమంలో రాజాం పట్టణ సిఐ అశోక్‌కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

కంచిలి, మే 30 ప్రభాతవార్త :

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి పట్టుబడినట్లు సోంపేట సిఐ బి.మంగరాజు విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. శనివారం ఉదయం ఒడిసా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా సోమంతపూర్ గ్రామానికి చెందిన సుమన్ విశ్వాస్ అనే వ్యక్తి నుండి ఝూర్సుగూడ లకన్పూర్ గ్రామానికి చెందిన అభినవ్ సింగ్ అనే వ్యక్తి త్రాగడానికి, అమ్మకం చేయడానికి 3.370 కేజీల గంజాయిని సిమెంట్ కవర్లో తెచ్చి సోంపేట రైల్వే స్టేషన్ పక్కనే గల రైల్వే క్వార్టర్స్ బీటీ రోడ్డుపై ప్రశాంతి రైలులో బెంగళూరు తీసుకెళ్లేందుకు వేచి ఉండగా కంచిలి ఎస్సై పి.పారినాయుడు చాకచక్యంగా అతనిని పట్టుకొని తనిఖీలు చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అతనిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి సోంపేట కోర్టుకు తరలించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాలపై, పిల్లలు నడవడికపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సిఐ సూచించారు. గంజాయి అక్రమ రవాణా చేసినట్లయినా, విక్రయించినట్లయినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రోగ్రాంకి స్కూటీపై మంత్రి

సాలూరు, మే 30, ప్రభాతవార్త :

సాలూరు పట్టణ మెంటాడ వీధిలో కమీషనర్ టిటి రత్నకుమార్ ఆధ్వర్యంలో శనివారం1ఇంకా 2 వార్డుల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించగా రాష్ట్ర మహిళా శిశు,గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ఇంధనం పొదుపు పాటిస్తూ స్కూటీపై వెళ్లి పాల్గొన్నారు. అంతేకాకుండా ప్రజలకు స్వచ్ఛతపై చైతన్యం కల్పించే భాగంలో అక్కడ వీధులు అలాగే కాలువలు చీపురు పట్టి శుభ్రం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతు రోజువారి వచ్చే చెత్తను ఇళ్ళ ముందు ఇంకా రోడ్లపై వేయకుండా నిర్దేశప్రదేశాలలో వేయాలని పలు సూచనలు చేశారు.అలాగే ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధ్యమని క్లారిటీ ఇచ్చారు.టిడిపి నాయకులు కొనిసి.చిన్ని, హర్షవర్ధన్,డబ్బి.కృష్ణ వరలక్ష్మి,మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ గారు మీకు దండం పెడతాం ఆదుకోండి

మంచినీటి దాహార్తిని తీర్చండి.. గిరిజనుల ఆవేదన

శృంగవరపుకోట,మే30,ప్రభాతవార్త :

కలెక్టర్ గారు మీకు దండం పెడతాం మంచినీటి కష్టాల నుంచి మమ్మల్ని ఆదుకోవాలంటూ మండలంలోని పక్కా కొండ ప్రాంతంలో ఉన్న దారపర్తి పంచాయతీ పల్లపు దుంగాడ గ్రామ గిరిజనులు శనివారం తమ ఆవేదన వ్యక్తం చేశారు.మంచినీరు లేక అరకొర చలమనీరును తాగుతున్నామని తెలిపారు.చలమనీరు తాగడం వలన విషజ్వరాలకు గురై ఆసుపత్రికి డోలీలో వెళ్లాల్సి వస్తుందన్నారు.కొన్ని చోట్ల కుళాయి ట్యాపులను అమర్చి బిల్లులు చేసుకుని అధికారులు తినేశారని కుళాయిల ద్వారా ఒక్క చుక్క నీరు కూడా రావడం లేదని గిరిజనులు ఆరోపించారు.మంచినీటి దాహార్తిని తీర్చాలని చేతులు జోడించి మంచినీటి బిందెలతో నిరసనలు వ్యక్తం చేస్తూ గిరిజనులు వేడుకున్నారు.కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె.గౌరీష్, అరుణ్ కుమార్,బాలయ్య, గంగులు, అప్పారావు,బీమన్న, గంగమ్మ,మహేశ్వరి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు మహిళామణులు సెల్యూట్ : మంత్రి

సాలూరు, మే 30, ప్రభాతవార్త :

ఈమధ్య మంగళగిరి పార్టీ కార్యాలయంలో జరిగిన హైబ్రిడ్ మహానాడు దిగ్విజయంగా జరిగిందని సుమారు 17 లక్షల మంది పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం ఉదయం మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతు దేశంలో ఏ పార్టీ చేయని విధంగా వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకి,ప్రతిపాదన చేసిన లోకేష్ కు మహిళా నేతలతో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే సాలూరు నియోజకవర్గంలో మహానాడు విజయవంతం చేసిన టీడీపీ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు మంత్రి తెలిపారు. టీడీపీ మహిళ మణులు కొనిసి వరలక్ష్మి,శోభారాణి, వైదేహి,శైలజ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు

పాచిపెంట, మే 30, ప్రభాతవార్త :

కార్మిక హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలవస్తున్నా యని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తెలిపారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా మండల కేంద్రమైన పాచిపెంట ఆర్టీసీ కాంప్లెక్స్ గాంధీ బొమ్మ ఆవరణలో శ్రామిక మహిళా నేత సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిఐటియు జండా ఆవిష్కరణ చేశారు. సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 1970 మే 30న స్థాపించబడిన సిఐటియు కార్మిక హక్కుల కోసం నిరంతరం సమరశీల పోరాటాలు నిర్వహించి భారత దేశంలో మొనగాడుగా నిలిచిందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జే రామయ్య కార్మిక సంఘాల నాయకులు ఏ నారాయణరావు భవన నిర్మాణ కార్మికులు బి తవుడు శ్రామిక మహిళలు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మహానాడు వేదికగా మహిళా రిజర్వేషన్‌కు బలమైన పునాది

ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గరుగుబిల్లి, మే 30, ప్రభాత వార్త:

సీతారాంపురంలో శుక్రవారం నాడు నిర్వహించిన పత్రికా సమావేశంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే శ్రీమతి తోయక జగదీశ్వరి మాట్లాడారు. మహానాడు వేదికగా మహిళా సాధికారతకు తెలుగుదేశం పార్టీ మరొకసారి బలమైన పునాది వేసిందని ఆమె పేర్కొన్నారు. మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన పార్టీగా తెలుగుదేశం పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే అన్నారు. మహిళా రిజర్వేషన్లు, మహిళలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించడంపై మహానాడులో తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. మహిళలకు రాజకీయ స్వేచ్ఛ, సముచిత స్థానం కల్పించాలనే సంకల్పంతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 12 లక్షల డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసి 1.12 కోట్ల మంది మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.

మహిళల భద్రతపై అవగాహన

గరివిడి, మే 30, ప్రభాత వార్త:

మండలంలోని శివరాం గ్రామ మహిళలు కి భద్రత పై గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వర రావు అవగాహన కల్పించారు. శనివారం రాత్రి గ్రామ ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించారు. మహిళలు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దొంగతనాలు ,సైబర్ క్రైం , రహదారి నిబంధనలు పై గ్రామస్తులు కి పలు సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజలతో ఎస్ఐ మమేకమై అనేక అంశాలపై అవగాహన కల్పించడంతో గ్రామస్థులు సానుకూలంగా స్పందించారు.

సారా తయారీ కేంద్రాలపై సంయుక్త దాడులు

కురుపాం, మే 30, ప్రభాతవార్త

నవోదయం 2.0 కార్యక్రమంలో అమలులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ బి.శ్రీనాథుడు ఆదేశములు మేరకు పార్వతీపురం మన్యం జిల్లా అసిస్టెంట్ ప్రొబిహిషన్ , ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సూపరింటెండెంట్ సంతోష్ ఆధ్వర్యంలో ఆంధ్రా – ఒడిస్సా సరిహద్దులో నాటు సారా తయారీ స్థావరాల గ్రామం లపై ఒడిస్సా పోలీస్ అధికారులతో కలిసి సంయుక్త దాడులు నిర్వహించినట్లు తెలిపారు .నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 16,000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని అలగే నాటు సారా బట్టిలలో తయారు చేసి డ్రమ్ములలో నిల్వఉంచిన 600 లీటర్ల నాటు సారాను కూడా అధికారుల సమక్షంలో ధ్వంసం చేశామనిన్నారు. పార్వతీపురం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ వి వి ఎస్ శేఖర్ బాబు, పాలకొండ బోర్డర్ మొబైల్ పార్టీ ఇన్స్పెక్టర్ వెంకట రాజు, పాలకొండ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, విజయనగరం ఎన్ఫోర్స్ మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరి సిబ్బంది, కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ జె. రాజశేఖర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.నాటు సారా పై సరిహద్దులో నిరంతర నిఘా పెడుతున్నామని , ఒడిస్సా పోలీస్ అధికారులు సహకారంతో ఆంధ్రా లో పెండింగ్ కేసుల్లో ఉన్న ఒడిస్సా ముద్దాయి లను కూడా త్వరలో అరెస్టు చేసి కోర్టు లో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.ఈ క్రమంలో ప్రజలు నాటు సారా తయారీ – రవాణా – అమ్మకాలు చేసే వారిపై ఫిర్యాదులు 6302936599 ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : తహశీల్దార్

శృంగవరపుకోట,మే30,ప్రభాతవార్త :



ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనువాసరావు తెలిపారు. బొడ్డవర గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ పదిలో 516జు హైవే రోడ్డుకు ఆనుకుని పది సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది.అదేవిధంగా ప్రహరీని ఏర్పాటు చేశారు.వచ్చిన పిర్యాదు మేరకు తహశీల్దార్ ఆధ్వర్యంలో శనివారం జేసీబీ సహాయంతో ప్రహరీ గోడను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హరి,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తప్పవు

రాజాం, మే 30 ప్రభాతవార్త :

రాజాం పురపాలక సంఘ పరిధిలోని వాసవినగర్ లేఅవుట్, సారధి రెవెన్యూ గ్రామం, సర్వే నెం. 25/7లో ఉన్న 18 సెంట్ల విస్తీర్ణం గల మున్సిపల్ స్థలంలో జరిగిన అనధికార ఆక్రమణలను తొలగించారు. సుమారు రూ.2 నుండి రూ.3 కోట్ల విలువ గల ఈ మున్సిపల్ ఆస్తి కొంతకాలంగా ఆక్రమణలో ఉండగా, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టి ఆక్రమణలను పూర్తిగా తొలగించారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

యోగా ద్వారా మానసిక ప్రశాంతత

శృంగవరపుకోట,మే 30, ప్రభాతవార్త:

యోగా ద్వారా మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుశీల తెలిపారు.శనివారం మండలంలోని సంతగైరమ్మపేట అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో కేంద్ర కార్యకర్తలు రెడ్డి అనిత,దొగ్గ లక్ష్మీ,కరక భవానీ, బాలలు, తదితరులు పాల్గొన్నారు.

అలజంగి పంచాయతీ స్థల వివాదంపై తప్పుడు కథనాలు వద్దు

బొబ్బిలి, మే 30, ప్రభాతవార్త :

మండలంలో అలజం గ్రామానికి చెందిన పంచాయితీ కి ఒక పత్రికలో వచ్చిన కథనం అవాస్తవం అని అలజంగి గ్రామంలో ఉన్న జనసేన వైసిపి టిడిపి నాయకులు తీవ్రస్థాయిలో ఖండించారు. గ్రామంలో ఉన్న కొందరు స్వార్ధ రాజకీయాలకు లబ్ది పొందాలని ఆ స్థలంలో ఉన్నవారికి తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. 25 సంవత్సరాలు క్రితం రాపాకు జ్యోతి నాయుడు కి గ్రామపంచాయతీ స్థలాన్ని నివాసం ఉండేందుకు తాత్కాలిక ఇవ్వడం జరిగింది. ఆయన చనిపోయిన తర్వాత కూడా తన భార్యకు జగనన్న కాలనీలో స్థలము మంజూరు చేసి బిల్లు కూడా పెట్టడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి తదితరులు తెలియజేశారు. ఈ వివాదంపై ఎమ్మెల్యేకు ఏ విధమైన సంబంధం లేదని పత్రికలో అసత్య ప్రచారాలు చేస్తే వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలియజేశారు. వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు వైసీపీ జనసేన టిడిపి పార్టీని ముక్తకంఠంతో పత్రిక రాసిన కథనంపై నిరుచుకుపడ్డారు

ప్రాణాలు తీసినా... భూములు ఇవ్వం

స్పష్టం చేసిన భోగాపురం పరిధిలోని రైతులు

భోగాపురం, మే 30,(ప్రభాతవార్త):

మా ప్రాణాలు తీసిన ప్రభుత్వానికి ఒక సెంటు భూమి కూడా ఇచ్చేది లేదని భోగాపురం పరిధిలోని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు ముంజేరు గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవిని శనివారం భోగాపురం పంచాయితీ, అనుబంధ గ్రామాల రైతులు మరియు రైతుకూలీలందరూ కలిసి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 30ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పడాల శ్రీనివాసరావు, వరుపుల సుధాకర్, జగ్గపు రవి, గుండు దిలీప్ కుమార్, వరుపుల గిరి మరియు వందలాదిమంది రైతులు పాల్గొన్నారు.

పీజీ సెట్ పలితాల్లో స్టేట్ ఫస్ట్ సాధించిన రంగరాయపురం విద్యార్థి

లక్క వరపు కోట, మే 30, ప్రభాత వార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా డిగ్రీ అనంతరం పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేందుకు నిర్వహించే పి జీ సెట్ 2026 ఫలితాల్లోఎల్ కోట మండలం లోని రంగారాయ పురం గ్రామంకి చెందిన పిల్లా నీలిమ కెమికల్ సైన్స్ విభాగంలో పరీక్షలకు హాజరు అయ్యి శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో 100 మార్కులకు గాను 97 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ సాధించింది ఈమె డిగ్రీ వరకు ఎస్ కోట లో గల వివేకానంద డిగ్రీ ఒ పి జీ కాలేజీ లో చదివినట్లు నీలిమ తండ్రి తెలిపారు తండ్రి పిల్లా సత్యా రావు తల్లి లక్ష్మి లు పూర్తి రైతు కుటుంబం కి చెందిన వారు తండ్రి కొంత వరకు చదువు కున్నారు అయినా వ్యవసాయం చేస్తూ రైతు గా జీవిస్తూ కూతుర్ని ఉన్నత చదువులు చదివించాలి అనే తపన తో నీలిమను డిగ్రీ వరకు చదివించారు తల్లి దండ్రుల ఆశకు తగ్గట్టు గానే నీలిమ చదవడమే కాకుండా ఇప్పుడు పి జీ సెట్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ లో కెమిస్ట్రీ విభాగం లో స్టేట్ ఫస్ట్ తెచ్చుకుని ఇటు కన్న వారికీ అటు వున్న ఊరు కి పేరు తేవడం పట్ల తల్లి దండ్రులు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఈ సందర్భంగా గ్రామస్తులు నీలిమ కి అలాగే తల్లి దండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు ఇలాగే ఉన్నత చదువు చదివి ఉన్నత స్థాయి లో నిలవాలి అని అందరం కోరుకుందాం

జరజాపుపేటలో తాగునీటి సమస్యపై వినతి పత్రాలు

నెల్లిమర్ల, మే 30, ప్రభాతవార్త :

ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఎంఎల్ఏ లోకం నాగ మాధవి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించి నియోజకవర్గంలోని ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపు పేటకు చెందిన తెలుగుదేశం, జనసేన, వైసిపి నాయకులు ఉమ్మడిగా ఆ గ్రామ తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జరజాపుపేట నాయకులు సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, ఎం ఎం నాయుడు, కాళ్ల రాజశేఖర్, కింతాడ కళావతి, జన ప్రసాద్, తుమ్ము వెంకటరమణ, అవనాపు మురళీకృష్ణ, సముద్రపు సత్తిబాబు, కనకల పద్మనాభం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

భోగాపురం, మే 30, (ప్రభాతవార్త):

నెల్లిమర్ల నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పేర్కొన్నారు. మండలంలోని ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నాగమాధవి శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా భోగాపురం భూసేకరణ సమస్యలపై బాధిత రైతులు, అలాగే పేరాపురం, వెంపడం, సిహెచ్ అగ్రహారం ఆయుష్ కేంద్రాలను రెల్లివలస పీహెచ్సీలో విలీనం చేయవద్దని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. వీటితోపాటు రెవెన్యూ, పెన్షన్లు, దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ సమస్యలపై ఆర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పకడ్బందీగా పుస్తకాలు పంపిణీ జరగాలి : డీఈవో

వీరఘట్టం, మే 30 ప్రభాతవార్త :

పుస్తకాలు పంపిణీ పకడ్బందీగా జరగాలని, ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలతో ముందుకెళ్లా లని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టాక్ పాయింట్‌కు చేరుకున్న ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు గల ఎన్.టి బుక్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొదటి విడత 17,313 మరియు రెండో విడత 3,076 మొత్తంగా 20,389 ఎన్.టి బుక్స్ రాగా వాటిని పాఠశాలల వారీగా ప్యాకింగ్ పని జరుగుతుందని ఎంఈఓ ఆనందరావు డీఈఓకు వివరించారు. పాఠశాలలకు రోలు ప్రాప్తికి అన్ని ఎన్.టి బుక్స్‌ను సకాలంలో చేరవేయాలని బ్రహ్మాజీ సూచించారు. బుక్స్ సార్టింగ్ పనిలో ఉన్న ఎం.ఆర్.సి సిబ్బంది మరియు సి.ఆర్.ఎం.టి.ఎస్ లకు పలు సూచనలు చేశారు. ఒకటవ తరగతి అడ్మిషన్స్ శతశాతం జరగాలని, అలాగే 2వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల నిలుపుదల శత శాతం ఉండాలన్నారు. బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రోత్సాహకాలను, క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వ పాఠశాలలో జాయినింగ్స్‌ను పెంచాలన్నారు. ఇందుకు అందరూ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉండాలని, ఇందుకు అందరూ అంకుఠిత దీక్షతో పనిచేయాలన్నారు.

31-05pg10.qxd:31-05pg10.qxd 1/1/02 6:59 AM Page 1

అహ్మదాబాద్‌లో ఐపిఎల్ మహా సమరం

ఆర్సీబీ-గుజరాత్ టైటాన్స్ ఫైనల్ ఫైట్ * రెండో కప్ కోసం అమీతుమీ

రెండు నెలలకు పైగా క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ చివరి అంకానికి చేరుకుంది. ఎన్నో మలుపులు.. మరెన్నో ఉత్కంఠ మ్యాచ్‌లు.. టాప్ జట్లు ఢీలా, అంచనాలు లేని జట్లు ముందంజ.. హీరోలనుకున్న ప్లేయర్లు ఫట్ అయితే.. అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు హిట్టయ్యారు. అయినా అనుభవందే ప్లస్ అయింది.ఇప్పుడు ఫైనల్ సమరానికి ఐపీఎల్ రెడీ అయింది. 10 జట్ల నుంచి రెండు జట్లు పోరుకు చేరిన ఫైనల్లో ఎవరు దుమ్మురేపుతారు? డిపెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ వరుసగా రెండోసారి కప్ అందుకుంటుందా? సొంతగడ్డ, సొంత అభిమానుల ముందు గుజరాత్ టైటాన్స్ ట్రోఫీతో మురిపిస్తుందా? అన్న ఉత్కంఠ నెలకొంది.

అహ్మదాబాద్, మే 30: ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026 తుది అంకానికి సమయం ఆసన్నమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా పేరొందిన అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం రాత్రి 7.30 గంటలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ పోరు జరగనుంది. సీజన్ మొత్తం ఆధిపత్యం చాటిన రెండుజట్లు చివరి అడుగులో ట్రోఫీ కోసం తలపడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి తారాస్థాయికి చేరుకుంది. లీగ్ దశలో అత్యంత స్థిరమైన ఆటతో అగ్రస్థానంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై భారీ విజయంతో మానసిక ఆధిక్యం సాధించింది. మరోవైపు ఆ ఓటమి తర్వాత తేరుకున్న గుజరాత్ టైటాన్స్.. క్వాలిఫయర్-2లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసి ఫైనల్ చేరింది. హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రయోజనం గుజరాత్‌కు కలిసివస్తుండగా, సమతూకమైన జట్టుతో బెంగళూరు ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

అహ్మదాబాద్ పిచ్ బ్యాటర్లకు స్వర్గం

నరేంద్ర మోదీ స్టేడియం పిచ్ సాధారణంగా బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌లో ఇక్కడ 200కుపైగా స్కోర్లు పలుమార్లు నమోదయ్యాయి. అయితే కొత్త బంతితో పేస్ బౌలర్లకు కూడా సహకారం లభిస్తుంది. గణాంకాల ప్రకారం ఇక్కడ మొదట బ్యాటింగ్ చేసిన జట్లే ఎక్కువసార్లు గెలిచాయి. దీంతో టాస్ గెలిచిన కెప్టెన్ ముందుగా బ్యాటింగ్ వైపు మొగ్గు చూపే అవకాశముంది. 200 ప్లస్ స్కోర్లు నమోదైతే మ్యాచ్‌పై గట్టి పట్టు లభిస్తుంది. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 229 పరుగుల భారీ స్కోరు సాధించింది.

కీలకంగా మారే స్టార్ ప్లేయర్లు

గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. 700కిపైగా పరుగులతో జట్టుకు ప్రధాన బలంగా నిలిచాడు. సాయి సుదర్శన్, జోస్ బట్లర్ కూడా నిలదొక్కుకుంటే గుజరాత్ బ్యాటింగ్ మరింత ప్రమాదకరంగా మారుతుంది. బౌలింగ్‌లో కగిసో రబాడ, రషీద్ ఖాన్ మ్యాచ్‌ను మలుపు తిప్పగలరు. ఆర్సీబీ వైపు చూస్తే రజత్ పాటిదార్ ఈ సీజన్‌లో నాయకత్వంతో పాటు బ్యాటింగ్‌లోనూ మెప్పిస్తున్నాడు. అనుభవజ్ఞుడు విరాట్ కోహ్లీ ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌ల్లో తన ప్రభావం చూపగలడు. టిమ్ డేవిడ్ ఫినిషర్ పాత్రలో కీలకం. భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్ కొత్త బంతితో వికెట్లు తీస్తే రాయలల్ ఛాలెంజర్స్ బెంగళూర్‌కు ఆధిక్యం లభించే అవకాశం ఉంది.

గణాంకాలూ ఆర్సీబీ వైపే

ఈ సీజన్‌లో ఇరు జట్లు ఇప్పటికే మూడు సార్లు తలపడ్డాయి. అందులో రెండు విజయాలు ఆర్సీబీ ఖాతాలో చేరాయి. మొత్తం హెడ్ టు హెడ్‌లోనూ బెంగళూరుకే స్వల్ప ఆధిక్యం. 9 మ్యాచ్‌ల్లో ఆర్సీబీ 5 సార్లు, గుజరాత్ 4 సార్లు విజయం సాధించాయి. ఆర్సీబీ తన చివరి ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింటిలో గెలిచి మంచి జోష్‌లో ఉంది. క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ సాధించిన భారీ విజయం జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అయితే హోమ్ కండిషన్స్, భారీ మ్యాచ్ ఒత్తిడి గుజరాత్‌ను మరింత ప్రమాదకరంగా మార్చే అవకాశముంది.

ఎవరి విజయావకాశాలు ఎక్కువ?

ప్రస్తుత ఫామ్, బ్యాటింగ్ లోతు, బౌలింగ్ సమతూకం చూస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కాస్త ముందంజలో కనిపిస్తోంది. కానీ అహ్మదాబాద్‌లో గుజరాత్‌ను తక్కువ అంచనా వేయడం ప్రమాదమే. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాట్‌తో రాణిస్తే మ్యాచ్ పూర్తిగా మారిపో వచ్చు. మొత్తం మీద అభిమానులకు ఉత్కంఠభరితమైన ఫైనల్ ఖాయమనే అంచనా వ్యక్తమవుతోంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, జోష్ హేజిల్‌వుడ్, రసిఖ్ సలామ్ దార్.

గుజరాత్ టైటాన్స్

సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్, నిశాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్, రషీద్ ఖాన్, రవిశ్రీనివాసన్ సాయి కిషోర్, కగిసో రబాడా, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్.

ఫైనల్ ప్రిడిక్షన్

ఆర్సీబీ - 55 శాతం, గుజరాత్ టైటాన్స్ - 45 శాతంగా గెలుపు అవకాశాలు ఉంది. ఐపీఎల్-2026కు ముగింపు పలికే ఈ ఫైనల్‌లో ఎవరు ట్రోఫీ అందుకుంటారన్న ఉత్కంఠ ఇప్పుడు దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను కట్టిపడేస్తోంది.

కింగ్ కోహ్లీపైనే ఫోకస్

ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీపైనే అందరి దృష్టి. ఈ ఐపీఎల్ సీజన్‌లో గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే 600రన్స్ చేశాడు. జీటీపై బెటర్ రికార్డు ఉంది. గుజరాత్ టైటాన్స్‌పై విరాట్ కోహ్లీ బ్యాట్ ఎప్పుడూ గర్జిస్తూనే ఉంది. తొమ్మిది మ్యాచ్‌ల్లో 503 పరుగులు చేసిన కోహ్లీ.. ఫైనల్‌లోనూ ఆర్సీబీకి కీలక ఆయుధంగా మారనున్నాడు. బెంగళూర్‌లో జరిగిన మ్యాచ్‌లో జీటీపై 81పరుగులు చేసి ఒంటి చేత్తో ఆర్సీబీని గెలిపించాడు. ఇక క్వాలిఫయర్-1లో 43 పరుగులతో రాణించాడు. ఫ్లయింగ్ స్టార్ట్ అందించాడు. బిగ్ మ్యాచ్‌ల్లో ఆడడాన్ని ఆస్వాదించే కోహ్లీ జీటీకి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

మ్యాచ్‌లు: 15
పరుగులు : 600
సగటు: 500
స్ట్రయిక్ రేట్: 164.38
హాఫ్ సెంచరీలు : 5
సెంచరీలు : 1

కోహ్లీ ప్రత్యేకం: పెద్ద మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకునే ఆట. జీటీపై మంచి రికార్డు

రజత్ పాటిదార్(కెప్టెన్)
మ్యాచ్‌లు : 15
పరుగులు: 486
స్ట్రయిక్ రేట్ : 196.76
హాఫ్ సెంచరీలు: 4
బెస్ట్: 33 బంతుల్లో 93
ప్రత్యేకం : మిడిల్ ఓవర్లలో టెంపో మార్చగలసామర్థ్యం

భువనేశ్వర్ కుమార్
వికెట్లు : 26
ఎకానమీ: 8
పవర్ ప్లే వికెట్లు: 16
ప్రత్యేకం:కొత్తబంతితోస్వింగ్

హేజిల్‌వుడ్
వికెట్లు : 13
ఎకానమీ: 9.62
పవర్ ప్లే వికెట్లు: 9
డెత్ ఓవర్లలో ప్రభావం
ప్రత్యేకం:హైప్రెజర్ మ్యాచ్‌లలో కచ్చితమైన లైన్-లెంగ్త్

శుభ్‌మన్ గిల్(కెప్టెన్)
మ్యాచ్‌లు : 15
పరుగులు: 722
స్ట్రయిక్ రేట్ : 163.71
హాఫ్ సెంచరీలు: 6
సెంచరీలు : 1
బెస్ట్: 53 బంతుల్లో 104
ప్రత్యేకం : జీటీ బ్యాటింగ్‌కు ప్రధాన బలం

సాయి సుదర్శన్
మ్యాచ్‌లు : 16
పరుగులు: 710
స్ట్రయిక్ రేట్ : 159.55
హాఫ్ సెంచరీలు: 8
సెంచరీలు : 1
బెస్ట్: 51 బంతుల్లో 100
ప్రత్యేకం : గిల్‌తో కలిసి బలమైన ఓపెనింగ్ జోడీ

గుజరాత్ టైటాన్స్ పేస్‌అటాక్ రబడ, సిరాజ్ ప్రధాన ఆయుధం. ఇద్దరూ ఆరంభంలోనే వికెట్లు అందిస్తున్నారు. రబడ 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ఉన్నాడు. సిరాజ్ 16 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టాడు. ఆర్సీబీకి గతంలో పలు సీజన్లు ఆడిన అనుభవం సిరాజ్‌కు ఉంది. కోహ్లీ, పాటిదార్, జితేష్ బలాలు-బలహీనతలపై మంచి అవగాహనఉంది. కొత్తబంతితో స్వింగ్ దొరికితే టాప్ ఆర్డర్ లేపేయగలడు. పిచ్ పేసర్లకు సహకరిస్తే సిరాజ్ మరింత ప్రమాదకరంగా మారే ఛాన్స్ ఉంది. ఫైనల్లో గుజరాత్‌కు ట్రంప్‌కార్డ్‌గా మారనున్నాడు. పవర్ ప్లేలో సిరాజ్ స్పెల్ మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

డబుల్స్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ

సింగపూర్: భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్ జోడీ 21-19, 21-18తో ప్రపంచ నంబర్ వన్ కొరియా జోడీ కిమ్ వోన్‌సియో-సుంగ్ జెను ఓడించింది. 52 నిమిషాల్లోనే ప్రత్యర్థులను మట్టి కరిపించింది. భానత జోడీ ఫైనల్ చేరడంతో కనీసం రజతం ఖరారు చేసుకుంది. ఆద్యంతం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్లో భారత జోడీ టాప్ గేర్‌లో ఆడింది. ఆరంభం నుంచి కొరియా జంటకు ముచ్చెమటలు పట్టించిన భారత ద్వయం.. రెండు గేమ్స్‌లనూ అలవోకగా నెగ్గింది. ఆదివారం జరగనున్న ఫైనల్లో సాత్విక్‌చిరాగ్ జోడీ.. ఫజర్ అల్ఫియాన్ - ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ (ఇండోనేషియా)/ లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ ఛాంగ్ విజేతతో తలపడనుంది.

ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో నిరాశపర్చిన ఫోగట్

న్యూఢిల్లీ : ఆసియా క్రీడల్లో పాల్గొనాలన్న రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఆశలు ఆవిరయ్యాయి. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన ఏషియన్ గేమ్స్ కోసం సెలెక్షన్ ట్రయల్స్‌లో సెమీఫైనల్లోనే ఓడారు. 53 కేజీల విభాగంలో పోటీపడ్డ వినేశ్... 4-6 పాయింట్ల తేడాతో మీనాక్షిగోయత్ చేతిలోపరాజయం చవిచూశారు. హోరాహోరీగా సాగిన పోరులో వినేశ్, మీనాక్షి చాలాసేపు పోటీపడ్డారు. చివరికి విజయం మాత్రం మీనాక్షి కి దక్కడంతో ఆమె ఫైనల్‌కు చేరుకున్నారు. వినేశ్ ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెజ్లింగ్ సమాఖ్యతో పోరాడారు. ఆ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతులు పొందారు. ఓటమి అనంతరం వినేశ్ స్పందించారు. నేను ఓడిపోలేదు. వ్యవస్థతో పోరాడుతున్నాను. ఒంటరి పోరాటం చేస్తున్నాను. తాను ప్రతిదాని కోసం పోరాడాల్సి వచ్చింది. అయినా న్యాయం జరగలేదు. మళ్లీ తిరిగొస్తా అని వ్యాఖ్యానించింది.

నగల వర్తకులను ముంచేసిన.. పసిడి పన్నులు

ముంబయి, మే 30: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్‌ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన,ఆహారధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70శాతం మేర పడిపోయింది. బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం 6 నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించింది. గతేడాది మే నెల చివరి 2వారాల్లో 25టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ప్రభుత్వ చర్యతో తీవ్రంగా ప్రభావితమైంది. ఈ ఏడాది పసిడికి దూరంగా ఉండాలంటూ ప్రధాని మోదీ దేశ చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

సావరిన్ గోల్డ్ బాండ్స్‌పై 227శాతం రాబడులు

ముంబయి, మే 30: సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి ఆర్బీఐ గుడ్‌న్యూస్ చెప్పింది. ఐదేళ్ల క్రితం జారీ చేసిన ఎస్‌జీబీ 2021-22 సిరీస్-2 బాండ్లకు సంబంధించిన ముందస్తు విమోచన ధర ప్రకటించింది. పెట్టుబడిదారులకు ఊహించని రీతిలో ఏకంగా 227 శాతం అద్భుతమైన రాబడిని అందించేలా యూనిట్‌కు రూ.15,672గా ధరను ఖరారు చేసింది. ఐదేళ్ల కిందట రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసినట్లయితే వారికి ఇప్పుడు రూ. 3.27 లక్షల వరకు రాబడి వచ్చింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చేసిన ఐదేళ్ల తర్వాత, వడ్డీ చెల్లించే తేదీల్లో వాటిని ముందస్తుగానే డబ్బుల్ని విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ సిరీస్ బాండ్లను 2021 జూన్ 1న జారీ చేసినందున, సరిగ్గా ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 1 నుంచి పెట్టుబడిదారులు తమ బాండ్లను నగదుగా మార్చుకునేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. ముందస్తు విమోచన ధరను నిర్ణయించడానికి ఆర్‌బీఐ ఒక నిర్దిష్ట పద్ధతిని అనుసరిస్తుంది. ఐబీజేఏ ప్రచురించే 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధర ఆధారంగా దీనిని లెక్కిస్తారు.

విమోచన తేదీకి ముందున్న మూడు పని దినాల బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. ఈ సిరీస్ కోసం ఈనెల 27,28,29 తేదీల్లోని బంగారం ధరల సగటు ఆధారంగా రూ. 15,672గా ధరను నిర్ణయించారు. 2021లో ఈ బాండ్లను జారీ చేసినప్పుడు, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి ఒక గ్రాము (యూనిట్) ధర రూ.4,792గా ఉంది. ఆఫ్‌లైన్‌లో కొన్నవారికి దీని ధర రూ.4,842గా ఉంది. ఇప్పుడు ఆర్‌బీఐ ప్రకటించిన విమోచన ధర రూ.15,672తో పోలిస్తే, ఆన్‌లైన్ పెట్టుబడిదారులకు ప్రతి గ్రాముపై వడ్డీని మినహాయించి రూ.10,880 నికర లాభం వస్తోంది. కేవలం ఐదేళ్ల కాలంలోనే వారి పెట్టుబడిపై 227.05 శాతం రాబడి లభించినట్లయింది. సాధారణంగా ఎస్‌జీబీల కాలపరిమితి 8 సంవత్సరాలు కాగా, ఐదేళ్ల తర్వాత ఇలాంటి అధిక రాబడితో బయటకు వచ్చే అవకాశం కల్పించడం పెట్టుబడిదారులకు ఎంతో లాభదాయకంగా నిలిచింది.

స్పేస్‌ఎక్స్ 75బిలియన్ డాలర్ల ఐపిఒపైనే ఇన్వెస్టర్ల ఫోకస్

న్యూయార్క్, మే 30: గ్లోబల్ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరోసారి ప్రపంచ పెట్టుబడి మార్కెట్లనే తనవైపు తిప్పుకోగలిగారు. ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న స్పేస్‌ఎక్స్ కంపెనీ ఇప్పుడు చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓ కోసం సిద్ధమవుతోంది. ఈప్రతిపాదన పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తూనే, మరోవైపు అనేక ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. స్పేస్‌ఎక్స్ దాఖలు చేసిన 300 పేజీలకు పైగా ఉన్న ప్రాస్పెక్టస్‌లో కంపెనీ లక్ష్యాలు సాధారణ వ్యాపార ప్రణాళికలను మించి ఉన్నాయి. మానవ జీవితాన్ని బహుగ్రహాలకు విస్తరించడం, చంద్రుడిపై స్థావరాలు నిర్మించడం, ఇతర గ్రహాలపైనగరాలు ఏర్పాటు చేయడం, కృత్రిమ మేధ అభివృద్ధికి సౌరశక్తిని వినియోగించడం వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను సంస్థ ప్రకటించింది.

భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఈ ప్రాజెక్టులు సమీప భవిష్యత్తులో లాభాలను అందిస్తాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్పేస్‌ఎక్స్ ఐపీఓ విజయవంతమైతే కంపెనీ మార్కెట్ విలువ 1.8ట్రిలియన్‌డాలర్లకు చేరుతుందని అంచనా. కంపెనీ దాఖలుచేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం, గత ఆర్థిక సంవత్సరంలో స్పేస్‌ఎక్స్ 18.7 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసింది. అదే సమయంలో కంపెనీ 4.9 బిలియన్ డాలర్ల నష్టాన్ని కూడా చవిచూసింది. సాధారణంగా ఐపీఓలకు వస్తున్న కంపెనీలు లాభదాయకత వైపు అడుగులు వేస్తున్న దశలో ఉంటాయి. జూన్‌లో జరగనున్న స్పేస్‌ఎక్స్ ఐపీఓ ద్వారా కంపెనీ 75 బిలియన్ డాలర్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది విజయవంతమైతే కంపెనీ మార్కెట్ విలువ సుమారు 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ఈ విలువలతో మస్క్ ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా అవతరించే అవకాశాలు ఉన్నాయని నిపుణుల అంచనా. ప్రత్యేక సూపర్‌వోటింగ్ షేర్ల ద్వారా కంపెనీపై పూర్తి నియంత్రణను కూడా మస్క్ కొనసాగించనున్నారు. స్పేస్‌ఎక్స్‌కు ప్రతిపాదించిన 1.8 ట్రిలియన్ డాలర్ల విలువ అనేక ప్రశ్నలకు దారితీస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఆదాయంతో పోలిస్తే ఈ విలువ దాదాపు 100రెట్లు ఎక్కువగా ఉంది. సాధారణంగా ఎస్ అండ్ పీ 500లోని ప్రముఖ కంపెనీలు తమ వార్షిక అమ్మకాల విలువకు 3నుంచి నాలుగు రెట్ల మధ్యే ట్రేడ్ అవుతుంటాయి. అలాంటప్పుడు స్పేస్‌ఎక్స్‌కు 100 రెట్లు విలువ ఇవ్వడం అత్యంత ఆశావహ అంచనాగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. స్పేస్‌ఎక్స్‌కు ప్రధాన బలంగా స్టార్‌లింక్ నిలుస్తోంది.

1.66 లక్షల కోట్లకు పైగా అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్

న్యూఢిల్లీ, మే 30: ఖాతాదారులు తమ పేరుపై ఉన్న క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులను సులభంగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది. బ్యాంకు ఖాతాలు, బీమా పాలసీలు, షేర్లు, డివిడెండ్లు, పెన్షన్ నిధులు వంటి వివిధ ఆర్థిక సంస్థల్లో నిలిచిపోయిన క్లెయిమ్ చేయని ఆస్తుల వివరాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడమే ఈ పోర్టల్ లక్ష్యం. ఇప్పటి వరకు క్లెయిమ్ చేయని ఆస్తులను వెతకడానికి ప్రజలు వేర్వేరు సంస్థల వెబ్‌సైట్లను సందర్శించాల్సి వచ్చేది. కొత్త పోర్టల్ ద్వారా బ్యాంకులు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్లు, షేర్ మార్కెట్ సంబంధిత సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థల వద్ద ఉన్న క్లెయిమ్ చేయని నిధుల సమాచారాన్ని ఒకే చోట పరిశీలించవచ్చు. చాలా మంది ఉద్యోగ మార్పులు, చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల మరణం లేదా పాత పెట్టుబడుల వివరాలు మర్చిపోవడం వంటి కారణాల వల్ల తమ ఆర్థిక ఆస్తులను క్లెయిమ్ చేయకుండా వదిలేస్తుంటారు. అలాంటి వారికి ఈ పోర్టల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే మరణించిన కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న డిపాజిట్లు, బీమా మొత్తాలు లేదా ఇతర ఆర్థిక ఆస్తులను గుర్తించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

వినియోగదారులు తమ పేరు, మొబైల్ నంబర్, పాన్, ఆధార్ లేదా ఇతర అవసరమైన వివరాలతో పోర్టల్‌లో శోధన చేయవచ్చు. సంబంధిత ఆర్థిక సంస్థల్లో ఉన్న క్లెయిమ్ చేయని ఆస్తుల వివరాలు అందుబాటులోకి వస్తాయి. అనంతరం ఆయా సంస్థల నిబంధనల ప్రకారం క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ప్రస్తుతం దేశంలో బ్యాంకులవద్దనే 72 వేల కోట్ల అన్‌క్లెయిమ్డ్ మొత్తాలు ఉంటే జీవితబీమా సంస్థ వద్ద 14వేల కోట్లకు పైగా ఈ మొత్తాలున్నాయి. కీలకమైన ఈపిఎఫ్ఓ వద్ద కూడా సుమారు 80 వేల కోట్లకు పైగా ఉన్నాయని అంచనా. ఈమొత్తాలు ఈఏడాది మరింతపెరిగే అవకాశం ఉంది. ఈ మొత్తాలను అసలైన యజమానులు లేదా వారి వారసులకు చేరవేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్ ద్వారా ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరగడంతో పాటు, ప్రజలు తమకు చెందిన ఆస్తులను సులభంగా గుర్తించి తిరిగి పొందే అవకాశం లభించనుంది. డిజిటల్ ఇండియా కార్యాచరణలో ప్రభుత్వం ఈవెబ్‌సైట్‌ను తెచ్చింది.



ఎన్‌ఎస్ఇ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్ సమయంపొడిగింపు

ముంబయి, మే 30: స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేసే పెట్టుబడిదారులు ట్రేడర్ల కోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ట్రేడింగ్ సమయాన్ని 10 నిమిషాలు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మార్పు క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సిఎఎస్) అమలులో భాగంగా తీసుకొస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఈ వెల్లడించింది. కొత్త విధానం ప్రకారం, ప్రస్తుతం మధ్యాహ్నం 3:30గంటలకు ముగుస్తున్న ట్రేడింగ్ సెషన్‌ను మధ్యాహ్నం 3:40గంటల వరకు పొడిగించనున్నారు. ఈ మార్పు ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. క్లోజింగ్ ఆక్షన్ సెషన్ అనేది మార్కెట్ ముగిసే సమయంలో జరిగే ప్రత్యేక ట్రేడింగ్ ప్రక్రియ. ఈ సమయంలో మార్కెట్ భాగస్వాములు కొనుగోలు, విక్రయ ఆర్డర్లను నమోదు చేస్తారు. వీటి ఆధారంగా ఆయా షేర్లకు తుది ముగింపు ధర నిర్ణయించబడుతుంది. ఈ విధానం ద్వారా మార్కెట్ ముగింపు సమయంలో ధరల నిర్ణయంలో మరింత పారదర్శకత, స్థిరత్వం తీసుకురావడంలక్ష్యంగా ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది. ఇతర సెషన్లలో మార్పులుండవు. ప్రీఓపెన్ సెషన్ యథాతథంగా కొనసాగుతుంది. ట్రేడ్ మాడిఫికేషన్ విండోలో ఎలాంటి మార్పు ఉండదు. క్యాష్‌మార్కెట్ ట్రేడింగ్ సమయాల్లో కూడా మార్పులు ఉండవు. కేవలం ఈక్విటీడెరివేటివ్స్ సెగ్మెంట్‌లో మాత్రమే ట్రేడింగ్ సమయం పొడిగిస్తారు. క్యాష్ మార్కెట్‌లో ప్రవేశపెట్టనున్న క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌కు అనుగుణంగా డెరివేటివ్స్ మార్కెట్‌లో కూడా సమన్వయం ఉండేలా ఈనిర్ణయంతీసుకున్నట్లు ఎన్‌ఎస్‌ఈ తెలిపింది. క్యాష్, డెరివేటివ్స్ మార్కెట్ల మధ్య మెరుగైన సమన్వయం, ముగింపు ధరలలో పారదర్శకత, మార్కెట్ స్థిరత్వం, అంతర్జాతీయ మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవస్థ అభివృద్ధి సాధ్యమవుతాయని భావిస్తున్నారు. డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు ధరను నిర్ణయించే విధానంలో మార్పు ఉండదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ స్పష్టం చేసింది.

స్పైస్‌జెట్‌కు 124 కోట్ల పన్ను నోటీసు

న్యూఢిల్లీ, మే 30: బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. నెలల తరబడి జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైనందుకు గాను జీఎస్టీ డైరెక్టరేట్ ఆ సంస్థకు రూ. 124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. నిర్దేశిత గడువులోగా స్పైస్‌జెట్ రిటర్నులు దాఖలు చేయకపోవడంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్62 కింద అధికారులు ప్రొవిజనల్ అసెస్‌మెంట్ నిర్వహించి ఈ పన్ను డిమాండ్‌ను ఖరారు చేశారు. నవంబర్ నెలకు రూ. 44.44 కోట్లు, డిసెంబర్‌కు రూ. 43.79 కోట్లు, జనవరికి రూ. 12.19 కోట్లు, ఫిబ్రవరికి రూ. 12.10 కోట్లు, మార్చి నెలకు రూ. 12.12 కోట్ల చొప్పున బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి ఈ నెల 25న షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ, సంస్థ నుంచి ఇంకా పూర్తిస్థాయి స్పందన రాలేదని అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రిటర్నులను స్పైస్‌జెట్ వెంటనే దాఖలు చేసి, చట్టపరమైన నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులుస్పష్టం చేశారు. స్పైస్‌జెట్ ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది. నిన్నటి ట్రేడింగ్‌లో బీఎస్‌ఈలో స్పైస్‌జెట్ షేరు ధర 0.47 శాతం తగ్గి రూ.12.75 వద్ద ముగిసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.